



# చైతన్యరథం




సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


**రోజుకో మాట.. పూటకో కూత!**
- లిక్కర్ స్కాంలో వైసీపీ కప్పగంతులు

5

# సెప్టెంబర్ 1 నుంచి కొత్త బార్ పాలసీ




మద్యం పాలసీ అంటే కేవలం ఆదాయమే కాదని.. ప్రజల ఆరోగ్యమే ముఖ్యమనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఆల్కహాల్ శాతం తక్కువగా ఉండే మద్యం విక్రయాలపై దృష్టి పెట్టాలన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి కొత్త బార్ పాలసీ అమల్లోకి వస్తుందన్నారు. బార్‌ల కేటాయింపులోనూ గీత కార్మికులకు పది శాతం రిజర్వేషన్ అమలు చేస్తామన్నారు.

- మంత్రివర్గ ఉపసంఘం నివేదిక ఆధారంగా కొత్త విధానం
- లాటరీ పద్ధతి ద్వారా బార్ల కేటాయింపు
- మద్యం పాలసీ అంటే ఆదాయం కాదు... ప్రజల ఆరోగ్యం ముఖ్యం
- ఆల్కహాల్ కంటెంట్ తక్కువ ఉండే మద్యం అమ్మకాలతో నష్టం తగ్గించవచ్చు
- పేదల ఇళ్లు, ఒళ్లు గుల్ల కాకుండా చూడాలి
- బార్లలో కూడా గీత వర్గాలకు 10 శాతం షాపులు
- ఎక్సయిజ్‌శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు

2

## నాణ్యమైన జీవన ప్రమాణాలే లక్ష్యం



ప్రభుత్వ పాలనలో విజన్, పీపుల్, నేచర్, టెక్నాలజీలకు ప్రాధాన్యత ఇస్తే అత్యుత్తమ ఫలితాలు వస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన జీవన ప్రమాణాలను అందించటమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ప్రభుత్వ శాఖలు ఆయా రంగాల్లో ముందస్తు ప్రణాళికలు.. స్వల్ప, మధ్య, దీర్ఘ కాలిక లక్ష్యాలకు అనుగుణంగా రూపొందించుకుని ఒక విజన్‌తో పనిచేస్తూ.. ప్రపంచ పోకడలను గమనిస్తూ నూతన అవకాశాలను అందుకోవాలన్నారు. మన ఉత్పత్తులకు విలువ జోడింపు అనేదే కీలకం.. దాని ద్వారానే రాష్ట్ర స్థూల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని సూచించారు. 2029 నాటికి రూ. 5.42 లక్షలు తలసరి ఆదాయం లక్ష్యంగా పెట్టుకోవాలని దిశానిర్దేశం చేశారు.

- అందుకనుగుణంగా ప్రణాళికలు
- పీపుల్, విజన్, నేచర్, టెక్నాలజీ అంశాలకు పాలనలో ప్రాధాన్యత
- 2029 నాటికి రూ.5.42 లక్షల తలసరి ఆదాయం సాధించాలి
- ప్రతీ విభాగానికి ఓ ఇండికేటర్ ఉండాలి.. అప్పుడే ఉత్తమ ఫలితాలు
- నీతి ఆయోగ్ తరహాలో ప్రణాళికా విభాగం డ్రైవ్ చేయాలి
- 15 నుంచి ఆన్‌లైన్లో 700 ప్రభుత్వ సేవలు
- రాష్ట్ర స్థూల ఉత్పత్తిపై ప్రణాళికా శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు

2

### అధికార భాషా సంఘానికి..

## మండలి వెంకట కృష్ణారావు పేరు



తెలుగు భాష కోసం అహర్నిశలు కృషి చేసిన మండలి వెంకట కృష్ణారావు పేరును అధికార భాషా సంఘానికి పెడతామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. సోమవారం మండలి శతజయంతి వేడుకల్లో సీఎం మాట్లాడారు. దివిసీమ ఉప్పెన సమయంలో మండలి చేసిన సేవలు మరిచిపోలేనివన్నారు. మహాత్ముడి ఆశయాలను తూచ తప్పకుండా ఆచరించిన ఆదర్శమూర్తి మండలి అని కొనియాడారు. ఆయన జీవితం మొత్తాన్ని పేదల ప్రయోజనాల కోసమే అంకితం చేశారన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు నడిపిన మండలి నేటి తరానికి ఆదర్శమన్నారు. తెలుగు భాష అభివృద్ధికి మండలి చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఆయన బాటలోనే తనయుడు బుద్ధప్రసాద్‌కూడా నడుస్తూ ఆదర్శవంతమైన రాజకీయాలు చేస్తూ, తెలుగుభాష అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు.

3

- తెలుగు భాష పరిరక్షణ కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి
- ఆయనతో కలిసి పని చేసే అవకాశం రావడం నా అదృష్టం
- దివిసీమ ఉప్పెన సమయంలో ఆయన సేవలు మరువలేనివి
- తండ్రి బాటలోనే భాషాభ్యున్నతికి పాటుపడుతున్న బుద్ధ ప్రసాద్
- శతజయంతి వేడుకల్లో సీఎం చంద్రబాబు

### విద్యలో ఏపీని మోడల్ స్టేట్‌గా తీర్చిదిద్దడంలో..

## టీచర్ల పాత్ర కీలకం



- విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటన
- మంత్రిని కలిసిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు
- ఎంఈవో పోస్టుల్లో జెడ్పీ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి
- ఉపాధ్యాయుల ప్రతి సమస్యను పరిష్కరిస్తామని మంత్రి హామీ

4

## ప్రభుత్వ పాఠశాలలో నో అడ్మిషన్ బోర్డు



- మంత్రి లోకేష్ ఆనందం
- హెచ్ఎం ఫయాజుద్దీన్, టీచర్లకు కృతజ్ఞతలు

4

### 15 నుంచి మహిళలకు

## ఉచిత బస్సు ప్రయాణం

- రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు అనుమతి
- పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్‌ల్లో ప్రయాణించేందుకు అవకాశం
- రవాణా మంత్రి మండిపల్లి

6

### లార్డ్స్‌లో అద్భుతం

## టీమిండియా సంచలన విజయం

- ఐదో టెస్ట్‌లో ఆరు పరుగులతో గెలుపు
- 5 మ్యాచ్‌ల సిరీస్ 2-2తో సమం
- ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సిరాజ్

17

# నాణ్యమైన జీవన ప్రమాణాలే లక్ష్యం



- అందుకనుగుణంగా ప్రణాళికలు
- పీపుల్, విజన్, నేచర్, టెక్నాలజీ అంశాలకు పాలనలో ప్రాధాన్యత
- 2029 నాటికి రూ.5.42 లక్షల తలసరి ఆదాయం సాధించాలి
- ప్రతీ విభాగానికి ఓ ఇండికేటర్ ఉండాలి..అప్పుడే ఉత్తమ ఫలితాలు
- నీతి ఆయోగ్ తరహాలో ప్రణాళికా విభాగం డ్రైవ్ చేయాలి
- 15 నుంచి ఆన్‌లైన్లో 700 ప్రభుత్వ సేవలు
- రాష్ట్ర స్థూలఉత్పత్తిపై ప్రణాళికాశాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి (చైతన్యరథం): విజన్, పీపుల్, నేచర్, టెక్నాలజీలకు ప్రాధాన్యత ఇచ్చి పాలనచేస్తే అత్యుత్తమ ఫలితాలు వస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. నాణ్యమైన జీవన ప్రమాణాలను సాధించే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి, కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌పై ప్రణాళికా శాఖతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలో సోమ వారం సమీక్ష నిర్వహించారు. తలసరి ఆదాయం పెంచడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలని సీఎం అన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తలసరి ఆదాయం రూ. 3,47,871 సాధించాలని, దానికి అనుగుణంగా 2029 నాటికి రూ.5.42లక్షలు తలసరి ఆదాయం వచ్చేలా లక్ష్యంగా పెట్టుకోవాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖలు ఆయా రంగాల్లో ముందస్తు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి. స్వల్ప, మధ్య, దీర్ఘ కాలిక లక్ష్యాలకు అనుగుణంగా విజన్‌తో పనిచేయాలి. ప్రపంచ పోకడలను గమనిస్తూ అవకాశాలను అందుకోవాలి. ప్రజలను, సమాజాన్ని, కుటుంబాలను, వ్యక్తులను దృష్టిలో పెట్టుకుని కార్యక్రమాలు అమలు చేయాలి. ఫ్యామిలీ ఒక యూనిట్‌గా తీసుకుని పథకాలు, కార్యక్రమాలు రూపొందించాలి... కనీస అవసరాలు అందించాలి. పథకాలతో పాటు ప్రజల ఆదాయాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలి. పర్యావరణానికి మేలు చేసే విధంగా ప్రభుత్వ విధానాలు, ప్రజల ఆలోచనలు ఉండాలి.సహజ వనరులను రక్షించుకుంటూ ప్రకృతిని కాపాడుకోవాలి. ఒక పరిశ్రమలో తయారైన వేస్ట్ మరో పరిశ్రమకు ముడి సరుకు అయ్యేలా చేసి సర్క్యులర్ ఎకానమీకి నాంది పలకాలి. సహజ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలి. అత్యుత్తమ టెక్నాలజీని పాలనకు అనుసంధానించి మెరుగైన సేవలు అందించాలి. ఆరోగ్యం నుంచి వ్యవసాయం వరకు టెక్నాలజీని భాగస్వామి చెయ్యాలి.దప్రజల కోసం.. విజన్ రూపొందించుకుని పర్యావరణం దెబ్బతినకుండా చూసుకుంటూ టెక్నాలజీని అనుసంధానం చేస్తూ పాలనసాగిస్తే మంచిఫలితాలు వస్తాయి. అందుకే పీపుల్, విజన్, నేచర్, టెక్నాలజీ అంశాలకు పాలనలో ప్రాధాన్యం ఇస్తూ సమన్వయం తో పనిచేస్తే అత్యుత్తమ ఫలితాలువస్తాయని ఆ దిశగా అధికారులు, ఆయా శాఖలు పనిచేయాలని సీఎం సూచించారు.

## ఉత్పత్తులకు విలువ జోడింపే కీలకం

వివిధ రంగాల్లో రోజువారీగా మారే పరిణామాలకు.. మార్పులకు అనుగుణంగా కార్యక్రమాలు ఉండాలి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వస్తున్న మార్పుల మేరకు ప్రణాళికలు రూపొందించుకోవాలి. మన ఉత్పత్తులకు విలువ జోడింపు అనేదే కీలకం. దాని ద్వారానే రాష్ట్ర స్థూల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుంది. మైనింగ్, వ్యవసాయ ఉత్పత్తుల్లో జీవీఏ ప్రధానమైన అంశం. జీఎస్డీపీ వృద్ధి అయితేనే ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించగలం. వివిధ రంగాల్లో ఉత్తమ ఫలితాలు వచ్చేలా కార్యాచరణ తయారు చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రస్తుతం ఉద్యాన పంటల ద్వారా రూ.1,26,098 కోట్ల రూపాయల జీవీఏ వచ్చిందని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఆక్వా అనుబంధ పరిశ్రమ ద్వారా రూ.1.12 లక్షల కోట్ల మేర జీవీఓ జోడించినట్టు అధికారులు వెల్లడించారు.

## రాష్ట్రంలో మెరుగైన జీవన ప్రమాణాలే లక్ష్యం

ఆర్థికాభివృద్ధితో పాటు రాష్ట్రంలోని ప్రజలకు నాణ్యమైన జీవన ప్రమాణాలు ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. అత్యధిక తలసరి ఆదాయం కలిగిన రాష్ట్రంగా ఏపీ తయారు కావాలి. బెటర్ సొసైటీ, బెటర్ లివింగ్ స్టాండర్డ్స్‌ను తీసుకువచ్చేలా ప్రభుత్వ శాఖలు పని చేయాలి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రమాణాలు ఎలా నిర్దేశిస్తున్నారో పరిశీలించండి. ప్రతీ రంగంలోనూ ఏపీ ముఖ్య భూమిక పోషించాలి. గ్రామస్థాయి నుంచి కుటుంబం వారీగా పర్యవేక్షణ జరగాలి. లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్రం ఇచ్చే నిధులకు సంబంధించిన సమాచారాన్ని క్రోడీకరించండి. ప్రతీ కుటుంబం తాలూకు ఆర్థిక, ప్రజారోగ్య వివరాలు నమోదు కావాలి. ఫారెస్టు గ్రీన్ కవర్, ఎయిర్ క్వాలిటీ, తలసరి విద్యుత్ వినియోగం ఇలా అన్ని అంశాలను ఆయా శాఖలు నమోదు చేయాలి. కేవలం ఆదాయం, సంపద సృష్టికి మాత్రమే పరిమితం కావొద్దని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## ప్రతీ విభాగానికీ ఓ ఇండికేటర్

వివిధ రంగాల్లో ఫలితాలను సాధించేందుకు ఏ ప్రమాణాల్ని నిర్దేశించుకున్నారనేది కూడా కీలకం. ప్రస్తుతం అవేర్ ద్వారా 42 అంశాలను కొలుస్తున్నాం. వివిధ ప్రభుత్వ శాఖలు కూడా ఇదే స్థాయిలో ప్రమాణాలు నిర్దేశించుకుని ఇండికేటర్లు ఏర్పాటుచేసుకోవాలి. విద్యుత్, రవాణా, జలవనరులు, పరిశ్రమలు, స్వచ్ఛాంధ్ర ఇలా అన్ని విభాగాలూ ఇండికేటర్లను నిర్దేశించుకోవటం ద్వారా మెరుగైన జీవన ప్రమాణాల్ని సాధించే అవకాశం ఉంటుంది. ఈ ప్రమాణాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎలా ఉన్నాయో కూడా ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలి. ఈ నెల 15 నుంచి ప్రభుత్వం అందించే 700 సేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలి. కేవలం 60 లక్షల జనాభా, పరిమితమైన వనరులతో సింగపూర్ దేశం అంతర్జాతీయంగా విజయాలు సాధిస్తోంది. భారత్‌లో 140 కోట్లకు పైగా జనాభా, అపారమైన వనరులతో చాలా విజయాలు సాధించే అవకాశం ఉంది. బయటి ప్రపంచాన్ని చూడకుండా మనకు మనమే తెలివైన వాళ్లని భావించుకోవడం సరికాదు. ఆర్టీజీఎస్ ద్వారా వచ్చే సమచారాన్ని క్రోడీకరిస్తే అది అతిపెద్ద సంపద అవుతుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఆ సమాచారాన్ని విశ్లేషించి వినియోగించుకుంటే ప్రభుత్వ శాఖల సామర్థ్యాన్ని పెంచుకునే అవకాశముంది. అలాగే ప్రతీ త్రైమాసికానికీ సాధిస్తున్న పురోగతిపై ప్రభుత్వ శాఖలు సమీక్షించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, సీఎస్ కె.విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 1 నుంచి కొత్త బార్ పాలసీ

- మంత్రివర్గ ఉపసంఘం నివేదిక ఆధారంగా కొత్త విధానం
- లాటరీ పద్ధతి ద్వారా బార్ల కేటాయింపు
- మద్యం పాలసీ అంటే ఆదాయం కాదు... ప్రజల ఆరోగ్యం ముఖ్యం
- ఆల్కహాల్ కంటెంట్ తక్కువ ఉండే మద్యం అమ్మకాలతో నష్టం తగ్గించవచ్చు
- పేదల ఇళ్లు, ఒళ్లు గుల్ల కాకుండా చూడాలి
- బార్లలో కూడా గీత వర్గాలకు 10 శాతం షాపులు
- సమీక్షలో సీఎం చంద్రబాబు



అమరావతి (చైతన్యరథం): మద్యం పాలసీ అనగానే దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వాలైనా ఆదాయం గురించి చూస్తాయని... కానీ మద్యం పాలసీ అంటే ఆదాయమే కాదని.. ప్రజల ఆరోగ్యమే ముఖ్యమనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఆల్కహాల్ కంటెంట్ తక్కువ ఉన్న మద్యం అమ్మకాల ద్వారా మద్యం వినియోగదారుల ఆరోగ్యాన్ని చాలా వరకు కాపాడవచ్చునన్నారు. మద్యం పాలసీని కేవలం ఆదాయ మార్గంగా మాత్రమే భావించొద్దని...ప్రజల ఆరోగ్యాలు ప్రధానమనే విషయాన్ని కూడా గుర్తుపెట్టుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాణ్యత లేని మద్యం కారణంగా కొన్ని లక్షల కుటుంబాలు నష్టపోయాయన్న విషయాన్ని సీఎం గుర్తుచేశారు. పేదల ఇళ్లు, ఒళ్లు గుల్ల కాకుండా చూడాల్సిన అవసరం ఉందని సీఎం స్పష్టం చేశారు.

సోమవారం సచివాలయంలో ఆబ్కారీ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. మంత్రులు కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, అధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు. ప్రస్తుతం ఉన్న బార్ పాలసీ గడువు తీరడంతో.... సెప్టెంబర్ 1 నుంచి కొత్త పాలసీ రావాల్సి ఉంది. అధికారులు సీఎంకు కొత్త పాలసీపై ప్రతిపాదనలు వివరించారు. మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన నివేదిక, ప్రతిపాదనల ఆధారంగా కొత్త పాలసీకి రూపకల్పన చేసినట్లు సీఎం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 840 బార్లు ఉన్నాయి. కొత్త పాలసీలో లాటరీ పద్ధతి ద్వారా బార్లకు అనుమతులు ఇస్తారు. 50 వేల లోపు జనాభా ఉంటే రూ.35 లక్షలు, 5 లక్షల లోపు జనాభా ఉంటే రూ.55 లక్షలు, 5 లక్షల పైన జనాభా ఉంటే రూ.75 లక్షల చొప్పున లైసెన్స్ ఫీజు ఏడాదికి పెట్టాలనే సూచన మంత్రివర్గ ఉప సంఘం నుంచి వచ్చింది. కొత్త పాలసీలో అప్లికేషన్ ఫీజ్, లైసెన్స్ ఫీజు ద్వారా రూ.700 కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేశారు. ప్రతి బార్‌కు కనీసం 4 అప్లికేషన్లు రావాలనే నిబంధనను పెట్టనున్నారు. బార్ పాలసీలో కూడా గీత కులాలకు 10 శాతం బార్లు దక్కేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. లిక్కర్ షాపుల్లో ఎలా అయితే 10 శాతం వారికి ఇచ్చారో... అదే విధంగా బార్లలో కూడా ఆ వర్గాలకు బార్లు కేటాయించనున్నారు.

పొరుగు రాష్ట్రాల పరిధిలో సరిహద్దుల్లో మద్యం అమ్మకాలు పెరగడానికి గల కారణాలు కూడా అధికారులు సీఎంకు వివరించారు. ఏపీలో రేట్లు తగ్గడం, అన్ని బ్రాండ్లు అందుబాటులో ఉండడం, నాణ్యమైన మద్యం దొరకడంతో మన రాష్ట్రానికి చెందిన మద్యం వినియోగదారులు ఇక్కడే మద్యం కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. దీంతో మన దగ్గర సరిహద్దు ప్రాంతాల్లోని లిక్కర్ షాపుల్లో అమ్మకాలు పెరగగా.... పొరుగు రాష్ట్రాల్లో అమ్మకాలు తగ్గాయని అధికారులు తెలిపారు. గతంలో మన రాష్ట్రంలో నాణ్యమైన మద్యం లేకపోవడం, అధిక ధరలు, మంచి బ్రాండ్లు దొరక్క పోవడం వల్ల పొరుగు రాష్ట్రాలకు వెళ్లి మద్యం తాగేవాళ్లని గుర్తు చేశారు. మరోవైపు దీన్ని సొమ్ము చేసుకోవడానికి అక్రమంగా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తెచ్చే వాళ్లని... ఇప్పుడు ఆ సమస్య లేకుండా పోయిందని అధికారులు చెప్పారు. అయితే ఇప్పుడు 12 జిల్లాల్లో పూర్తి స్థాయిలో ఐడీ లిక్కర్ ఫ్రీ జిల్లాలుగా ప్రకటించామని... ఈ నెలలో మరో 8 జిల్లాలను ఇల్లిసిట్లీ డిస్టిల్డ్ లిక్కర్ ( ఐడి లిక్కర్) ఫ్రీ జిల్లాలుగా ప్రకటిస్తామని చెప్పారు. సెప్టెంబర్ నాటికి మిగిలిన 6 జిల్లాలను కూడా ఐడీ లిక్కర్ ఫ్రీ జిల్లాలుగా ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.

# అధికార భాషా సంఘానికి..
# మండలి వెంకట కృష్ణారావు పేరు

- తెలుగు భాష పరిరక్షణ కోసం కృషి చేసిన మహెూన్నత వ్యక్తి
- ఆయనతో కలిసి పని చేసే అవకాశం రావడం నా అదృష్టం
- దివిసీమ ఉప్పెన సమయంలో ఆయన సేవలు మరువలేనివి
- తండ్రి బాటలోనే భాషాభ్యున్నతికి పాటుపడుతున్న బుద్ధ ప్రసాద్
- శతజయంతి వేడుకల్లో సీఎం చంద్రబాబు



విజయవాడ (చైతన్యరథం): తెలుగు భాష కోసం అహర్నిశలు కృషి చేసిన మండలి వెంకట కృష్ణారావు పేరును అధికార భాష సంఘానికి పెడతాం.. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తి మండలి వెంకట కృష్ణారావు.. దివిసీమ ఉప్పెన సమయంలో ఆయన చేసిన సేవలుమరిచిపోలేనివి.. మహాత్ముని ఆశయాలను తూచాతప్పకుండా పాటించిన వెంకట కృష్ణారావు మనందరికీస్ఫూర్తి అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో సోమవారం నిర్వహించిన మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...తాను ఈ కార్యక్రమానికి రావడానికి ఓ ముఖ్యకారణం ఉందన్నారు.నేటి తరానికి విలువలతో కూడిన రాజకీయాలు ఎలా ఉంటాయో తెలియాలి. 1978-1983 మధ్య కాలంలో మండలి వెంకట కృష్ణారావుతో ఎమ్మెల్యేగా కలిసి పని చేసే అవకాశం నాకువచ్చింది. విలువలతో కూడిన రాజకీయాలు, సేవాభావంతో పనిచేసిన నాయకత్వాన్ని ఒకప్పుడు చూశాం. ఇప్పుడు పూర్తిగా విలువలు పడిపోయాయి. అడ్డదారుల్లో డబ్బు సంపాదించడమే ధ్యేయంగా ఉంటున్నారు. గాంధీజీ ఆశయాలను తూచా తప్పకుండా పాటించిన మండలి వెంకటకృష్ణారావు మహాత్మునికి నిజమైనవారసుడని సీఎం చంద్రబాబు కొనియాడారు.

## గజానికో దిగ్గజం

సాహితీ, సాంస్కృతిక, రాజకీయ, సినీ రంగాలకు ఈ కృష్ణా తీరం వేదిక. దేశానికి మహామహులను అందించిన గడ్డ ఇది. భోగరాజు పట్టాభి సీతారామయ్య, గొట్టిపాటి బ్రహ్మయ్య, చండ్ర రాజేశ్వరరావు, కెఎల్ రావు వంటి రాజకీయ ఉద్దండులు ఇక్కడ పుట్టిన వారే. కృష్ణా పత్రిక వ్యవస్థాపకులు ముట్నూరు కృష్ణారావు, ఆంధ్ర పత్రిక కాశీనాథుని నాగేశ్వరరావు, పత్రికా ప్రముఖులు నార్ల వెంకటేశ్వరావు, ఈనాడు రామోజీ రావు, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత విశ్వనాథ సత్య నారాయణ, బ్రిటిష్ కాలంలో ఇండియా క్రికెట్ టీం కెప్టెన్‌గా ఆడిన సికె.నాయుడు ఈజిల్లాలోనే జన్మించారు. అలాగే సంఘ సంస్కర్త త్రిపురనేని రామస్వామి, జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య, అయ్యదేవర కాళేశ్వరావు, గోరా వంటి మహనీయులు ఈ గడ్డపైనే పుట్టారు. వీరంతా నేటి తరానికి స్ఫూర్తిగా నిలిచారని సీఎం చంద్రబాబు అన్నారు.

## ఉప్పెనలో మర్చిపోలేని సాయం

1977 నవంబర్ 19వ తేదీన దివిసీమలో వచ్చిన ఉప్పెన 12 వేల మంది ప్రాణాలు తీసింది. లక్షల మందిని నిరాశ్రయులను చేసింది. దేశ చరిత్రలోనే ఇలాంటి ఉప్పెన చూడలేదు. నాటి ప్రళయంలో ప్రజలను ఆదుకోవడంతోపాటు, ఆ తరువాత కాలంలో ప్రజలకు కనీస అవసరాలు అందించడంలో వెంకట కృష్ణారావు అందించిన సేవలను సమాజం ఎప్పటికీ మరిపోలేదు. తుఫానులో ప్రాణాలకు తెగించి అనాథ పిల్లలను రక్షించారు. ఉప్పెన అనంతరం వేలాది శవాలతో నిండిన ఆ ప్రాంతంలో ఆయన పర్యటించి శవ దహన కార్యక్రమాలుచేశారు. ఆయన పిలుపుతో అనేక సంస్థలు, వ్యక్తులు తరలివచ్చి నాడు దివిసీమ బాధితులకు సాయంగా నిలిచారు. దేశ, విదేశాల సహాయంతో పునర్నిర్మాణ పనులు చేపట్టేలా చూశారు. పక్కా ఇళ్లు, కరకట్టలు, షెల్టర్లు నిర్మించారు. దివిసీమ ఉప్పెన బాధితులను ఆదుకోవడాడానికి నాడు ఎన్టీఆర్ జోలె పట్టి విరాళాలుసేకరించారు. నేను కూడా ముఖ్యమంత్రిగా 1996లో సూపర్ సైక్లోన్ చూశాను. ఆ రోజు ఉభయ గోదావరి జిల్లాలు, అతలాకుతలం అయ్యాయి. విశాఖలో హుద్ హుద్ సమయంలోనైతే పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకూ అక్కడే ఉండి పనిచేశాననని సీఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు.

## మండలి జీవితం పేదలకు అంకితం

మచిలీపట్నం హిందూ కాలేజీలో బీఏ చదివిన కృష్ణారావు విద్యార్థి దశలోనే ఖద్దరు ధరించి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్యం కోసం పోరాడడమే కాకుండా.. నిరుపేద విద్యార్థులకు సాయం చేసేవారు. పుస్తకాలు, దీపాల కోసం కిరోసిన్ సేకరించి పేద విద్యార్థులకు సాయంచేశారు.ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చి.. యువ నాయకుడిగా పేదల సేవలో తరించారు. 1945లో జిల్లా విద్యార్థి కాంగ్రెస్ కార్య నిర్వాహక కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అదే ఏడాది ముంబైలో మహాత్మా గాంధీని కలిశారు. 1948-52 మధ్య కృష్ణా జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుడిగా పనిచేశారు. 1952లో నాడు రాయలసీమ కరవులో విరాళాలు సేకరించి సాయం చేశారు. కృష్ణా జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా పనిచేశారు. అంతే కాదు సముద్రపు ఒడ్డునున్న భూమిని సాగులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. దీంట్లో భాగంగా 15 వేల ఎకరాలను సాగులోకి తెచ్చి.. పేదలకు అందేలా చేశారు. దివి, కైకలూరు తాలూకాలో 50,000ఎకరాల బంజరు భూమి పేదలకు పంచిపెట్టేలా కృషి చేశారు. సహకార సంఘాల ద్వారా వ్యవసాయాభివృద్ధి చేసేలా ప్రోత్సహించి. 30 వేల ఎకరాల భూమిని సాగులోకి తెచ్చి,11వేల కుటుంబాలకు జీవనోపాధి కల్పించిన మహెూన్నత వ్యక్తి మండలి అని సీఎం చంద్రబాబు అన్నారు.

## తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని కృషి

తెలుగు భాష అభివృద్ధికి మండలి ఎంతో పాటు పడ్డారు. 1957లో ఏప్రిల్‌లో ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలను హైదరాబాద్‌లో అద్భుతంగా నిర్వహించారు. ప్రపంచ తెలుగు సంఘాల ప్రతినిధులను ఒక వేదిక మీదకు తెచ్చిన ఘనత మండలిదే. చట్టసభల్లో ప్రతినిధిగా ఉన్నా... సమాజ సేవలో బిజీగా ఉన్నా.. తెలుగు భాషపై మండలి కృష్ణారావు మమకారాన్ని వీడలేదు.తెలుగు భాషా సంస్కృతి సేవలో తరించారు. ప్రథమ, ద్వితీయ ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించారు. అంతర్జాతీయ తెలుగు సంస్థ, విదేశాంధ్ర సేవాకేంద్రాలను స్థాపించారు. 1981లో అంతర్జాతీయ తెలుగు సంస్థ అధ్యక్షులుగా నియమితులైన ఆయన.. కౌలాలంపూర్లో రెండవ ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించారు. పీవీ మంత్రివర్గంలో ఆయన సాంఘికసంక్షేమ, సహకారశాఖల మంత్రిగా, జలగం వెంగళరావు మంత్రివర్గంలో విద్యా, సాంస్కృతిక శాఖా మంత్రిగా పనిచేశారు. అలాగే విద్యా రంగంలో అనేక సంస్కరణలు తెచ్చారు. మేధావుల సూచనలతో విద్యా శాఖను పునర్వ్యస్థీకరించారు. వరంగల్ కాకతీయ యూనివర్శిటీ, గుంటూరులో నాగార్జునా యూనివర్శిటీ లస్థాపనకు కృషిచేశారు.నిజాంకాలేజీ గ్రౌండ్స్‌లో 1974లో వారంరోజులపాటు అఖిలభారత తెలుగు సాంస్కృతికోత్సవాలను నిర్వహించి..అధికార భాషా సంఘం నెలకొల్పేందుకు కారణమయ్యారని సీఎం చంద్రబాబు కొనియాడారు.

## తండ్రి బాటలోనే తనయుడు

మండలి వెంకట కృష్ణారావు తనయుడు బుద్ధ ప్రసాద్ కూడా తండ్రి అడుగుజాడల్లోనే నడుస్తున్నారు. ఆదర్శవంతమైన రాజకీయాలు చేస్తున్నారు.వివాదాలకు దూరంగా ఉంటూ నిరంతరం నియోజకవర్గ అభివృద్ధి గురించే ఆలోచనచేస్తున్నారు. తండ్రిలాగే తెలుగు భాషోద్యమానికి తనవంతు సేవ చేస్తున్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం మా బాధ్యత. దీంతోపాటు నేటి తరానికి విలువలుతెలియాలి. అందుకోసమే గరికపాటి నరసింహారావుని ప్రభుత్వ సలహాదారులుగా ఉండమని కోరాను. కానీ ఆయన సున్నితంగా తిరస్కరిస్తున్నారు. ఈ సందర్భంగా మరోసారి దీనిపై ఆయన ఆలోచన చేయాలని కోరుతున్నాం. మండలి వెంకట కృష్ణారావు స్ఫూర్తితో మనందరం ముందుకు సాగుదామని సీఎం చంద్రబాబు పిలుపు ఇచ్చారు.











## విద్యలో ఏపీని మోడల్ స్టేట్‌గా తీర్చిదిద్దడంలో..

# టీచర్ల పాత్ర కీలకం

- విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటన
- మంత్రిని కలిసిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు
- ఎంఈవో పోస్టుల్లో జెడ్పీ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి
- ఉపాధ్యాయుల ప్రతి సమస్యను పరిష్కరిస్తామని మంత్రి హామీ



ఉండవల్లి (చైతన్యరథం): ప్రభుత్వ విద్యలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను మోడల్ స్టేట్‌గా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ముఖ్యమైనదని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో మాజీ శాసనమండలి సభ్యులు ఏఎస్ రామకృష్ణ ఆధ్వర్యంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. ఎంఈవో పోస్టుల్లో జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు కూడా అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలుచేయాలని కోరారు. ఈ మేరకు మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. రాజకీయ జోక్యం లేకుండా ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలు పూర్తి పారదర్శకంగా జరిగాయని, అదేవిధంగా రాష్ట్రంలో నూతనంగా మోడల్ ప్రైమరీ స్కూళ్లను ఏర్పాటు చేయడంపై ఉపాధ్యాయులు సంతోషంగా ఉన్నారని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు.

### ప్రతి సమస్యకు పరిష్కారం

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు చర్చల ద్వారా పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఎవరూ ఆందోళన పడాల్సిన పనిలేదన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, ఇకపై ఆయా జిల్లాల్లో జరిగే క్లస్టర్ సమావేశాలకు తప్పనిసరిగా హాజరవుతానని చెప్పారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలతో పాటు నైతిక విలువలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులుగా ఉండాలని, అంకితభావంతో పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.


ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోందూరు శ్రీనివాసరాజు, బొనిగెల హైమారావు, రాష్ట్ర క్రమ శిక్షణా సంఘం ఛైర్మన్ చెరుకూరి సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి జె.శ్రీనివాసరావు, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎమ్.రెడ్డి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

---

## ప్రభుత్వ పాఠశాలలో

# నో అడ్మిషన్ బోర్డు

- మంత్రి లోకేష్ అనందం
- హెచ్ఎం ఫయాజుద్దీన్, టీచర్లకు కృతజ్ఞతలు




అమరావతి (చైతన్యరథం): కర్నూలు జిల్లా ఆదోనిలోని నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్లో నో అడ్మిషన్ బోర్డు పెట్టిన విషయం తెలిసి చాలా ఆనందించానని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. 1,725 మంది విద్యార్థులున్న ఆ స్కూల్లో ఈ ఏడాది అన్ని తరగతుల్లో 400 మందికిపైగా కొత్త విద్యార్థులు చేరడం ప్రభుత్వ విద్య పట్ల ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమన్నారు. ఈ మేరకు మంత్రి లోకేష్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. నో అడ్మిషన్ బోర్డు పెట్టి, అడ్మిషన్లు అయిపోయాయని తల్లిదండ్రులకు నచ్చచెబుతున్నా.. మా పిల్లాడిని ఒక్కడిని చేర్చుకోండి సార్ అని బతిమాలుతుంటే కాదనలేకపోతున్నామంటున్న హెడ్మాస్టర్ ఫయాజుద్దీన్, టీచర్లు, సిబ్బందికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ప్రతి స్కూల్లో ఇలాగే నో అడ్మిషన్ బోర్డులు కనిపించాలి. తల్లిదండ్రుల్లో ప్రభుత్వ విద్య పట్ల నమ్మకం కల్పించిన ఉపాధ్యాయులే ఏపీ మోడల్ ఎడ్యుకేషన్‌ను తీర్చిదిద్దే రథసారథులు అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

---

# పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



- అదే సీఎం చంద్రబాబు లక్ష్యం
- గురుకులాల్లో ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లు పదికి పెంచాం
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత లాంగ్ టర్మ్ కోచింగ్
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

సింగరాయకొండ (చైతన్యరథం): పేద విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం నాడు ప్రకాశంజిల్లా సింగరాయకొండలోని డా. బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లో విద్యార్థులకు నారాయణ విద్యాసంస్థల సహకారంతో ఉచిత మెటీరియల్‌ను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచన మేరకు రాష్ట్రంలోని గురుకులాల్లో ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లు మూడు నుంచి 10కి పెంచామన్నారు. ఐఐటి, నీట్‌లో తృటిలో అర్హత కోల్పోయిన ఎస్సీ,ఎస్టీ గురుకులాల వద్యార్థులకు ఉచిత లాంగ్ టర్మ్ కోచింగ్ ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ లాంగ్ టర్మ్ కోచింగ్ శిక్షణకు నారాయణ విద్యా సంస్థల సిబ్బంది సేవలను ఉచితంగా అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఐఐటీ,నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్‌కి స్టాఫ్‌ని ఇచ్చినందుకు మంత్రి నారాయణకు మంత్రి స్వామి కృతజ్ఞతలు తెలిపారు.



---

# రాష్ట్రానికి 120 శాతం పెరిగిన పీఎం-శ్రీ నిధులు

**- ప్రభుత్వ పాఠశాలల బలోపేతంలో నిబద్ధతకు నిదర్శనం**

న్యూఢిల్లీ (చైతన్యరథం): పీఎం- శ్రీ (పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం కింద రాష్ట్రానికి అందించే ఆర్థిక కేటాయింపులను కేంద్ర ప్రభుత్వం గణనీయంగా పెంచింది. గత వైసీపీ హయాంతో పోలిస్తే కేటాయింపులను దాదాపు రెట్టింపు చేసింది. టీడీపీ ఎంపీలు జీఎం హరీష్ బాలయోగి, పుట్టా మహేష్ కుమార్ సోమవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి బదులిస్తూ వైసీపీ నేతృత్వంలోని ప్రభుత్వంలో 2023-24లో ఆంధ్రప్రదేశ్ రూ.354.85 కోట్ల నిధులకు అనుమతి పొందగా, అందులో రూ.212.91 కోట్లు కేంద్ర వాటా అని వెల్లడించారు. అయితే, 2024-25 ఆర్థిక సంవత్సరం లో ఎన్డీఏ నేతృత్వంలోని ప్రభు త్వంలో, మంజూరు చేసిన నిధులు రూ.782.39 కోట్లకు పెరగగా ఇందులో కేంద్ర వాటా రూ.469.43 కోట్లుగా తెలిపారు. ఈ పెరుగుదల దాదాపు 120శాతంగా ఉంది. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో ఏపీ ప్రభుత్వ నిబద్ధతకు ఈ కేటాయింపులే నిదర్శనం. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు మొత్తం 935 పాఠశాలలు పీఎం- శ్రీ పథకం కింద ఎంపికయ్యాయి. ఇందులో ఏలూరు జిల్లాలో 37, డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 28 పాఠశాలలు ఉన్నాయి. ఈ పథకం కింద ప్రస్తుత పాఠశాలలను ఆధునిక మౌలిక సదుపాయాలు, స్మార్ట్ తరగతి గదులు, ఫలితాల ఆధారిత అభ్యాసంతో మోడల్ సంస్థలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని అధికారులు చెబుతున్నారు.

చైతన్యరథం

# రోజుకో మాట.. పూటకో కూత!

## లిక్కర్ స్కాంలో వైసీపీ కప్పగంతులు



అమరావతి(చైతన్యరథం): లిక్కర్ స్కాంలో రోజుకో మాట..పూటకో కూత అన్నట్టుగా వైసీపీ వ్యవహరిస్తోంది. మద్యం కుంభకోణంలో దోచిన మొత్తం వీడియోల ఆధారంగా బయట పడుతుండటంతో అడ్డంగా బుక్ అయిన వైసీపీ..తమ దారుణాలను కప్పిపుచ్చుకునేందుకు కప్పగంతులు వేస్తోంది. తొలుత అసలు లిక్కర్ స్కాం జరగనే లేదని ఆ పార్టీ బుకాయించింది. ప్రభుత్వ దుకాణాల్లో మద్యం అమ్మకాలు జరిగితే అసలు స్కాంకు ఆస్కారం ఎక్కడ ఉంటుందని బుకాయించింది. ఒక్కొక్కటిగా సాక్ష్యాలు లభ్యమవుతుంటే.. బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించింది. ఆధారాలు లభిస్తుంటే.. అప్రూవర్‌గా మారేలా ప్రలోభాలకు గురిచేస్తున్నారని అడ్డగోలు వాదన వినిపించింది. డబ్బుల డంప్ రూ.11 కోట్లు దొరికితే.. అసలు ఆ డబ్బులు మావి కాదని బుకాయించింది. ఆడబ్బు దొరికిన ఫాం హౌస్ యజ మానులలైన తీగల బ్రదర్స్ ప్రభుత్వానికి లొంగిపోయారని అర్థం పర్థం లేకుండా ఆరోపించింది. డబ్బుల కట్టల మీద నెంబర్లు పరిశీలించాలని కోర్టులో పిటిషన్ వేయించింది. అంతలోనే ఆ డబ్బులను మార్చేస్తున్నారని మరో పిటిషన్ దాఖలు చేయించింది. మద్యం ముడుపుల డబ్బులు లెక్కపెడుతూ ఏ-34 వెంకటేష్‌నాయుడు అడ్డంగా దొరికితే.. కింద గుట్టలుగా ఉన్న రూ.500, రూ.100ల నోట్ల కట్టలను వదిలేసి.. అదుగో పైన రూ.2వేల నోట్లకట్ట ఒకటి ఉందంటూ తొండి మాటలు చెబుతోంది. ఆ తర్వాత ఏ-34 వెంకటేష్ నాయుడు అసలు మా వాడేకాడు.. టీడీపీ నేత కావాలంటే చూడండంటూ.. ఏవేవో ఫొటోలను బయటకు తీసుకొచ్చింది. వైసీపీ కరపత్రిక సాక్షి పత్రికలో వెంకటేష్‌నాయుడు..చెవిరెడ్డి స్నేహితుడని గతంలో రాసిన విషయాన్ని మర్చిపోయినట్లుంది. దీనిపై ప్రశ్నిస్తే మా పేపర్లో కూడా మీ వాళ్లే ఉన్నారని బుకాయించినా ఆశ్చర్యం లేదు.

గతఎన్నికల్లో ఒంగోలు వైసీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి కోసం వెంకటేష్‌నాయుడు డమ్మీ అభ్యర్థిగా నామినేషన్‌వేశాడు.అప్పట్లో దీనిపై వెంకటేష్ నాయుడు చెవిరెడ్డి స్నేహితుడంటూ సాక్షిలో కథనాలు వచ్చాయి. చెవిరెడ్డి స్నేహితుడు కాబట్టే.. వెంకటేష్ నాయుడిని అరెస్ట్ చేసి కుట్రలు పన్నారంటూ వెంకటేష్ నాయుడికి అనుకూలంగా సానుభూతి రాతలు రాసింది. డబ్బుల కట్టలు లెక్కపెట్టుకుంటున్న వెంకటేష్‌నాయుడు వీడియో లభ్యమయ్యాక వైసీపీ యూ టర్న్ తీసుకుంది. వెంకటేష్ నాయుడు టీడీపీ మనిషేననంటూ అడ్డగోలుగా బుకాయిస్తోంది. అరెస్ట్ సమయంలో చెవిరెడ్డి స్నేహితుడిగా ఉన్న వెంకటేష్ నాయుడు.. వీడియోలు లభ్యమయ్యే నాటికి టీడీపీ మనిషిగా మారిపోయాడా అంటూ టీడీపీ ప్రశ్నలపై మాత్రం మూగనోము పాటిస్తోంది.

దేశ చరిత్రలో ఏ స్కాంలోనూ దొరకని విధంగా నగదు డంప్ బయటపెట్టి..వాట్సాప్ విజువల్స్ రిట్రీవ్ చేసి ఆధారాలను బయటపెట్టి.. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంటే.. అసలు సిట్ దర్యాప్తే కుట్రపూరితం అంటూ అడ్డగోలుగా మాట్లాడుతోంది. వైసీపీ లిక్కర్ స్కాంలో వైసీపీ కప్పగంతులను ఓసారి గమనిస్తే.. సరిగ్గా వైఎస్ వివేకా హత్య కేసులోనూ ఇదే విధంగా వ్యవహరించింది. తొలుత వివేకా మరణం గుండెపోటని.. సాక్షి ఛానెల్లో వేయించింది. ఆ తర్వాత గుండెపోటు కాదు హత్య అంటూ ఆరోపించింది. తెల్లారేసరికి చంద్రబాబు చేతిలో గొడ్డలి పెట్టి నారాసుర రక్త చరిత్ర అంటూ సాక్షి పత్రికలో కథనం వండివార్చింది. కోడికత్తి, గులకరాయి... ఏది తీసుకున్నా డ్రామాలు..మాయలు చేయటం..అదే నిజమని జనాన్ని నమ్మించేందుకు మీడియాను వాడటం వైసీపీకి పరిపాటిగా మారింది.

### మంత్రి జనార్దన్‌రెడ్డి కౌంటర్‌తో గతుక్కుమన్న వైసీపీ

వైసీపీ హయాంలో జరిగిన లిక్కర్ స్కాంపై మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి స్పందిస్తూ..లిక్కర్ స్కాం ముమ్మాటికీ వాస్తవం....ఇప్పటికే..వీడియోలు, ఆధారాలు బయట పడ్డాయన్నారు. డబ్బుల వీడియోలు బయట పడడంతో వైసీపీ ఉలిక్కి పడుతోంది..ఏం చేయాలో తెలీక అడ్డగోలుగా మాట్లాడుతోంది. వెంకటేష్ నాయుడు అనేవాడు వైసీపీ మనిషి, చెవిరెడ్డికి బినామీ..ఈ విషయంలో దర్యాప్తులోనే తేలింది. వెంకటేష్ నాయుడు చెవిరెడ్డి మనిషి అని సాక్షిలో కూడా రాశారు...ఇప్పుడేమో యాగీ చేస్తున్నారు. అతనిది నంద్యాల అంటున్నారు...నాతో కూడా అతని ఫోటో ఉండే ఉంటుంది...న్యూ ఇయర్ కో..మరో సందర్భంలోనో ఫొటో దిగి ఉంటాడు. బాబాయిని చంపి చంద్రబాబుపై తోసిన వాళ్లు ఇలాంటి ప్రచారాలే చేస్తారు. వెంకటేష్ నాయుడు వైసీపీ మనిషి కాకపోతే చెవిరెడ్డి కోసం ఒంగోలులో డమ్మీగా ఎందుకు నామినేషన్ వేశాడు. విచారణలో అన్ని విషయాలు వస్తాయి. ముందుంది ముసళ్ల పండుగ... అందుకే వైసీపీ తత్తరపాటు అని మంత్రి జనార్ధన్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు.

# వైసీపీ అంటే-యముడు-సైంధవుడు-పిశాచి?

ప్రజల వల్లన, ప్రజల చేత, ప్రజల కొరకు అంటున్న ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆ ప్రజల్నే దోచి ధనరాసులు పోగేసుకొన్న జగన్, ఆయన ముఠానే అసలైన నిజాయితీపరులు అయినట్లు వారి అక్రమాలకు, అవినీతికి ముసుగులు వేయడానికి జగన్ రోత పత్రిక ప్రయత్నం చేస్తోంది. స్వతంత్ర భారతావనిలో ఇంతబాహాటంగా బరితెగించిన రాజకీయ నాయకుడు లేడు. జగన్ జమానాలో జరిగిన కనీ, వినీ ఎరగని మద్యం కుంభకోణంలో ఎన్నెన్నో సంచలనమైన ఆధారాలు బయటపడుతున్నాయి.దోచి దాచిన డెన్‌లు, నోట్ల కట్టల గుట్టలు, లెక్కిస్తున్న వీడియోలు, అట్టపెట్టెలలోఉంచి ఫామ్‌హౌస్‌లో దాచిన 11కోట్లరూపాయల నగదు ప్రత్యేక దర్యాప్తు బృందం.. సిట్ విచారణలో బయట పడుతున్నప్పటికీ మద్యం కుంభకోణం నిందితులు చాలా బుద్ధిమంతులు, నిజాయితీ పరులు, ఏ పాపం తెలియని వారంటూ జగన్ రోత పత్రిక అడ్డగోలుగా రోత రాతలు రాస్తూ జగన్‌రెడ్డిని, ఆయన ముఠాని కాపాడేందుకు సిట్ పైనే విషం కక్కుతోంది. కళ్లముందు కనిపించే నిజాలను కక్షసాధింపు చర్యలుగా చూపించడానికి దొంగ సాక్షి అవస్థలు పడుతోంది. సిట్, మరియు గిట్టని మీడియా వ్యవస్థలపై విషపు రాతలు రాస్తోంది. మద్యం కుంభకోణాన్ని రాజకీయ కుట్రగా చిత్రించి జనం కళ్లకూ గంతలు కట్టేందుకు అసత్యపు రాతలకు తెగబడుతోంది.సిట్ బయటపెట్టిన ఐదు కోట్ల ముడుపుల సొమ్ము వీడియోలో ఉన్నది జగన్ ముఠా అతనే కానీ, ఆ సొమ్ము మద్యం సొమ్ము కాదని జగన్ తప్పుడు పత్రిక తప్పుడు కథనాలు రాసి వాస్తవాలను వక్రీకరిస్తోంది. దేశ చరిత్రలో కనీ, వినీ ఎరుగని రీతిలో మద్యం ద్వారా మాయా వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించిన ఘనుడు జగన్‌రెడ్డి.

రాజ్యాంగం మీద ప్రమాణం చేసి తన విద్యుక్త ధర్మాన్ని విస్మరించి నకిలీ మద్యం ద్వారా వేలకోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టి, వేల మంది ప్రాణాలను బలిగొన్న ఉదంతాలు చూసి యావత్ భారతదేశమే నివ్వెరపోయింది. ఏ వ్యక్తికైనా ఆశలు,కోరికలు ఉండటంలో తప్పులేదు.కానీ దేశచరిత్రలో ఈ విధమైన ధనదాహం కలిగిన వ్యక్తిని ప్రజలు తొలిసారి చూస్తున్నారు. నకిలీ మద్యంద్వారా వేలకోట్ల అక్రమ సంపాదన జగన్ సొంత ఖజానాకు చేరినట్లు సిట్ విచారణలో వెల్లడి అవుతున్నా ఆనాటి సత్యహరిశ్చంద్రుడికన్నా జగన్‌రెడ్డి, ఆయన ముఠానే నిజాయితీ పరులుగా రోత పత్రిక అబద్దాలు వండి వారుస్తోంది. తాను ఏమి చేసినా చెల్లుబాటు అవుతుందని,తామే అసలైన నీతి, నిజాయితీలకు ప్రతీక అని జనం చెవిలో పూలు పెడుతున్నది రోత పత్రిక. చట్టబద్ద పాలనకు సమాధి కట్టి అవినీతే రాజనీతిగా చెలరేగిపోయిన జగన్‌రెడ్డిని, ఆయన ముఠాని నిజాయితీకి నిలువుటద్దాలుగా చూపిస్తోంది దిక్కుమాలిన పత్రిక. స్వార్థ రాజకీయ శక్తులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రాష్ట్రాభివృద్ధికి, సమాజాభివృద్ధికి ఆటంకంగా మారిన వైసిపిని, ఆ పార్టీ నాయకులను రాజకీయాల నుంచి దూరం చేయాల్సిన బాధ్యత ప్రజలపై ఉంది. అధికారాన్ని అడ్డం పెట్టుకొని రాష్ట్రాన్ని అడ్డంగా దోచుకున్న జగన్ రెడ్డి.. మళ్లీ అధికారం కోసం ఆదర్శాలు నూరిపోస్తూ జనాన్ని బురిడీ కొట్టించాలని చూస్తున్న దోపిడీ నాయకుడి చరిత్ర మరోసారి తెలుసుకోవాల్సి ఉంది.

ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తి ఇంత దిగజారి మాట్లాడటం చూసి జనం ఛీ కొడుతున్నారు. గతంలో ఇంత గతి మాలిన రాజకీయాలు చేసిన వ్యక్తిని చూడలేదని జనం చెప్పుకొంటున్నారు. నెల్లూరుజిల్లా పర్యటనలో ఆయన చెప్పిన మాటలు విని ఇటువంటి వ్యక్తి రాజకీయాల్లో ఉండటానికి అర్హుడేనా అంటున్నారు. మద్యం కుంభకోణం కేసులో ఎంపీ మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు అరెస్టు చెయ్యడంపై కొత్త కథ అల్లాడు జగన్ రెడ్డి. ఆయన కథలు అల్లడంలో దిట్ట. ఎప్పుడో 53 ఏళ్ల కిందట కాలేజీ గొడవల్లో చంద్రబాబును పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పుతో కొట్టారని, ఆ కక్ష తీర్చుకోవడానికే ఇప్పుడు మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారని వింత కథ చెప్పారు జగన్‌రెడ్డి. మద్యం కుంభకోణం కేసులో ఎంపీ అయిన మిథున్‌రెడ్డి ప్రమేయం, పాత్రపై ఆధారాలు లేకుండా అరెస్టు చెయ్యడం సాధ్యమా జగన్ రెడ్డి? కనీస ఇంగితం లేకుండా ఇటువంటి అబద్ధాలు చెప్పడం అంటే అది నాలుకా? తాటి మట్టనా అంటున్నారు ప్రజలు. చంద్రబాబు, పెద్దిరెడ్డి 1972లో ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో వేర్వేరు గ్రూపులకు నాయకత్వం వహించే వారని, రెండు యూనియన్ల విద్యార్థుల మధ్య తరచూగొడవలు జరిగేవని తెలుసు. అయితే చంద్రబాబు విద్యార్థి నాయకుడిగా ఉండేవారే తప్ప ఎప్పుడూ ప్రత్యక్షంగా గొడవ పడలేదు. ఆయన ఎప్పుడూ ఎవరితోనూ గొడవలు పడే వ్యక్తి కాదు. మద్యం కుంభకోణం తన మెడకు చుట్టుకోబోతుందని, తనకు రోజులు దగ్గర పడుతున్నాయన్న అక్కసు, ఫ్రస్టేషన్‌ను తట్టు లేక చంద్రబాబును పెద్దిరెడ్డి కొట్టారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నాడు జగన్‌రెడ్డి. కానీ పెద్ది రెడ్డి కొట్టారంటూ జగన్ చేసిన తీవ్ర వ్యాఖ్యలను ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యనాయుడు ఖండించారు. అసలు జగన్‌కి ఏమి తెలుసు అని ఆయన ప్రశ్నించారు. పెద్దిరెడ్డి నేను ఒకే బ్యాచ్ అని, మాకు చంద్రబాబు రెండేళ్ల సీనియర్ అని, అసలు చంద్రబాబుతో పెద్దిరెడ్డి కలిసే ఛాన్సే లేదని,చంద్రబాబు యూనివర్సిటీలో మంచి స్కాలర్-ఆయన మంచి ఎకనమిస్ట్ అని, ఎవరితోనూ గొడవలు పెట్టుకొనే వ్యక్తిత్వం కాదని, కాలేజీ రోజుల్లోనే చంద్రబాబు మంచి నాయకుడని, అటువంటి వ్యక్తిపై జగన్‌రెడ్డి చిల్లర వ్యాఖ్యలు చేయడం దారుణమని, ఆనాటి పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు వివరించారు సుబ్రహ్మణ్య నాయుడు. జగన్‌రెడ్డి ఈ విధంగా చంద్రబాబుపై ఎన్ని అడ్డమైన అబద్ధాలు చెప్పినా వృథా ప్రయాసే. జగన్‌రెడ్డి తల్ల కిందులుగా తపస్సు చేసినా మళ్ళీ అధికారం దక్కడం కల్ల. నీ చరిత్ర ముగిసింది. కాలం కలిసి వచ్చి నీ అబద్ధాలు నమ్మి ఒకసారి అధికారం ఇచ్చారు ప్రజలు. నీ అబద్ధాలు నమ్మి మళ్ళీ అధికారం ఇస్తారని ఆత్రుత పడుతున్నావు. అది జరిగేది కాదు. అబద్ధాల పంట పండించి ఒకసారి ఆంధ్రప్రదేశ్ కి ముఖ్యమంత్రివి కాగలిగావు. ఆ గౌరవం కాపాడుకోవడం మంచిది.

అట్లాగే గట్టిగా మూడేళ్లు కళ్ళు మూసుకొంటే చంద్రబాబు ఎగిరిపోయే నాయకుడు అంటూ జగన్ నోరుపారేసుకొన్నాడు. కానీ ఏడాది కింద జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఎవర్ని ఎగరగొట్టారో ఆయనే చెప్పాలి. చంద్రబాబు ఎగిరిపోయే నాయకుడు కాదు ప్రజలను ఎదిగించే నాయకుడు. చంద్రబాబును ఎగరగొట్టాలని చూసిన ఎందరో ఎగిరి పోయ్యారు అన్న విషయం జగన్‌రెడ్డి గుర్తు తెచ్చుకోవాలి. చంద్రబాబు యోదాన యోధులతో రాజకీయంగా తలపడిన వ్యక్తి. మీ వంటి మరుగుజ్జులకు ఆయన సమర్థత, విలువ, చరిత్ర ఎం తెలుసు? చెన్నారెడ్డి, అంజయ్య, జనార్ధన్ రెడ్డి, కోట్ల విజయ బాస్కర్‌రెడ్డి, వైఎస్ రాజశేఖర రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి నుండి మీవరకు చంద్రబాబు పోరాటం చేస్తునే ఉన్నారు. ఇన్నేళ్ళుగా అటు వైపు ఇంత మారితే, ఇటు వైపు చంద్రబాబు ఒక్కరే నిలబడిపోరాటం చేస్తున్నారు. జగన్‌రెడ్డి ఇప్పుడు చెప్పాలి.ఎవరు ఎగిరి పోయే నాయకుడో. దురదృష్టం ఏమిటంటే మనది ప్రజా స్వామ్యం కాబట్టి అర్హత లేని వ్యక్తిని ప్రజలు ముఖ్యమంత్రిగా ఎన్నుకోవడంతో సైకో మనస్తత్వం కలిగిన జగన్‌రెడ్డితో కూడా చంద్రబాబు పోరాటం చెయ్యాల్సిన పరిస్థితి. ఆనాడు వాజపేయి, అద్వానీ, జ్యోతిబసు, బిజూ పట్నాయక్, వీపీ సింగ్, దేవీలాల్, దేవగౌడ, గుజ్రాల్ వంటి ఎందరో ఉద్దండులతో కలిసి పని చేసిన గొప్ప నాయకుడు చంద్రబాబు. చివరకు సైకో మనస్తత్వం కలిగిన జగన్‌రెడ్డి వంటి అరాచక వ్యక్తితో రాజకీయం చేయాల్సి వస్తోంది. చంద్రబాబు ఎదిగే నాయకుడని చరిత్ర చెబుతున్న సత్యం. గతంలో చంద్రబాబును ఫినిష్ చేస్తామని ప్రగల్భాలు పలికిన వారు కూడా ఏమైయ్యారో జగన్ రెడ్డి తెలుసుకోవాలి.

అట్లాగే పరామర్శల పేరుతో జగన్ రెడ్డి చేస్తున్న అరాచకాలకు హద్దు లేకుండా పోయింది. క్రిమినల్స్ రాజకీయాల్లోకి వస్తే ఎలా ఉంటుందనేది పరామర్శల్లో జగన్‌రెడ్డి ప్రవర్తనే ఉదాహరణ. జగన్ నేర మనస్తత్వంతో అధికారం కోసం ఎంతకైనా, ఎటువంటి చర్యలకైనా తెగిస్తారనడానికి ఆయన పర్యటనల్లో జరుగుతున్న పరిణామాలే నిదర్శనం. గుంటూరు జిల్లా పర్యటనలో జగన్ కారు కిందే పడి సింగయ్య అనే వ్యక్తి మృతి చెందాడు. జగన్ కారు కింద పడి తన భర్త చనిపోయాడని సింగయ్య భార్య ఫిర్యాదు చేస్తే, ఆ కేసులో నిందితుడిగా ఉన్న జగన్.. సింగయ్య కుటుంబాన్ని తన ఇంటికి పిలిపించుకుని. లోకేష్ కోటి రూపాయలు ఇస్తానని ఆశ చూపారంటూ ఆమెతో లోకేష్‌పై తప్పుడు ఆరోపణలు చేయించారు. జగన్ బాబాయి వివేకానందరెడ్డి హత్య విషయంలోనూ జగన్ క్రిమినల్ ఆలోచనతో సొంత బాబాయ్‌ను గొడ్డలితో నరికేసి, దాన్ని గుండెపోటుగా చిత్రీకరించారు. తర్వాత వాస్తవాలు బయటకు రావడంతో ఆ నేరాన్ని అప్పటి ముఖమంత్రిగా వున్న చంద్రబాబుపై నెట్టి రాజకీయ లబ్ధి పొందిన విషయం అందరికి తెలిసిందే. అట్లాగే మామిడి, పొగాకు రైతుల పరామర్శ పేరుతో జగన్ ప్రజలను ఎంత పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారో చూసాం. ఒక సామాన్య రైతుని బెదిరించి రెండు ట్రాక్టర్లను గుంజుకొని వాటిలోని కాయలన్నిటినీ ఆయన కళ్ళముందే రోడ్డు పై పోసి మామిడి కాయలను ట్రాక్టర్‌తో తొక్కించి రైతులకు న్యాయం చెయ్యరా అంటూ దీర్ఘాలు తీసిన కర్కోటకుడు జగన్ రెడ్డి. అయిదు నెలల క్రితం గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లి కార్యకర్తలతో ఇష్టారీతిన మిరప బస్తాలను తొక్కించి రైతుల కష్టాన్ని కాళ్ళతో తొక్కించారు. నల్ల బర్లీ పొగాకు కొనేందుకు ప్రభుత్వం భారీగా నిధులు ఇచ్చి కొనేందుకు మార్క్ ఫెడ్‌ను రంగంలోకి దించింది. అయినా పొగాకు రైతుల పరామర్శ పేరుతో ప్రకాశం జిల్లా పోయి పొగాకు బేళ్లను వైసీపీ కార్యకర్తలతో తొక్కించారు. పొగాకు కొనే దిక్కు లేదని రోత పత్రికలో రోత రాతలు రాయించారు. అట్లాగే ఇటువంటి క్రిమినల్ నేరగాడు ప్రజాధనాన్ని కూడా ఎంత పకడ్బందీగా స్వాహా చేసాడనేదానికి మద్యం స్కాంలో వెల్లడవుతున్న వాస్తవాలే ఉదాహరణ. మద్యం అమ్మకాలను ప్రభుత్వం నిర్వహించినప్పుడు ఇక కుంభకోణం ఎలా జరుగుతుంది అంటూ జగన్ రెడ్డి బుకాయిస్తున్నారు. స్వతంత్ర భారత చరిత్రలో ఎప్పుడు ఎక్కడా కనీ,వినీ ఎరుగని స్థాయిలో మద్యం ద్వారా సాగిన స్వాహా పర్వానికి సంభందించి సిట్ దర్యాప్తులో ఎన్నో ఆధారాలు వెలుగులోకి వచ్చాయి. ప్రజాధనాన్ని కొల్లగొట్టి దోచుకొన్న సొమ్మును దాచుకోవడానికి ఎన్నెన్ని పన్నాగాలకు పాల్పడ్డారో సిట్ వెలుగులోకి తెచ్చింది, ఏది ఏమైనా ఆవుల మందకు పెద్దపులిని కాపలాగా పెడితే ఏమవుతుందో, నమ్మి బందిపోట్లకు అధికారం ఇస్తే ఏమి జరుగుతుందో అత్యంత అవినీతి పరుడుకి అధికారం ఇస్తే ఆంధ్రప్రదేశ్‌కి కూడా అదే గతి పట్టింది. అందుకే వైసీపీ అంటే యముడు-సైంధవుడు-పిశాచి అని వర్ణించాల్సి వస్తోంది.

**- నీరుకొండ ప్రసాద్**

# బనకచర్లపై తెలంగాణ అభ్యంతరాలు సబబు కాదు

- ❑ గోదావరి నీటి వినియోగంలో ద్వంద్వ ప్రమాణాలు తగవు
- ❑ సముద్రంలో కలిసే నీరు మాత్రమే బనకచర్ల ద్వారా మళ్లింపు
- ❑ ఏపీకి ఉన్న హక్కుతోనే ప్రాజెక్టు రూపకల్పన
- ❑ జలాల సద్వినియోగంతో రెండు రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడుకుందాం
- ❑ రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్



అమరావతి (చైతన్యరథం): తెలంగాణలోని కాళేశ్వరం, పాలమూరు -రంగారెడ్డి, సమ్మక్క సాగర్, గౌరవెల్లి, సంగమేశ్వర-బసవేశ్వర ఎత్తిపోతల ప్రాజెక్టులకు ఎలాంటి అనుమతులూ లేవని, వీటిపై ఏపీ ఎప్పుడూ అభ్యంతరం చెప్పకపయినా ఏపీ ప్రభుత్వం తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణా అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండటం సబబు కాదని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. గోదావరి నీటిని సద్వినియోగం చేసుకునే విషయంలో తెలంగాణాకి ఓ న్యాయం, ఏపీకి ఓ న్యాయమా అని ప్రశ్నించారు. ద్వంద్వ ప్రమాణాలు ఎంతవరకు సమంజసమో తెలంగాణ నేతలు ఆలోచించాలని సోమవారం ఒక ప్రకటనలో మంత్రి ఫరూక్ హితవు పలికారు. గోదావరి నుంచి ఏటా సగటున 3000 టీఎంసీల వరద నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందన్నారు. 2025 సీజన్ ఆరంభంలోనే ఇప్పటి వరకూ 813 టీఎంసీల నీరు దిగువన సముద్రంలో కలిసిపోయిందని వెల్లడించారు. ప్రపంచంలోనే 50 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవహించే అవకాశం ఉన్న నదిగా గోదావరి విశిష్టమైన ప్రాముఖ్యత కలిగి ఉందన్నారు.

**ఏపీకి సర్వహక్కులు ఉన్నాయి**

గోదావరి నదికి దిగువ రాష్ట్రంగా సముద్రంలో కలిసే నీటిని వినియోగించుకునేందుకు ఏపీ సర్వహక్కులూ కలిగి ఉందని మంత్రి ఫరూక్ స్పష్టం చేశారు. పోలవరం- బనకచర్ల లింకు ప్రాజెక్టుతో సముద్రంలోకి వృథాగా కలిసే జలాలను మాత్రమే రాయలసీమకు తరలించేందుకు ఏపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌ను చేపడుతోందన్నారు. తెలంగాణా సరిహద్దు తర్వాత భద్రాచలం దిగువన ఆంధ్రప్రదేశ్ భూభాగంలో ఉన్న శబరి, సీలేరు, తాలిపేరు నుంచి పెద్ద ఎత్తున నీటి ప్రవాహాలు ప్రధాన నదిలో కలుస్తున్నాయన్న విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ముఖ్యంగా రుతుపవనాల సీజన్‌లో నవంబరు వరకూ 100 రోజుల పాటు గోదావరిలోకి వరద ప్రవాహాలు కొనసాగుతాయన్నారు. ఒడిశా నుంచి శబరీ నది కూనవరం వద్ద గోదావరిలో కలుస్తోందని, సీలేరు, పొట్టేరుల నుంచి శబరి ఉపనదికి వచ్చే ప్రవాహాలు భారీగానే ఉంటాయన్నారు. శబరి నుంచి ఏటా దాదాపు 270 టీఎంసీల నీటి ప్రవాహం గోదావరిలో కలుస్తోందని తెలిపారు. సీలేరు నుంచి వచ్చే వరద నీటి ప్రవాహం కూడా భారీగానే ఉంటుందన్న విషయం తెలిసిందేనని పేర్కొన్నారు.

**అనవసర రాద్ధాంతం తగదు**

గోదావరి నదిపై కాళేశ్వరం ప్రాజెక్టును కట్టుకున్న తెలంగాణా పూర్తిగా ప్రాణహిత నుంచి వచ్చే నీటిని మళ్లించుకుంటోందని మంత్రి ఫరూక్ తెలిపారు. కేంద్రం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా కాళేశ్వరం, సీతారామ సాగర్, ఇతర ఎత్తిపోతల పథకాల ద్వారా 296 టీఎంసీలను తెలంగాణా తన అవసరాల కోసం తరలించుకుంటోందని మంత్రి విమర్శించారు. గోదావరి నుంచి సముద్రంలోకి వృథాగా కలుస్తున్న నీటిని సద్వినియోగం చేసుకునేందుకే పోలవరం-బనకచర్ల లింకు ప్రాజెక్టును ఏపీ ప్రతిపాదించిందని ఈ విషయంపై తెలంగాణ విమర్శలు సరికాదన్నారు. సముద్రంలో కలిసే నీటిని వరద కాలంలో మాత్రమే రోజుకు 2 టీఎంసీల చొప్పు 200 టీఎంసీల వరకూ నీటిని కరవుపీడిత ప్రాంతాలకు తరలిస్తే ఎగువ రాష్ట్రానికి వచ్చే ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. నీటి వనరుల సద్వినియోగం చేసేందుకు, రాయలసీమ లాంటి కరవు ప్రాంతాల దాహార్తిని, సాగునీటి అవసరాలను తీర్చేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టుపై అనవసరపు రాద్ధాంతం చేస్తున్నారని మంత్రి ఫరూక్ ధ్వజమెత్తారు. లోయర్ రైపీరియన్ రైట్స్ అనేది నదీ జలాల చట్టంలో ఓ ముఖ్యమైన అంశమని, దిగువ పరివాహక ప్రాంతాల్లో ఉన్న రాష్ట్రాలకు ప్రత్యేక హక్కులు ఉన్నాయని మంత్రి స్పష్టం చేశారు.

**సముద్రంలో కలిసే నీటిని వినియోగించుకునేందుకే..**

సముద్రంలోకి కలిసే 3000 టీఎంసీల నీటిలో 200 టీఎంసీలను మాత్రమే పోలవరం- బనకచర్ల ప్రాజెక్టు ద్వారా వినియోగించుకోవాలని భావిస్తున్నామని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. జీడబ్ల్యూడిటి అవార్డు లోని క్లాజ్ -4 ప్రకారం రాష్ట్రాలకు, గోదావరి నుండి ఇతర రివర్ బేసిన్లకు నీటిని తరలించే హక్కు ఉందని మంత్రి వెల్లడించారు. ఆ ప్రకారమే తెలంగాణ రాష్ట్రం కాళేశ్వరం, సీతారామ లిఫ్ట ప్రాజెక్టులు చేపట్టిందని, కొన్ని అనుమతులు ఈ క్లాజు ప్రకారమే వారికి కేంద్ర జలసంఘం ఇచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్ కూడా ఈ హక్కుతోనే బనకచర్ల ప్రాజెక్టును చేపడుతోందన్నారు. తెలంగాణ ప్రాజెక్టులకు సానుకూలమేనని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారని, రెండు తెలుగు రాష్ట్రాల రైతులు, ప్రజలు గోదావరి నీటిని సద్వినియోగం చేసుకోవాలన్నదే చంద్రబాబు లక్ష్యమని మంత్రి ఫరూక్ అన్నారు. నీటి వనరుల్ని వినియోగించుకుని రెండు రాష్ట్రాల ప్రయోజనాలనూ కాపాడుకుందామని మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపునిచ్చారు.

## 15 నుంచి మహిళలకు
# ఉచిత బస్సు ప్రయాణం

- రాష్ట వ్యాప్తంగా మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు అనుమతి
- పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్‌ల్లో ప్రయాణించేందుకు అవకాశం
- ఆధార్, ఓటర్, రేషన్ కార్డులను ఐడీ ప్రూఫులుగా చూపించాలి
- 6న జరిగే క్యాబినెట్ సమావేశంలో ఆమోదముద్ర
- రవాణామంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



అమరావతి (చైతన్యరథ): కూటమి ప్రభుత్వం "సూపర్ సిక్స్" హామీల్లో భాగంగా మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు ప్రయాణం హామీని ఈ నెల 15వ తేదీ నుండి అమలు చేయనున్నట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ పథకం అమల్లో ఎటు వంటి లోటుపాట్లు, విమర్శలకు అవకాశం లేకుండా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారన్నారు. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణా రాష్ట్రాలో ఈ పథకం అమలు తీరును పరిశీలించేందుకు ముగ్గురు మంత్రులతో కూడిన బృందం ఆయా రాష్ట్రాల్లో పర్యటించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేసిందన్నారు. ఈ నెల 6 వ తేదీన జరిగే క్యాబినెట్ సమావేశంలో దీనికి ఆమోదముద్ర లభించనుందని మంత్రి తెలిపారు. ఈ పథకాన్ని రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేసేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ పథకం క్రింద రాష్ట్రానికి చెందిన మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఎక్కడి నుండి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పిస్తామన్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ప్రయాణించేందుకు అవకాశం ఉంటుందని, అయితే ఆధార్, ఓటర్, రేషన్ కార్డులను ఐ.డి. ప్రూఫులుగా చూపించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఉన్న బస్సుల్లో 74 శాతం బస్సులు అంటే 6,700 బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. తద్వారా ఏడాదికి దాదాపు రూ.1,950 కోట్ల వ్యయం అవుతుందన్నారు. ఈ ఏడాది అదనంగా 3 వేల విద్యుత్ బస్సుల కొనుగోలుకు చర్యలు చేపట్టామన్నారు. వచ్చే రెండేళ్లలో మరో 1,400 ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేస్తామన్నారు. డిమాండుకు తగ్గట్టుగా డ్రైవర్లు, మెకానిక్‌ల నియామకాలను కూడా చేపడతామన్నారు.

## పీజీ వైద్య విద్య ప్రవేశాల్లో..
# ప్రభుత్వ వైద్యులకు రిజర్వేషన్ ఖరారు

- 7 క్లినికల్ సబ్జెక్టుల్లో 15 శాతం
- 9 నాన్ క్లినికల్ సబ్జెక్టుల్లో 30 శాతం స్పెషలిస్టుల అవసరాలు, పి హెచ్ సీ వైద్యుల ఆకాంక్షల ఆధారంగా నిర్ణయం

అమరావతి (చైతన్యరథం): 2025-26 విద్యా సంవత్సరానికి పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) వైద్య విద్య కోర్సుల ప్రవేశాల్లో ప్రభుత్వ వైద్యుల రిజర్వేషన్ కోటాను రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించింది. ఈ విషయంలో వైద్యారోగ్య శాఖ ప్రతిపాదనను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆమోదించారు.

2028-29 సంవత్సరంలో ప్రభుత్వాసుపత్రుల్లో క్లినికల్, నాన్ -క్లినికల్ స్పెషలిస్టుల అవసరాలను మదింపు చేసి ప్రభుత్వం రిజర్వేషన్ కోటాపై నిర్ణయం తీసుకొంది. దీంతో పాటు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పిహెచ్‌సీలు ) పనిచేసే వైద్యుల ఆకాంక్షలను కూడా పరిగణలోకి తీసుకుని రిజర్వేషన్ కోటా విషయంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వైద్యరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ తెలిపారు.

**7 క్లినికల్ కోర్సుల్లో 15%రిజర్వేషన్**

2025-26 సంవత్సరంలో జరిగే పి.జి. వైద్య విద్య కోర్సుల్లో జరిగే ప్రవేశాలల్లో 7 క్లినికల్ సబ్జెక్టుల్లో ప్రభుత్వ పిహెచ్ సీ వైద్యులకు 15%రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పిడియాట్రిక్స్, గైనకాలజీ, ఎనస్తీషియా, ఎమర్జెన్సీ మెడిసిన్ మరియు రైడియాలజీ కోర్సుల్లో ఈ మేరకు రిజర్వేషన్ కల్పించారు. మొత్తం 17 కోర్సుల్లో పి. జి ప్రవేశాలు జరుగుతాయి.

**9 నాన్ -క్లినికల్ కోర్సుల్లో 30% రిజర్వేషన్**

ప్రవేశాలు జరిగే మొత్తం 9నాన్ - క్లినికల్ కోర్సులో 30%రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విభాగాలు హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, బయో కెమిస్ట్రీ, ఎనాటమీ, ఫిజీయాలజీ, ఫారెన్సిక్ మెడిసిన్, మైక్రో బయాలజీ, పాథాలజీ, సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్.

**ప్రభుత్వ వైద్యుల ఆకాంక్షల మేరకు..**

1144 ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే 2288 వైద్యుల ఆశలు, ఆకాంక్షలను కూడా దృష్టిలో పెట్టుకుని రిజర్వేషన్ పై నిర్ణయం తీసుకున్నామని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మంత్రిత్వ శాఖ కార్యదర్శితో కూడిన ఆరుగురు ఉన్నతాధికారుల కమిటీ 2028-29 సంవత్సరంలో స్పెషలిస్టల అవసరం పై మదింపు చేసి వివిధ విభాగాల్లో అవసరాలను గుర్తిస్తూ నివేదిక ఇచ్చిందని మంత్రి వివరించారు. ఉన్నత విద్య పొందాలనే ప్రభుత్వ వైద్యుల ఆశలు, ఆకాంక్షలను కూడా పరిగణలోకి తీసుకుని అవసరాల కంటే ఎక్కువగా ప్రభుత్వ వైద్యులకు పి.జి కోర్సుల్లో రిజర్వేషన్లు కల్పించామని మంత్రి వెల్లడించారు.

**మొత్తం 272 పి. జి సీట్ల లభ్యత**

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రవేటు వైద్య కళాశాలల్లో కన్వీనర్ కోటా (ప్రభుత్వ కోటా ) కింద లభించే 50% పి.జి కోర్సుల్లో ప్రభుత్వం నిర్ణయించిన రిజర్వేషన్ కోటా మేరకు ప్రభుత్వ వైద్యులకు ప్రవేశాలు లభిస్తాయి. 15%రిజర్వేషన్ ప్రకారం 7 క్లినికల్ విభాగాల్లో 154 సీట్లు, 9 నాన్ -క్లినికల్ విభాగాల్లో 30% రిజర్వేషన్ మేరకు 118 సీట్లు ప్రభుత్వ వైద్యులకు అందుబాటులో ఉంటాయి. ఈ విధంగా మొత్తం 272 సీట్లను ప్రభుత్వం పీ హెచ్ సి వైద్యులకు కేటాయించింది. 2024-25 విద్యా సంవత్సరంలో జరిగిన పిజి వైద్య విద్య ప్రవేశాల్లో 312 మంది ప్రభుత్వ వైద్యులు ప్రవేశాలు పొందారు.

**వైద్యుల డిమాండ్ కు అంగీకారం**

ప్రభుత్వ వైద్యుల డిమాండ్ ను రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. గతానికి భిన్నంగా మూడవ రౌండ్ కౌన్సిలింగ్ పూర్తయ్యేవరకు పీజీ కోర్సుల్లో ప్రభుత్వ వైద్యులకు ప్రవేశాలను కల్పించాలన్న డిమాండ్ కు ప్రభుత్వం అంగీకరించింది. ఇప్పటి వరకు.. రెండవ రౌండ్ కౌన్సిలింగ్ పూర్తయిన తరువాత ప్రభుత్వ వైద్యులకు కేటాయించిన సీట్లలో మిగిలిన సీట్లను ఇతరులకు కేటాయించేవారు. ఈ సంవత్సరం జరిగే ప్రవేశాల్లో.. మూడవ రౌండ్ కౌన్సిలింగ్ పూర్తయిన తరువాత మిగిలిన సీట్లను ఇతరులకు కేటాయిస్తామని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

ప్రభుత్వ పిహెచ్‌సి ల్లో 3 సంవత్సరాల సర్వీసు చేసిన వైద్యులు పీజీ కోర్సుల్లో రిజర్వేషన్ కోటాలో ప్రవేశాలు పొందేందుకు అర్హులు

# ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణకు అధిక ప్రాధాన్యత

- స్వచ్ఛాంధ్రపై స్వయంగా అవగాహన కల్పిస్తున్న సీఎం చంద్రబాబు
- డిసెంబర్ చివరికి లెగసీ వేస్ట్ ఫ్రీ స్టేట్‌గా ఏపీ
- గత ప్రభుత్వంలో దెబ్బతిన్న సంబంధాలను సరిచేసేందుకు సింగపూర్ ప్రభుత్వంతో మాట్లాడిన సీఎం
- అమరావతి నిర్మాణంలో టెక్నికల్ సపోర్ట్ ఇచ్చేందుకు ముందుకొచ్చిన సింగపూర్
- పురపాలిక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి పొంగూరు నారాయణ




విజయవాడ (చైతన్యరథం): ఈ ఏడాది డిసెంబర్ చివరకల్లా రాష్ట్రాన్ని లెగసీ వేస్ట్ ఫ్రీ స్టేట్‌గా మారుస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. గత ప్రభుత్వం వదిలేసి వెళ్లిపోయిన చెత్తతో పాటు కొత్తగా వచ్చిన 20 లక్షల టన్నుల చెత్తను డిసెంబర్ నాటికి పూర్తిగా తొలగిస్తామన్నారు. రాష్ట్రంలోని మున్సిపాల్టీల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణకు కమిషనర్లు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. స్వచ్ఛ నగరాల సాధన కోసం ప్రజల్లో కల్పించాల్సిన అవగాహనపై స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఐఈసీ, కెపాసిటీ బిల్డింగ్‌పై రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌ను విజయవాడలో సోమవారం మంత్రి నారాయణ ప్రారంభించారు. అనంతరం మీడియాతో మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని మున్సిపాల్టీల కమిషనర్లు సాలిడ్ వేస్ట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్ మెంట్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. చెత్త రహిత నగరాలుగా మార్చేందుకు మున్సిపల్ కమిషనర్లు కీలక పాత్ర వహించాలన్నారు. స్వచ్ఛ భారత్ కింద స్వచ్ఛాంధ్ర సాధనకు అధికారులు, ప్రజలంతా కలిసి పనిచేయాలన్నారు. ప్రతి నెలా మూడో శనివారం సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటున్నారన్నారు. ఏదో ఒక ప్రాంతంలో స్వయంగా పాల్గొంటూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారన్నారు. స్వచ్ఛాంధ్ర సాధనకు ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు వారి సహకారం కూడా కావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన స్వచ్ఛతా నాలెడ్జ్ పార్టనర్స్ తో కలిసి మున్సిపల్ కమిషనర్లు చర్చించుకుని వాటిని కింది స్థాయిలో అమలుచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలోని 5 నగరాలకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు రావడం గర్వకారణంగా ఉందన్నారు. అవార్డులు సొందిన మున్సిపాల్టీల అధికారులు, సిబ్బందికి మంత్రి నారాయణ అభినందనలు తెలిపారు.

### మరో ఐదు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు

రాష్ట్రంలో గత ప్రభుత్వం 85 లక్షల టన్నుల చెత్తను వదిలేసి వెళ్లిపోయిందన్నారు. ఈ చెత్తనంతా వచ్చే అక్టోబర్ రెండో తేదీ నాటికి పూర్తిగా తొలగిస్తామన్నారు. మరోవైపు కొత్తగా వచ్చిన 20 లక్షల టన్నుల చెత్తను కూడా డిసెంబర్ నాటికి పూర్తిగా తొలగించి లెగసీ వేస్ట్ ఫ్రీ స్టేట్‌గా మారుస్తామన్నారు. రాష్ట్రంలో ప్రతిరోజూ వచ్చే ఘన వ్యర్థాలను వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లకు తరలిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న విశాఖపట్నం, గుంటూరు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లతో పాటు కొత్తగా కడప, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతిలో కూడా ప్లాంట్‌లు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్లాంట్ లన్నీ అందుబాటులోకి వస్తే రాష్ట్రం డంపింగ్ యార్డ్ రహితంగా మారుతుందన్నారు. అలాగే ద్రవ వ్యర్థాల నిర్వహణ కోసం సీవరేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్లు రెండేళ్లలో ఏర్పాటుచేస్తామన్నారు. అమృత్ పథకం నిధులతో డ్రింకింగ్ వాటర్ పైప్ లైన్లు పూర్తిచేస్తామని చెప్పారు.

### సానుకూలంగా సింగపూర్

గత ప్రభుత్వ నిర్వాకంతో సింగపూర్‌కు ఏపీకి మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయన్నారు. 2014-19 మధ్య కాలంలో సింగపూర్ లోని మెజారిటీ షేర్ ఉన్న కంపెనీలతో అగ్రిమెంట్ చేసుకున్నామన్నారు. గత ప్రభుత్వం ఆ అగ్రిమెంట్‌ను రద్దు చేయడంతో పాటు సీఐడీ అధికారులను పంపి విచారణ జరిపించిందన్నారు. దీంతో ఆ ప్రభుత్వంతో ఏపీకి ఉన్న సంబంధాలు దెబ్బతిన్నాయన్నారు. తిరిగి ఆ సంబంధాలు పునరుద్ధరించడానికే సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనకు వెళ్లారన్నారు. సింగపూర్ ప్రభుత్వాధికారులు ఎంతో పాజిటివ్‌గా స్పందించారన్నారు. సింగపూర్ ప్రభుత్వానికి సీఎం చంద్రబాబు అంటే ఎంతో గౌరవం ఉందన్నారు. ప్రపంచ బ్యాంకుతో కలిసి అమరావతికి సహకారం అందించేందుకు సింగపూర్ ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు.. అలాగే సింగపూర్ కంపెనీలను విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సుకు రావాలని సీఎం ఆహ్వానించినట్లు తెలిపారు. సీఆర్డీఏ కమిషనర్ అధికారికంగా లేఖ రాసిన తర్వాత సింగపూర్ ప్రభుత్వంతో సంప్రదింపులు చేస్తారని మంత్రి నారాయణ తెలిపారు.

### స్వచ్ఛతలో మెరుగ్గా రాష్ట్రం: పట్టాభి

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ మున్సిపాల్టీల అభివృద్ధికి దేశంలో 3 అత్యుత్తమైన ఏజెన్సీలు గుర్తించి ఎంపిక చేశామన్నారు. 123 నగరాల్లో స్వచ్ఛత పై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 5 అవార్డ్‌లు రావడం మనకు గర్వకారణమన్నారు. రాష్ట్రం లో ఒక రీసైక్లింగ్ పార్క్ ను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశం మేరకు స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను ముందుకు తీసుకు వెళుతున్నామన్నారు. స్వచ్ఛ సేవలో నిధులు కొరత లేకుండా కేంద్రం, రాష్ట్రం నిధులు కేటాయిస్తోందన్నారు. ప్రతి నిత్యం పని ధ్యాసగా ఉండే నాయకులు చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ అని అన్నారు. స్వచ్ఛత కోసం దేశంలో ఉన్న ఒకే ఒక కొలమానం స్వచ్ఛ సర్వేక్షణ్ అని అన్నారు. ప్రతి సిటీ రిపోర్టు కార్డులు ఆన్ లైన్‌లో ఉన్నాయన్నారు. టాప్ ఫిఫ్టీలో రాష్ట్రం నుండి 6 నగరాలు ఉన్నాయన్నారు. దక్షిణ భారత దేశంలో స్వచ్ఛతలో కొంత మేరకు మనం మెరుగ్గానే ఉన్నామన్నారు. రూ. 1146 కోట్ల బడ్జెట్‌లో విశాఖ, విజయవాడ నగరాలే పారిశుధ్యంపై రూ. 340 కోట్లు ఖర్చు చేస్తున్నాయన్నారు. జీవో ప్రకారం యూఎల్‌బి లు తమ బడ్జెట్ లో 27 శాతం ఖర్చు చేయాలన్నారు. రూ. 100 కోట్లు పైగా చెత్త సేకరణకు డీజిల్ పై ఖర్చు చేస్తుంటే, విజయవాడలో వాహనాల డీజిల్ కోసం రూ. 30 కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. వ్యయం తగ్గించే కార్యక్రమాల్లో భాగంగా 2,000 ఎలక్ట్రిక్ వెహికిల్స్ డోర్ టూ డోర్ చెత్త సేకరణ కోసం కొనుగోలు చేస్తున్నామన్నారు.

మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ మాట్లాడుతూ ఢిల్లీలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు రాష్ట్రంలోని ఐదు నగరాలకు వచ్చాయన్నారు. సూరత్, లక్నో వంటి నగరాలు ఒకప్పుడు మురికి నగరాలు అయితే ఈరోజు అవి క్లీన్ సిటీలుగా తయారయ్యాయన్నారు. శానిటేషన్ అనేది ప్రభుత్వ కార్యక్రమం కాదు ప్రజల కార్యక్రమమే అన్నారు. అప్పుడే ఇలాంటి కార్యక్రమాలు సక్సెస్ అవుతాయన్నారు. ఈ కార్యక్రమం సక్సెస్ కావాలంటే పై నుండి కింది వరకూ అందరికీ శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రజలు కూడా స్వచ్ఛ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు.

పురపాలక శాఖ సంచాలకులు పి. సంపత్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్లు ఉదయమే మున్సిపాలిటీల్లో పనులను తనిఖీ చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మున్సిపాలిటీల్లో పనిచేసే అవుట్ సోర్సింగ్ సిబ్బందికి రూ.20 లక్షల వరకు డెత్ ఇన్సూరెన్స్ వర్తించే విధంగా యాక్సిస్ బ్యాంకుతో ఒప్పందం చేసుకున్నామన్నారు.

ముందుగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్ కుమార్ రెడ్డి స్వాగతోపన్యాసం చేశారు.

# నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలు తీసిన జగన్

- కమీషన్లతో లిక్కర్‌లో అతిపెద్ద కుంభకోణం
- దోపిడీ సొమ్ముకోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం
- కూటమి హయాంలో వందల కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, అభివృద్ధి పనులు
- వేల కోట్లతో పేదలకు పెన్షన్లు, సంక్షేమ పథకాలు
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



గిద్దలూరు (చైతన్యరథం): జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో స్కామ్‌ల కోసమే స్కీమ్‌లు పెట్టారని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో నాసిరకం మద్యం వల్ల ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారన్నారు. మద్యం విషయంలో జగన్ ప్రభుత్వం భారీ స్కామ్‌కు పాల్పడిందని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలను తాకట్టు పెట్టి స్వార్థపూరిత రాజకీయాలు చేశారని ఆక్షేపించారు. ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గంలో సోమవారం నాడు మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయస్వామి పర్యటించారు. ముందుగా రూ.1.33 కోట్లతో కంభంలో, రూ.70 లక్షలతో కందులాపురంలో, రూ.40 లక్షలతో హజరత్ గూడెంలో నిర్మించిన సీసీ రోడ్లను మంత్రి గొట్టిపాటి ప్రారంభించారు. అనంతరం బెస్తవారిపేటలో రూ.1.83 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తరువాత కొమరోలు కసినపల్లిలో రూ.3.60 కోట్లతో నిర్మించనున్న 3311 కేవీ సబ్ స్టేషన్ కు సహచర మంత్రి డీబీవీ స్వామితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం రాచర్ల మేడంవారి పల్లెలో రూ.3.90 కోట్లతో నిర్మించిన 3311 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ను మంత్రులిద్దరూ ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల కాలంలోనే వందల కోట్ల రూపాయిలతో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో వేల కిలోమీటర్ల మేర రోడ్ల మరమత్తులతో పాటు నూతన రోడ్లను నిర్మించినట్లు తెలిపారు. అదే విధంగా పేదల సంక్షేమమే ప్రధాన ఎజెండాగా పెన్షన్లను లబ్ధిదారులకు అందిస్తున్నామని వెల్లడించారు. రూ.33 వేల కోట్లను పింఛన్ల పంపిణీ కోసమే వెచ్చిస్తున్నామని మంత్రి తెలిపారు. ఎన్నికల హామీల్లో చెప్పిన విధంగా రూ.10వేల కోట్లను తల్లికి వందనం ద్వారా తల్లుల ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సరే ఆగస్టు 1 నాడు లక్షకు పైగా స్పౌజ్ పెన్షన్లను అందించామని తెలిపారు. అదే విధంగా యర్రగొండపాలెంలో రూ.66 కోట్లతో 220 కేవీ సబ్ స్టేషన్ ను నిర్మిస్తున్నామని చెప్పారు.

### కళ్లున్నా చూడలేని బుద్ధి హీనులు..

సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ప్రజలకు సుపరిపాలన అందిస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలన్నీ ఒక్కక్కటిగా అమలు చేస్తున్నామని చెప్పారు. మార్కాపురాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో గుండ్లకమ్మ గేట్లను విరగ్గొట్టి ఇసుక అక్రమ రవాణా చేశారని, కూటమి ఏర్పడిన తరువాత గుండ్లకమ్మకు గేట్లు బిగించి రైతులకు నీటిని ఇవ్వడమే కాకుండా చేప పిల్లలను వదలడం ద్వారా చేపలు పట్టే వారికి జీవనోపాధి కల్పించామని వెల్లడించారు. అదే విధంగా గుండ్లకమ్మ, వెలిగొండ ప్రాజెక్టులను కూడా పూర్తి చేస్తామని తెలిపారు. చెప్పిన విధంగా రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేశామన్నారు. ఆగస్ట్ 15 నుంచి మహిళలకు ఉచిత బస్ పథకాన్నీ అందుబాటులోకి తెస్తున్నామని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. నేతన్నల చేతి మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. నేతన్నల ఉచిత విద్యుత్ పథకం కోసం కూటమి ప్రభుత్వం రూ.125 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏమీ చేయడం లేదని అసత్య ప్రచారాలు చేస్తున్న వైసీపీ నేతలు కళ్లున్నా చూడలేని బుద్ధి హీనులని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అశోక్ రెడ్డి, కందుల నారాయణ రెడ్డి, ఉగ్రనరసింహా రెడ్డి, యర్రగొండపాలెం టీడీపీ ఇన్చార్జ్ ఎరిక్షన్ బాబు, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

# ఆప్కాబ్‌తో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం

- సహకార వ్యవస్థను మరింత శక్తివంతం చేస్తాం
- రైతును ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడమే లక్ష్యం
- సాంకేతిక ప్రగతితో మరింత మెరుగ్గా సహకార బ్యాంకుల సేవలు
- ఆప్కాబ్ 62వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో సహకార రంగాన్ని బలోపేతం చేస్తూ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు నాడిలా ఆప్కాబ్ సేవలందిస్తోందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. విజయవాడ గవర్నర్ పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్ (ఆప్కాబ్ ) 62వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బ్యాంక్ ద్వారా ప్రయోజనం పొందుతున్న రైతులకు, మహిళా సమాఖ్యలకు, యువతకు, సహకార సంఘాల సభ్యులకు, అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. రైతులకు విత్తనాలు, ఎరువులు, పెట్టుబడుల కోసం సకాలంలో రుణాలు అందిస్తూ, వ్యవసాయ అభివృద్ధికి కీలకంగా ఆప్కాబ్ నిలుస్తోందని తెలిపారు. సహకార వ్యవస్థను మరింత శక్తివంతం చేసి, ప్రతి రైతు కుటుంబాన్ని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ బ్యాంకు వ్యవస్థ పట్ల ప్రభుత్వం సంపూర్ణ నిబద్ధతతో ఉందని, సాంకేతిక ప్రగతితో సహకార బ్యాంకుల సేవలను మరింత ప్రజలతో మమేకం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. డీసీసీబీ, పీఏసీఎస్, ఆప్కాబ్‌లు వంటి సంస్థలు కమర్షియల్ బ్యాంకులు లేని గ్రామీణ ప్రాంతాలలో ఎన్నో సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నాయని కొనియాడారు.

**పేద వర్గాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ**

గ్రామాల్లో పేదవారికి ఆర్థిక తోడ్పాటు ఇవ్వడం, వారి అభివృద్ధికి ఆప్కాబ్ వ్యవస్థ ఎంతో దోహదం చేసిందన్నారు. ఒకప్పుడు కేంద్రంలో ఈ వ్యవస్థకి విడిగా మంత్రిత్వ శాఖ ఉండేది కాదని, 2014లో మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత ఈ శాఖ విలువను తెలుసుకొని ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యవసాయ, సహకార రంగాలు అత్యంత ప్రాధాన్యత కలిగినవన్నారు. ఒకప్పుడు రుణాలు ఇవ్వడానికి మాత్రమే పరిమితమైన ఆప్కాబ్ నేడు రైతులకు ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అందిస్తోందన్నారు. మరొక ముందడుగు వేసి మెడికల్ షాపులు, పెట్రోల్ బంకులు నిర్వహణతో ఈ వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

**విజనరీ నేత చంద్రబాబుతోనే..**

ఉమ్మడి రాష్ట్రం నుంచి ఎక్కడైనా సరే టెక్నాలజీ రంగంలో నూతన ఆవిష్కరణలు చేయాలన్నా, సరికొత్త టెక్నాలజీని ప్రజలకు పరిచయం చేయాలన్నా విజనరీ నేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరిగిందన్నారు. ఈ వ్యవస్థకు జవాబుదారీతనం లేక, సరైన రికార్డ్స్ లేకపోవడం వల్ల పలు అవినీతి కార్యకలాపాలు జరిగాయని, అందుకే కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కంప్యూటరైజేషన్ చేయాలనే నిర్ణయం తీసుకున్నామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అన్ని రాష్ట్రాల కంటే మన రాష్ట్రంలోనే పీఏసీఎస్‌ల కంప్యూటరైజేషన్ త్వరితగతిన చేశామన్నారు. ప్రస్తుతం జరుగుతున్నటువంటి ఆడిటింగ్ పని పూర్తవ్వగానే ఆన్‌లైన్‌లో ట్రాన్సాక్షన్స్ జరిగే విధంగా చూడాలన్నారు. అదే విధంగా కొత్తగా మెంబర్స్‌ను చేర్చుకునే కార్యక్రమాన్ని డీసీసీబీ, పీఏసీఎస్‌లు ప్రారంభించాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. ప్రతి కౌలు రైతు తప్పనిసరిగా సొసైటీలో మెంబర్‌గా ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

**డ్వాక్రా గ్రూప్ లావాదేవీలు జరిగేలా ప్రత్యేక చర్యలు**

మహిళలకు ఆర్థిక భరోసాను ఇచ్చేందుకు ఉమ్మడి రాష్ట్రంలో డ్వాక్రా వ్యవస్థని సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టారని, నేటికీ ఆ కార్యక్రమం విజయవంతంగా జరుగుతోందన్నారు. దాదాపుగా కోటి మంది మహిళలు ఈ వ్యవస్థలో భాగస్వామ్యులుగా ఉండగా 42 వేల కోట్ల రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయని తెలిపారు. అయితే ఈ లావాదేవీలు ఎక్కువగా ప్రైవేట్ బ్యాంక్స్‌లో జరుగుతున్నాయని, ఆప్కాబ్ బ్యాంకుల్లో డ్వాక్రా లావాదేవీలు జరిగేలా చర్యలు చేపట్టేందుకు సీఎం చంద్రబాబుతో మాట్లాడి ప్రణాళిక రూపొందిస్తామని హామీ ఇచ్చారు. ప్రైవేట్ బ్యాంకుల కంటే తక్కువగా మహిళలకు తక్కువ వడ్డీకి రుణాలు అందేలా పూర్తిస్థాయిలో కృషి చేద్దామన్నారు. అందరం కలిసికట్టుగా ఈ రంగాన్ని పూర్తిగా ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఆప్కాబ్ సేవలు రాష్ట్ర అభివృద్ధిలో అమూల్యమైనవని, భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్మన్ జీ వీరాంజనేయులు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ బీ. రాజశేఖర్, ఆర్సీఎస్ అమర్ బాబు, ఆప్కాబ్ ఎండీ శ్రీనాథ్ రెడ్డి, నాబార్డ్ సీజీఎం గోపాల్ , జిల్లాల డీసీసీబీ చైర్మన్లు, పీఏసీఎస్ చైర్మన్లు, సిబ్బంది, పాల్గొన్నారు.

# కూటమి పాలనలో రాష్ట్రంలో నాణ్యమైన మద్యం

**ప్రజారోగ్యం ఫణంగా పెట్టి జగన్ మద్యం వ్యాపారం - నూతన మద్యం పాలసీతో కుదుట పడుతున్న ప్రజారోగ్యం**

**- ఏపీ బయోడైవర్సిటీ బోర్డ్ చైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్**



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసిన నూతన మద్యం పాలసీ కారణంగా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణలలో మద్యం ఆదాయం తగ్గిందని ఏపీ బయోడైవర్సిటీ బోర్డ్ చైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్ తెలిపారు. ఏపీ నూతన పాలసీ వల్ల తమ రాష్ట్రంలో మద్యం ఆదాయం తగ్గినట్లు కర్ణాటక ఎక్సైజ్ శాఖ కమిషనర్ వెంకటేష్ పేర్కొనగా, ఏపీలో నాణ్యమైన మద్యం లభ్యతతో తమ రాష్ట్రంలోనూ అమ్మకాలు తగ్గాయని తెలంగాణ పత్రికలు వెల్లడించాయని ఆయన చెప్పారు. సోమవారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం నాసిరకం మద్యం అమ్మకాలతో పేదల ఆరోగ్యంతో చెలగాటం ఆడిందని, మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చుకొని రూ. కోట్ల రూపాయలు కొల్లగొట్టిందని ఆరోపించారు. వైసీపీ పాలనలో మద్యం అమ్మకాల్లో దోపిడీతో రాష్ట్ర ఆదాయం గణనీయంగా తగ్గిపోయిందని.. కూటమి ప్రభుత్వం అమలు చేసిన నూతన మద్యం పాలసీతో రాష్ట్ర ఆదాయం 10 శాతం పెరగడమే కాకుండా ప్రజారోగ్యం వైసీపీ పాలన కంటే మెరుగు పడిందని, గత సంవత్సరంగా మద్యం పై ఆరోగ్య సమస్యలు ఏవీ రాలేదని విజయ్ కుమార్ వెల్లడించారు.

**అన్ని రాష్ట్రాల్లో అధ్యయనం తరువాతే..**

తెలంగాణ, కర్ణాటక, కేరళ, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల లిక్కర్ పాలసీలను అధ్యయనం చేసి, ఏపీలో నూతన మద్యం పాలసీని తయారు చేశామని, అంతర్జాతీయ బ్రాండ్లను తక్కువ ధరలకు అందుబాటులోకి తెచ్చామని, మద్యం షాపులను పారదర్శకంగా లాటరీ పద్ధతిలో కేటాయించామని ఆయన చెప్పారు. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో మద్యం ధరలను 200 శాతం పెంచగా, కూటమి ప్రభుత్వం నూతన పాలసీ ద్వారా తక్కువ ధరలకే నాణ్యమైన మద్యం అందుబాటులోకి తెచ్చిందని, మద్యం తయారీలో క్వాలిటీని నిర్ధారణకు అధునాతన విధానాలు పాటించేలా చూస్తున్నామని చెప్పారు.

నూతన మద్యం పాలసీ అమలు చేసి ఏడాది పూర్తయినా ఎటువంటి లోపాలు ఇప్పటి దాకా బయటకు రాలేదని వైసీపీ నాయకులకు ధైర్యం ఉంటే కూటమి ప్రభుత్వంలో తయారయ్యే మద్యాన్ని ల్యాబ్‌లకు పంపి పరీక్షించుకోవాలని విజయ్ కుమార్ సవాల్ విసిరారు.

**వైసీపీ పాలనలో దెబ్బతిన్న ప్రజారోగ్యం**

వైసీపీ పాలనలో ట్రిబుల్ ఆర్, ట్రిబుల్ ఎక్స్, ప్రెసిడెంట్ మోడల్ వంటి కొత్త బ్రాండ్లను ప్రవేశపెట్టి ప్రజల ఆరోగ్యాన్ని గుల్ల చేశారన్నారు. జే-బ్రాండ్ల మద్యంతో కిడ్నీ, నరాలు, కాలేయం వంటి వ్యాధులతో ప్రజలు బాధపడ్డారని, వైసీపీ ఐదేళ్ల పాలనలో మత్తు పదార్థాలకు బానిసలై 1745 మంది యువత ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జే-బ్రాండ్ మద్యంలో పైరోగలాల్, డై ఇథైల్థాలేట్, ఐసోవులెరిక్ యాసిడ్ వంటి హానికారక రసాయనాలు ఉన్నట్లు చెన్నై ల్యాబ్ నిర్ధారించిందని, దీనివల్ల ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేసిన వ్యక్తిగా జగన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని ఆయన దుయ్యబట్టారు. వైసీపీ పాలనలో పాడైన ప్రజల ఆరోగ్యాన్ని బాగు చేసేందుకు డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేశామని, అవినీతి జగన్ రెడ్డికి కొత్త కాదని, కూటమి ప్రభుత్వానికి ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

వైసీపీ పాలనలో మద్యం తయారీ కంపెనీలను ఆ పార్టీ నాయకులు లీజుకు తీసుకొని నాసిరకం మద్యం ఉత్పత్తి చేశారని, మద్యం షాపుల్లో వైసీపీ కార్యకర్తలను నియమించారని ఆయన ఆరోపించారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఆర్డర్లు తీసుకోవడానికి సీటెల్ అనే సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టగా, జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే దాన్ని రద్దు చేసి స్వలాభం కోసం మాన్యువల్ ఆర్డర్ పద్ధతిని అమలు చేశారని ఆరోపించారు.

**మద్యం తయారీ, అమ్మకాల్లో మోసం- కమీషన్ల బాగోతం**

జగన్ పాలనలో మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులను నిషేధించి, కేవలం నగదు రూపంలోనే అమ్మకాలు జరిపారని, రూ.2.72 లక్షల కోట్ల నగదును బటన్ నొక్కి ప్రజలకు పంపిణీ చేశానంటూ చెప్పుకుంటున్న జగన్, రూ.1.01 లక్షల కోట్ల మద్యం వసూళ్లను మాత్రం నగదు రూపంలోనే సేకరించారని ఆయన విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన లిక్కర్ స్కాం దేశంలోనే అతి పెద్దదని, ఢిల్లీ లిక్కర్ స్కాంతో పోలిస్తే ఇది భారీగా ఉందని, సిట్ నివేదిక ప్రకారం రూ.3500 కోట్ల స్కాం జరిగిందని విజయ్ కుమార్ వెల్లడించారు. ప్రజల ప్రాణాలతో వైసీపీ నాయకులు చెలగాటమాడుతుంటే ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ రెడ్డి కమీషన్ల కక్కుర్తితో వారిని మరింత ప్రోత్సహించారని తప్పుబట్టారు. మద్యం వ్యాపారం నుంచి సంపాదించిన ఆదాయాన్ని ఎన్నికల్లో ఉపయోగించారన్నారు. ప్రజల ఆరోగ్యంతో ఆడుకోవడం సరికాదని భావించి, నాసిరకం మద్యానికి చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని రూపొందించిందని విజయ్ కుమార్ తెలిపారు.

# రూ.లక్ష కోట్లతో రెండేళ్లలో జాతీయ రహదారులు పూర్తి

**- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి**

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో రానున్న రెండేళ్లలో లక్ష కోట్ల రూపాయలతో జాతీయ రహదారుల నిర్మాణాల పనులు చేపట్టనున్నట్లు రాష్ట్ర రహదారులు, భవనాలు, మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖల మంత్రి బి.సి.జనార్ధన రెడ్డి తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ నెల 2వ తేదీన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రస్తుతం జరుగుతున్న పనులతో పాటు మొత్తం రూ. లక్ష కోట్ల విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులను మంజూరు చేశారన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో రూ.70 వేల కోట్లు పనులు జరుగుతున్నాయని, వాటి సంబంధించిన భూసేకరణ, అటవీ క్లియరెన్సుల్లో 80 శాతం మేర టాస్కుఫోర్స్ కమిటీ ఇప్పటికే మంజూరు చేసిందన్నారు. దాదాపు 9 జాతీయ రహదారుల విస్తరణ ప్రాజెక్టులను కేంద్రం ప్రకటించడం జరిగిందని, వీటిలో హైదరాబాద్ - విజయవాడ గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రాజెక్టు, రూ.6,700 కోట్ల విలువైన హైదరాబాద్ - విజయవాడ (6వరుసలు) ప్రాజెక్టు , రూ.2,600 కోట్ల విలువైన విజయవాడ-మచిలీపట్నం (6వరుసలు) ప్రాజెక్టు, రూ.2,605 కోట్ల విలువైన వినుకొండ-గుంటూరు (4వరుసలు) ప్రాజెక్టు, రూ.2,000 కోట్ల విలువైన గుంటూరు- నిజాంపట్నం (4వరుసలు) ప్రాజెక్టు, రూ.4,200 కోట్ల విలువైన బుగ్గ-కైప-గిద్దలూరు (4వరుసలు) ప్రాజెక్టు, రూ.2,500 కోట్లు విలువైన ఆకివీడు-దిగమర్రు (4వరుసలు) ప్రాజెక్టు, రూ.4,200 కోట్లు విలువైన పెడన-లక్ష్మీపురం (4వరుసలు) ప్రాజెక్టు, రూ.1,182




కోట్లు విలువైన ముద్దనూరు-కడప (4వరుసలు) ప్రాజెక్టులు ఉన్నట్లు మంత్రి తెలిపారు. వీటికి సంబంధించి డీపీఆర్‌లను త్వరలో రూపొందించి కేంద్రానికి నివేదించనున్నన్నామన్నారు.

**నాబార్డ్ నిధులతో..**

2019 - 2024 మధ్య గత ప్రభుత్వం పోతూపోతూ రూ.2300 కోట్ల బకాయిలు మా ప్రభుత్వంపై మోపిందని, తమ ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే రూ. 922 కోట్ల బకాయిలు కాంట్రాక్టర్లకు పార్టీలకు అతీతంగా చెల్లించామన్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా రూ. 861 కోట్లతో గత సంవత్సరం నవంబర్‌లో గుంతల రహిత రహదారుల మిషన్‌కి శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా దాదాపు 171 నియోజకవర్గాల్లో 20,000 కి.మీ రహదారులను గుంతల రహితంగా మార్చామన్నారు.

మరమ్మత్తులకు ప్రాధాన్యత నిస్తూ ప్లాన్ పథకంలో నాబార్డ్ మద్దతుతో రహదారుల అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. ప్లాన్ పథకం కింద రూ. 600 కోట్లు ఖర్చు చేసి, 128 నియోజకవర్గాల్లో 1433 కి.మీ 'సీ కేటగిరీ ఎస్‌హెచ్, ఎండీఆర్ రహదారులను అభివృద్ధి చేస్తున్నామన్నారు.

ఈ పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అదే విధంగా నాబార్డ్ నిధులతో రూ. 400 కోట్లతో 114 నియోజకవర్గాల్లో 1250 కి.మీ రహదారుల నిర్మాణ పనులకు సంబందించి టెండర్లు ప్రక్రియ పూర్తిచేసి పనులను కుడా ప్రారంభించామన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిలిచిన 87 ఎన్‌డీబీరహదారుల పనులను రూ. 1680 కోట్లతో మళ్లీ ప్రారంభించామన్నారు. వీటిలో ఇప్పటి వరకు రూ. 637.76 కోట్ల విలువైన పనులను పూర్తి చేసినట్లు మంత్రి తెలిపారు. వచ్చే ఏడాది డిసెంబర్‌కు అన్ని ఎన్‌డీబీ ప్రాజెక్టులు పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకుని, ఆ దిశగా ముందుకు వెళ్తున్నామన్నారు. రాయలసీమ ప్రాంతాన్ని రతనాల సీమగా అభివృద్ధి పర్చేందుకు తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ద చూపిస్తున్నట్లు మంత్రి జనార్ధన్‌రెడ్డి తెలిపారు.

# దేశంలోనే అత్యధిక సంక్షేమం అందిస్తున్న రాష్ట్రం ఏపీ

- **ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురం జిల్లా చేస్తాం, వెలిగొండ పూర్తి చేస్తాం**
- **సీఎం చంద్రబాబు ఈ వయసులోనూ ప్రజల కోసం ఎంతో కష్టపడుతున్నారు**
- **వైసీపీ నేతల కళ్లకు పొరలు కమ్మి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు**
- **మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**

గిద్దలూరు (చైతన్యరథం): దేశంలోనే అత్యధిక సంక్షేమం అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గంలో మంత్రులు డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా బేస్తవారిపేటలో రూ.1.83 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తరువాత కొమరోలు కసినపల్లిలో రూ.3.60 కోట్లతో నిర్మించనున్న 3311 కేవీ సబ్ స్టేషన్‌కు



శంకుస్థాపన చేశారు. అనంతరం రాచర్ల మేడంవారి పల్లెలో రూ.3.90 కోట్లతో నిర్మించిన 3311 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను మంత్రులిద్దరూ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రం ప్రభుత్వం అమలు చేయని విధంగా ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఫించన్ రూ. 200 నుంచి రూ. 2 వేలకు పెంచినా, రూ.2 వేల నుంచి రూ. 4వేలకు పెంచినా అది టీడీపీ ఘనతే. ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నా అమ్మఒడి ఇస్తానని చెప్పి జగన్ మోసం చేశాడు, మేము చెప్పిన మాట ప్రకారం ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం ఇచ్చాము. ఆగస్టు 15 నుంచి మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నాం. నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కూడా త్వరలో ఇస్తాం. రూ.4 వేల కోట్లతో గిద్దలూరు, బనగానపల్లెకు 4 లైన్ల రోడ్డు నిర్మిస్తున్నాం. అదే విధంగా బేస్తవారిపేట నుంచి ఒంగోలుకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మిస్తున్నాం. సీఎం చంద్రబాబు నాయుడు దర్శి పర్యటన సెట్టింగ్ అని వైసీపీ నేతలు మాట్లాడటం సిగ్గుచేటు, చంద్రబాబు నాయుడు ఎర్రటి ఎండలో రెండు గంటలపాటు రైతులు మధ్య గడిపారు. వైసీపీ నేతల కళ్ళకు పొరలు గమ్మి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. ప్రకాశం జిల్లాలో గెలిచిన ఇద్దరు వైసీపీ ఎమ్మెల్యేలు ఏనాడూ అసెంబ్లీకి రాలేదు, వారికి ప్రజా సమస్యలు పట్ల చిత్తశుద్ధి లేదు. వెలుగొండ పూర్తి కాకుండానే జగన్ జాతికి అంకితం చేసి జిల్లా ప్రజలను మోసం చేశాడు. మేం ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురాన్ని జిల్లా చేస్తాం, వెలుగొండ పూర్తిచేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని మంత్రి స్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అశోక్ రెడ్డి, కందుల నారాయణ రెడ్డి, ఉగ్రనరసింహా రెడ్డి, యర్రగొండపాలెం టీడీపీ ఇన్చార్జ్ ఎరిక్షన్ బాబు, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

# కొడుకు జాడ కోసం తండ్రి వేడుకోలు

**- తెలంగాణ పోలీసులు తీసుకెళ్లారని ఆవేదన**
**- వైసీపీ మాజీ ఎమ్మెల్యే భూ కబ్జాపై బాధితుడి ఫిర్యాదు**
**- టీడీపీ కేంద్ర కార్యాలయానికి తరలివచ్చిన బాధితులు**
**- అర్జీలు స్వీకరించిన ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్, లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు**

అమరావతి (చైతన్యరథం): ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన పోలీసులు ఈ ఏడాది మార్చి 5వ తేదీన అర్ధరాత్రి సమయంలో తన కుమారుడిని ఏ కారణం చెప్పకుండా తీసుకెళ్లారని.. అప్పటి నుండి తన కుమారుడి జాడ కనిపించడంలేదని ప్రకాశం జిల్లా కంభం మండలం కందులాపురానికి చెందిన తొండమల్లి రంగయ్య సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. దయచేసి తన కుమారుడి జాడ కనిపెట్టాలని వేడుకుంటూ ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్, లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావులకు అర్జీ అభ్యర్థించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై తరలివచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించిన నేతలు సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

నంద్యాల జిల్లా వెలుగోడు మండలం అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన కాటెపోగు కక్కయ్య గ్రీవెన్స్‌లో విజ్ఞప్తి చేస్తూ.. వైసీపీ మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి, అతని తమ్ముడు లబ్బి లక్ష్మన్నలు తమ భూములను కబ్జా చేసి ఇబ్బంది పెడుతున్నారని.. వారి నుండి తమ భూములను విడిపించాలని అభ్యర్థించారు.





ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం దామరచర్ల గ్రామానికి చెందిన శివరంజని విజ్ఞప్తి చేస్తూ.. ఒక వ్యక్తి తమ వద్ద అప్పుగా తీసుకున్న రూ.23 లక్షలు తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని.. అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళితే పోలీసులు కేసు తీసుకోవడంలేదని.. దయచేసి తమ సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించారు.

చిత్తూరు జిల్లా గుడిపల్లి మండలం కంచి బందర్లపల్లెకు చెందిన లక్ష్మి విజ్ఞప్తి చేస్తూ.. తన తల్లిదండ్రులు తనకు పసుపుకుంకుమ కింద ఇచ్చిన భూమిని తనకు ఇవ్వకుండా తన సోదరులు ఇబ్బంది పెడుతూ, తనను చంపేందుకు యత్నిస్తున్నారని.. దయచేసి తమ సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించారు.

డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కె. గంగవరం మండలం పామర్రు గ్రామానికి చెందిన ముత్యాల మోహన్ బాబా అభ్యర్థిస్తూ.. తాను కోనుగోలు చేసిన భూమిని ఒక వ్యక్తికి కౌలుకు ఇస్తే.. అతను కౌలు సక్రమంగా చెల్లించకపోవడంతో అతన్ని బయటకు పంపించానని, అప్పటి నుండి తమ భూమిని ఆక్రమించి దౌర్జన్యం చేస్తున్నాడని.. దయచేసి అతనిపై చర్యలు తీసుకొని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

# తెలుగు రాష్ట్రాల్లో విజృంభిస్తున్న డెంగ్యూ జ్వరాలు

అమరావతి (చైతన్యరథం): వర్షాకాలం అంటేనే సీజనల్ వ్యాధులు భయపెడుతుంటాయి. వర్షాలతో కొత్త నీరు రాక, దోమల కారణంగా ప్రజలు ఎక్కువగా వ్యాధుల బారినపడుతుంటారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో డెంగ్యూ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇప్పటికే పలు ఆసుపత్రుల్లో అధికారికంగా వందల కేసులు నమోదయ్యాయి. ముఖ్యంగా హైదరాబాద్ పరిధిలో అత్యధిక కేసులు నమోదవుతున్నట్లు నిర్ధారణ అయింది. దోమ కాటువల్ల వచ్చే డెంగ్యూ జ్వరం సోకితే అప్రమత్తత చాలా అవసరం అంటున్నారు నిపుణులు. డెంగ్యూ వ్యక్తులు సరైన వైద్య పరీక్షలు చేయించుకుని, సమయానుకూలంగా చికిత్స తీసుకోవాలని చెబుతున్నారు. డెంగ్యూ జ్వరం ఎడిస్ ఈజిప్టి అనే దోమ కాటు ద్వారా వ్యాపించే వైరల్ ఇన్ఫెక్షన్. ఈ దోమలు ఎక్కువగా ఉదయం, సాయంత్రం సమయంలో దాడి చేస్తాయి. ఈ దోమలు నీరు నిల్వ ఉన్న స్థలం, చెత్త, డ్రైనేజీ ప్రాంతాల్లో ఎక్కువగా అభివృద్ధి చెందుతాయి. డెంగ్యూ జ్వరం సాధారణ జ్వరంతో పాటు తీవ్రమైన డెంగ్యూ హెమరాజిక్ ఫీవర్‌గా మారే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.. ఇది ప్రాణాంతకమవుతుంది కాబట్టి, తగు జాగ్రత్తలు తీసుకోవడం చాలా మంచిదని సూచిస్తున్నారు.




# పరవాడ ఫార్మాసిటీలో విషవాయువుల లీక్

పరవాడ (చైతన్యరథం): అనకాపల్లి జిల్లాలోని పరవాడ జవహర్లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో లూపిన్ ఫార్మా కంపెనీలో విషవాయువులు లీకయ్యాయి. ఆరుగురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. లూపిన్ కంపెనీలో సాయికుమార్, శివ నాయుడు, గణేష్, రాజశేఖర్ కుమార్, నరేష్ కుమార్, రామ నాయుడు కార్మికులుగా పనిచేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో రియాక్టర్ వద్ద రసాయన వాయువులు లీకయ్యాయి. వాటిని పీల్చడంతో ఆరుగురూ అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని చికిత్స నిమిత్తం కంపెనీ సిబ్బంది స్థానిక ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన స్థలాన్ని ఇంఛార్జ్ డీఎస్పీ మోహన్ రావు, ఇంచార్జ్ సీఐ రామచంద్రరావు, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఫ్యాక్టరీస్ పరమేశ్వర పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు.



# మట్టితో వంద అడుగుల లక్ష్మీగణపతి విగ్రహం



అనకాపల్లి (చైతన్యరథం): వినాయక చవితికి అనకాపల్లిలో మట్టితో తయారు చేసిన వంద అడుగుల లక్ష్మీగణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ తెలిపారు. ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేయనున్న లక్ష్మీగణపతి విగ్రహ నమూనాను నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. అనకాపల్లి జిల్లా ఏర్పడ్డాక తొలిసారిగా సంపత్ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శిల్పి కామదేనువు ప్రసాద్ భారీ వినాయకుడిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 21 రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు భూలోకనాయుడు, భానుప్రకాష్, నరసింహారావు, భాను పాల్గొన్నారు.

# సాగునీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

నందిగామ (చైతన్యరథం): జగ్గయ్యపేట మండలం గౌరవరం వద్ద ఎన్ఎస్పీ సాగర్ నీటిని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, కేడీసీసీబీ ఛైర్మన్ రఘురాం, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్యలు విడుదల చేశారు. నందిగామ, చందర్లపాడు మండలాలకు ఎన్ఎస్పీ ఏటూరు, కంచెల మేజర్ కాలువలకు 3000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ.. ఆయకట్టు రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్ఎస్పీ అధికారులు ఆయకట్టు చివరివరకు నీరు అందేలా పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్పీ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు, ఎన్ఎస్పీ ఈఈలు, డీఈలు, నీటి సంఘాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.



# అంగన్వాడీల సమస్యలపై ప్రధానంగా దృష్టిపెట్టాం : సునీత

అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే అంగన్వాడీల దీర్ఘకాలిక సమస్యలపై ప్రధానంగా దృష్టి పెట్టి వాటి పరిష్కారానికి కృషి చేస్తుందని తెలుగునాడు అంగన్వాడి యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు సునీత ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కేవలం ఏడాదిలోనే అంగన్వాడీల సమస్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి పెట్టారు. పని భారం తగ్గించాలని, ఫోన్ల పనితీరు మెరుగుపరచాలన్న అంశాలపై ప్రభుత్వం వెంటనే స్పందించింది. అంగన్వాడీ కార్యకర్తల కోసం 5జీ ఫోన్ల పంపిణీకి అధికారులు ఇప్పటికే ప్రపోజల్ సిద్ధం చేశారు. ఆగస్టులో పంపిణీకి సిద్ధంగా ఉన్నారని ఆమె తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 98% అంగన్వాడీ కార్యకర్తలు పాత, సరిగ్గా పని చేయని సెల్ఫోన్లతోనే పని పూర్తి చేస్తున్నారు. ఇది వారి నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. అయితే, కొన్ని కార్మిక సంఘాలకు చెందిన (CITU, AITUC, IFTU) రాజకీయ ప్రయోజనాల కోసమే అంగన్వాడీలను తప్పుదోవ పట్టిస్తున్నాయని సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త ఫోన్లను తిరిగి ఇవ్వాలని, మాన్యువల్‌గా రికార్డులు రాసుకోవాలని చెబుతూ అంగన్వాడీలను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలకు సంబంధించిన ప్రతి చిన్న సమస్యను వెంటనే పరిష్కరించే విధంగా పనిచేస్తుందని గుర్తుంచుకోవాలని ఆమె సూచించారు.



# మండలి వెంకట కృష్ణారావు సేవలు ఆదర్శనీయం



శ్రీకాకుళం (చైతన్యరథం): మాజీ మంత్రి, దివంగత మండలి వెంకట కృష్ణారావు దివిసీమ అభివృద్ధికి చేసిన సేవలు ఆదర్శనీయమని టీడీపీ సీనియర్ నాయకుడు పరుచూరి సుభాష్ చంద్రబోస్ అన్నారు. సోమవారం మండలి వెంకటకృష్ణారావు శత జయంతి సందర్భంగా శ్రీకాకుళం టీడీపీ కార్యాలయంలో కేక్ కట్చేశారు. అలాగే శ్రీకాకుళం, పాపవినాశనం, గోగినేనిపాలెం, అచ్చంపాలెం, తెలుగురావు పాలెం పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలకు చెందిన 100 మందికిపైగా చిన్నారులకు తెలుగుయువత రాష్ట్ర నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు(చిన్నా) ఆధ్వర్యంలో రూ.40,000 విలువ గల దుస్తులు పంపిణీ చేశారు. పరుచూరి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ... 1977లో దివిసీమకు పెను ఉప్పెన వచ్చి వేలాది మంది మృతి చెందినప్పుడు బాధిత కుటుంబాలకు మండలి వెంకట కృష్ణారావు అండగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గోపీచంద్, శ్రీనివాసరావు, చిట్టిబాబు, రవి, నరేష్, రామకృష్ణ, నాని, వినయ్, సాయి తేజ, మణి తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రల్ వెజిటబుల్ మార్కెట్ తరలింపు

- శాశ్వత పరిష్కారం చూపిన కూటమి ప్రభుత్వం
- రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం (చైతన్యరథం): రాజమండ్రి నగరం నడిబొడ్డున రంభ ఊర్వశి మేనక థియేటర్ల వద్ద ఉన్న సెంట్రల్ వెజిటబుల్ మార్కెట్ (సీవీ మార్కెట్)ను బొమ్మూరుకు తరలించేందుకు కూటమి ప్రభుత్వం జీవో జారీ చేసిందని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) చెప్పారు. బొమ్మూరు శివాలయం రోడ్డులో ఉన్న శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి, శ్రీ సీతారామ స్వామి ఆలయానికి చెందిన నాలుగు ఎకరాల భూమిలో ఈ మార్కెట్ ఆ శాశ్వతంగా ఏర్పాటు చేసేందుకు దేవాదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన చెప్పారు. సీవీ మార్కెట్ సమీపంలోని ఇయ్యపు కూర్మారావు నివాసం వద్ద సోమవారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మీడియాతో మాట్లాడుతూ... రెండు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న ప్రజల కలకు ఇది ముగింపు అని గతంలో ఎన్నో ప్రభుత్వాలు, ఎంతోమంది ప్రజాప్రతినిధులు మారినా పరిష్కారం కాని ఈ సమస్యను కూటమి ప్రభుత్వం సరైన రీతిలో పరిష్కరించిందని అన్నారు. ఇది కేవలం స్థలం మార్పు కాదని ప్రజల శ్రేయస్సు కోసం చేసిన సాహసోపేత నిర్ణయమని ఆయన పేర్కొన్నారు. ఈ తరలింపు రాజమండ్రిలో చరిత్రగా నిలుస్తుందని, రివర్ ఫ్రంట్, అఖండ గోదావరి ప్రాజెక్టుల మాదిరి ఇది కూడా చారిత్రాత్మక ముందడుగు అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అభివర్ణించారు. బొమ్మూరులో మార్కెట్ ఏర్పాటు చేసేందుకు అంగీకరించిన వ్యాపారులు అక్కడ విద్యుత్, రోడ్లు, కాలువలు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారని ఆయన చెప్పారు. తనతో పాటు కూటమి ప్రభుత్వానికి చెందిన రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి, కమిషనర్ తదితరుల కృషితో సీవీ మార్కెట్ తరలింపు, సదుపాయాల కల్పన జరుగుతాయని ఆయన చెప్పారు. సీవీ మార్కెట్ తరలింపునకు ఎంత అందుకున్నారని వైసీపీ మాజీ ప్రజాప్రతినిధి అడిగారట.. సూటుకేసులు తీసుకుని స్వప్రయోజనాల కోసం స్వార్థంతోపనులు చేయడం అతడికి అలవాటని, పేపరుమిల్లు కార్మికులను అలాగే నాశనం చేశాడని ఆయన మండిపడ్డారు. తమకు సూటుకేసులు పుచ్చుకునే అలవాటు లేదని ప్రజలకు, వ్యాపారులకు, కార్మికులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలనేది కూటమి ప్రజాప్రతినిధుల అభిమతమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

మునగపాక (చైతన్యరథం): అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.5 వేలు, పీఎం కిసాన్ కింద రూ.2 వేల నగదు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుండడంతో అన్నదాతల ఆనందానికి అవధులు లేవు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ రెండు పథకాల కింద రైతులకు శనివారం తొలివిడత నిధులను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విడుదల చేసిన విషయం తెలిసిందే. దీంతో అర్హులైన ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.7 వేల చొప్పున జమ అవుతున్నాయి. ఈ సందర్భంగా స్థానిక కొత్తమహాలక్ష్మి పురిటిగెడ్డ ప్రాంతంలో రైతులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మునగపాక మండలంలో మండల వ్యాప్తంగా సుమారు తొమ్మిది వేల మంది రైతుల రూ.6 కోట్ల పెట్టుబడి సాయం అందున్నదని చెప్పారు. మిగిలిన రూ.13 వేలు వచ్చే ఏడాది మార్చిలోపు రెండు విడతల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు.

# కాకినాడలో తప్పుడు సర్వే నెంబర్లతో సర్కారు భూమి కబ్జా

- దొంగ రిజిస్ట్రేషన్లు చేయించిన వారిపై చర్యలు తీసుకోండి
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన టీడీపీ ఎమ్మెల్యే వనమాడి



కాకినాడ (చైతన్యరథం): మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా పరిధిలోని చీడీలపొర మరియు పోర్టు పరిసర ప్రాంతాల్లో కోట్లు విలువ చేసే కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన భూములను, గత ప్రభుత్వపు రాజకీయ నాయకుల కనుసన్నల్లో తప్పుడు పత్రాలను సృష్టించి రెవెన్యూ మరియు రిజిస్టర్ కార్యాలయాల నందు తప్పుడు సర్వే నెంబర్లతో భూములను రిజిస్ట్రేషన్లు చేయించిన వారిపై చర్యలు చేపట్టాలని నియోజకవర్గ శాసనసభ్యులు వనమాడి కొండబాబు సోమవారం జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ... కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చీడీలపొర మరియు పోర్టు పరిసర ప్రాంతాల్లో కోట్లు విలువ చేసే కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన భూములను, గత ప్రభుత్వపు రాజకీయ నాయకుల కనుసన్నల్లో తప్పుడు పత్రాలను సృష్టించి రెవెన్యూ మరియు రిజిస్టర్ కార్యాలయాల నందు తప్పుడు సర్వే నెంబర్లతో భూములను రిజిస్ట్రేషన్లు చేయించారని, మరల అవే దస్త్రా వేజులను దర్జాగా బయటకి తిప్పుతూ అమాయక ప్రజలకు అంటకట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, చీడీలపొరలో గల సర్వే నెంబరు. 112, 182, 199/6లో సుమారు యాభై ఎకరాల భూమిని, కాకినాడ అర్బన్ కేసిన అమ్మిరాజు, గంటి గన్నయ్య, ఎం సత్యనారాయణ మరియు పోలిశెట్టి వెంకట రమణకు నిరభ్యంతర పత్రము ఇచ్చినట్లుగా తప్పుడు దస్తావేజులు సృష్టించి, చీడీలపొరలోని ప్రభుత్వానికి చెందిన పోరంబోకు, జిరాయితి భూములను చూపించి, బయటి వ్యక్తులకు అమ్ముతున్నారని, కాకినాడ పోర్టుకి సంబంధించిన ఆర్.ఎస్.నెంబర్ 364/2, ఆర్.ఎస్.నెంబర్ 2004 సుమారు 79 ఎకరాల భూమికి రెండు పార్టీలకు చెందినదిగా అందులో ఒకరు బెంగుళూరుకు చెందిన వ్యక్తిదిగా దస్తావేజు సృష్టించారని, మరొకటి కొంతమంది కలిసి వారికీ చెందినదిగా మరొక దస్తావేజు సృష్టించారని ఒక భూమిని విడివిడిగా రెండు దస్తావేజులు సృష్టించినారని, అలాగే కాకినాడ సాంబమూర్తి నగర్ నందు గల కేంద్ర ప్రభుత్వానికి చెందిన భూములను చదును చేసి ప్రైవేటు జరాయితీ భూములుగా సర్వే నెంబర్లు మార్చించి లే-అవుట్లు చేశారని, గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన కొంతమంది అధికారుల అండదండలతో తప్పుడు సర్వే నెంబర్లతో పత్రాలను తారుమారు చేసి వేరు వేరు చోట్ల రిజిస్టర్ ఆఫీసుల నందు తప్పుడు రిజిస్ట్రీ చేయించడమే కాకుండా వాటిని తొందరగా సామాన్య వ్యక్తులకు అమ్ముటకు ఒక ముఠా ప్రయత్నిస్తుందని, తప్పుడు సర్వే నెంబర్లతో భూములను రిజిస్ట్రేషన్లు చేయించిన వారిపై విచారణ జరిపించి కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ భూములను తగిన చర్యలు తీసుకొని వారు సృష్టించిన తప్పుడు దస్తావేజులను వెంటనే రద్దు చేయాలని జిల్లా కలెక్టర్‌ని కోరడం జరిగిందని పేర్కొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- రూ. 5 లక్షల విలువైన చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు (చైతన్యరథం): సీఎం సహాయనిధి ద్వారా పేదల ఆరోగ్యానికి రక్షగా నిలుస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో సోమవారం ఇద్దరికీ రూ.5 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే నసీర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో పేదలకు ఆరోగ్యపరంగా అండగా నిలుస్తున్నామని తెలిపారు. గుంటూరు నగరంలో జీజీహెచ్ లో కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నామని, అత్యవసర పరిస్థితుల్లో పేదలు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుకున్నప్పటికీ వారికి సీఎం రిలీఫ్ ద్వారా ఆదుకుంటున్నామని



చెప్పారు. ఇప్పటికే గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సుమారు రూ. 4.50 కోట్ల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించామని వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో ఏ సమయంలోనైనా వైద్యపరంగా తమను సంప్రదించవచ్చని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ తెలిపారు.

# గుండెపోటుతో కుప్పకూలిన టీడీపీ నేత పీరయ్య

నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు జిల్లా వరికుంటపాడులో తెదేపా నేత షేక్ పీరయ్య గుండెపోటుకు గురయ్యాడు. పోలీసులు విచారిస్తుండగా అతడికి గుండెపోటు వచ్చి కుప్పకూలిపోయాడు. అతడిని ప్రకాశం జిల్లా పామూరు ఆస్పత్రికి తరలించారు. మైనింగ్ వద్దు గ్రామమే ముద్దంటూ గ్రామస్థులు చేపట్టిన నిరసనలో పీరయ్య పాల్గొన్నాడు. దీంతో అతడిని పోలీసులు విచారణకు పిలిపించారు. పోలీసుల వేధింపుల వల్లే పీరయ్యకు గుండెపోటు వచ్చిందని బంధువులు ఆరోపిస్తున్నారు.

# రైతులకు మేలు జరగాలి : ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం (చైతన్యరథం): వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన వ్యవసాయ మార్కెట్ కమిటీలను తిరిగి గాడిలో పెట్టేందుకు ఆర్థికంగా పరిపుష్టం చేయడానికి నూతన పాలక మండలి చర్యలు తీసుకోవాలని, ఆదాయం పెంచుకోవడంతో పాటు చిన్న సన్నకారు రైతులకు మేలు జరిగే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక మండలి పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమం కోరుకొండ రోడ్డులోని మార్కెట్‌యార్డు ఆవరణలో నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మార్ని వాసుదేవ్, ఉపాధ్యక్షుడిగా నర్సరీ సంఘం ఉపాధ్యక్షుడు బోడపాటి గోపాలకృష్ణ(గోపి), డైరెక్టర్లుగా జనసేన నాయకుడు జంగా వినోద్ (వేమగిరిగట్టు), మురమండ టీడీపీ అధ్యక్షుడు దేవళ్ల రామ్మోహనరావు, గ్రంధి విజయలక్ష్మి(దుళ్ల) తదితర పాలక మండలి సభ్యులతో ఎమ్మెల్యే గోరంట్ల ప్రమాణస్వీకారం చేయించారు.



# గుంటూరు పశ్చిమ సమగ్ర అభివృద్ధికి వేగంగా చర్యలు

- రూ.149.84 లక్షల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి వేగంగా చర్యలు తీసుకొని పనులు ప్రారంభిస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేసారు. సోమవారం గుంటూరు 42,43వ డివిజన్‌లలో రూ. 149.84 లక్షల విలువైన పనులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... "ప్రజలకు అభివృద్ధి అనేది హక్కు. కానీ గత వైసీపీ ప్రభుత్వం దానిని ప్రజలకు దూరం చేసింది. మా నియోజకవర్గంలోని 42వ, 43వ డివిజన్లను గత వైసిపి నేతలు పూర్తిగా పక్కన పెట్టారు. టీడీపీ కార్పొరేటర్లు గెలిచారని కక్షపూరితంగా అభివృద్ధిని అడ్డుకున్నారు. ముఖ్యమైన రహదారులు, డ్రెయిన్లు కూడా వేయకుండా ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేశారు."యూజీడీ పేరుతో పూర్తిగా రోడ్డు అంతటినీ తవ్వి వేసి, ఎక్కడ పడితే అక్కడ పనులు జరగకుండా నిలిపేసి, ఏ కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇవ్వకుండా లేదా అసలు కాంట్రాక్టర్ టెండర్ వేయకుండా, ప్రధానమైన ఈ రోడ్డుని గత ఐదు సంవత్సరాల నుంచి ఏ విధంగా వదిలేసారో ప్రజలందరూ గమనించారన్నారు. "తెలుగుదేశం పార్టీకి ప్రజల సంక్షేమం ముఖ్యమైన లక్ష్యం. అందుకే ప్రభుత్వంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధికి బాటలు వేసాం. పార్టీలకు అతీతంగా, ఏ ప్రాంతానికైనా న్యాయం జరగాలన్నదే నా ధ్యేయం. అభివృద్ధి, సంక్షేమం రెండూ ఒకే దారిలో నడవాలి. అందుకే ఒక్కో సమస్యపై అధికారులతో సమీక్షలు జరిపి తక్షణమే పనులు ప్రారంభించాను. ఈ రహదారి స్థానిక ప్రజల చిరకాల వాంఛ అని దీనిని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని, అభివృద్ధి, అటు సంక్షేమం రెండు కళ్ళగా ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర, జనసేన రాష్ట్ర ప్రధాన ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, కొమ్మినేని కోటేశ్వరరావు, వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, లంకా ఉదయ్, మాల్యాద్రి పేరయ్య, వెంకటేష్, కిరణ్ రెడ్డి కూసం, తదితరులు పాల్గొన్నారు.




# ఏడు దశాబ్దాల జీవనాడికి జవసత్వాలు..!

- కల సాకారం చేసిన చంద్రబాబుకు రుణపడి ఉంటాం..!
- రైతు బాంధవులు బ్రహ్మానందరెడ్డి, లావుకు కృతజ్ఞతలు..!
- వరికపూడిశెల ప్రాజెక్ట్ వద్ద రైతుల పాలాభిషేకం..!



వెల్దుర్తి (చైతన్యరథం): పల్నాడు ప్రజల జీవనాడి, ఏడు దశాబ్దాల చిరకాల వాంఛ వరికపూడిశెల ప్రాజెక్ట్ నిర్మాణ పనులకు అడుగులు పడుతున్న వేళ కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రుణపడి ఉంటామని వరికపూడిశెల జలసాధన సమితి పెద్దలు స్పష్టం చేశారు. సోమవరం నల్లమల అటవీ ప్రాంతంలోని వరికపూడిశెల ప్రాజెక్ట్ నిర్మించ తలపెట్టిన దమ్మర్లగొంది వద్ద ఉన్న కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, సారె సమర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వర్థిల్లాలి అని, ప్రాజెక్ట్ కల సాకారం చేసినందుకు ధన్యవాదాలు అని నినాదాలు చేశారు.

**ఫారెస్ట్ క్లియరెన్స్‌కు రూ.14.81 కోట్లు..!**

గత పాలకులు ఇదిగో వరికపూడిశెల.. అదిగో వరికపూడిశెల అని భూటకపు భూమి పూజలు చేసి.., కుత్రిమ పనులు చేసి.., ఎన్నికల స్టంట్‌ను ప్రదర్శించారని ఈ సందర్భంగా రైతులు విమర్శించారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి అడ్డంకిగా మారిన ఫారెస్ట్ అనుమతులకు కావాల్సిన కనీస నిధులు కూడా విడుదల చేయకుండా చేతులెత్తేసి.., ప్రజలను మోసం చేశారని వైసీపీ పాలన విధానాలను దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక శాసన సభ్యులు జూలకంటి ప్రాజెక్ట్ ప్రాధాన్యతను పదేపదే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి.., నిధులు సాధించారని రైతులు స్పష్టం చేశారు. ప్రాజెక్ట్ మట్టి పనులకు ప్రధాన అటంకంలా మారిన ఫారెస్ట్ క్లియరెన్స్ ను క్లియర్ చేయడంతో నిర్మాణ పనులు ఇక ఎక్కడ బ్రేక్ పడకుండా ముందుకు సాగుతోందన్న నమ్మకం పల్నాడు ప్రాంత రైతుల్లో బలపడిందని వివరించారు.

**రైతుల బాంధవులు జూలకంటి, లావుకు కృతజ్ఞతలు**

పల్నాడు ప్రాంత రైతు బాంధవులు ఎమ్మెల్యే జూలకంటి,లావు శ్రీకృష్ణదేవరాయలు అని రైతులు కొనియాడారు. ఈ ప్రాంత బిడ్డగా..,ఒక రైతుగా స్థానిక ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ప్రాజెక్ట్ నిర్మాణ ఆవశ్యకతను పదేపదే చట్ట సభల్లో ప్రస్తావించడంతో పాటు ప్రాజెక్ట్ నిర్మించ తీరకుంటే రాజకీయాలు నుంచి తప్పుకుంటా అని భీష్మించడం, అలానే ఈ ప్రాంత రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులు గుర్తించి, ఢిల్లీ నుంచి ప్రాజెక్ట్ అనుమతుల తీసుకురావడంలో లావు చేసిన ప్రయత్నాలు వంటి ప్రస్తావిస్తూ ఇరువురి కృషిని ఈ సందర్భంగా రైతులు ప్రశంసించారు. అలానే వెల్దుర్తి మండలం వాసిగా ఎమ్మెల్యే జూలకంటి వరికపూడిశెల ప్రాజెక్ట్ ను సెంటిమెంట్ గా తీసుకుని పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాక కూటమి ప్రభుత్వం త్వరలో ప్రాజెక్ట్‌కు ఫేజ్ -1 పనులకు సంబంధించిన నిధులు కేటాయించి, త్వరిగతిన నిర్మాణ పనులు ప్రారంభిస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బొల్లాపల్లి, పుల్లల చెరువు, వెల్దుర్తి మండల రైతులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంతో రహదారులకు మోక్షం

●కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రకటనపై హర్షం వ్యక్తం చేసిన వీరంకి గురుమూర్తి, లుక్కా సాయిరాం

●మోదీ, గడ్కరీ, చంద్రబాబు, పవన్, కేశినేని శివనాథ్, బాలశౌరీ చిత్రపటాలకు పాలాభిషేకం



విజయవాడ (చైతన్యరథం): గత జగన్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని, ఎంతో అనుభవజ్ఞుడైన సీఎం చంద్రబాబు వాటిని సరిచేస్తూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని అన్నిరంగాల్లోను అభివృద్ధిపథంలోకి తీసుకువస్తూ దేశంలోనే ఏపీని మొదటిస్థానంలో నిలిపేందుకు విజనరీ నాయకుడు నిత్యశ్రామికుడై కృషి చేస్తున్నారని రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి, లుక్కా సాయిరాం గౌడ్ కొనియాడారు. శనివారం కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో కలిసి రాష్ట్రంలో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన సంగతి విధితమే. ఈ క్రమంలో జరిగిన సభలో కేంద్రమంత్రి గడ్కరీ మాట్లాడుతూ... ఏపీ అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ఈ తరుణంలో వేదికపై సీఎం చంద్రబాబు కేంద్రమంత్రి నితిన్ గడ్కరిని భారీ హైవే ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేస్తూ చేసిన ప్రకటనకు గడ్కరి సానుకూలంగా స్పందించటం పట్ల గురుమూర్తి ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రమంత్రి గడ్కరీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, విజయవాడ, మచిలీపట్నం ఎంపిలు కేశినేని చిన్ని, బాలశౌరి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం గురుమూర్తి సాయిరాం గౌడ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ పాలనలో రహదారులకు మోక్షం లభిస్తోందన్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడ రహదారిని ఆరు లైన్లుగా మార్పు చేస్తామని, అందుకు రూ. 6700ల కోట్లు ఖర్చు చేయనున్నట్లు కేంద్రమంత్రి ప్రటించారన్నారు. విజయవాడ-మచిలీపట్నం రోడ్డును ఆరులైన్లుగా మార్పుచేసి రూ. 2600 కోట్లతో అభివృద్ధి చేస్తామని ప్రకటించటం ముదావహమన్నారు. అదేవిధంగా, రూ.2605 కోట్లతో వినుకొండ-గుంటూరును నాలుగు లైన్ల రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు, రూ.2వేల కోట్లతో గుంటూరు-నిజాంపట్నం రోడ్డును నాలుగు లైన్లుగా చేసి అభివృద్ధిపరచేందుకు, బుగ్గకయిప-గిద్దలూరు రోడ్డును నాలుగు లైన్ల రోడ్డుగా మార్పుచేసి రూ. 4200 కోట్లు ఖర్చు చేసేందుకు, ఇక ఆకివీడు-దిగమర్రు రోడ్డును నాలుగు లైన్ల రోడ్డుగా మార్పు చేసేందుకు రూ.2500 కోట్లు ఖర్చుచేయనున్నారని, పెడన లక్ష్మీపురం రోడ్డును నాలుగు రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు రూ.4,200 కోట్లు ఖర్చు చేయనున్నామని, ముద్దునూరు-కడప రోడ్డును రూ.1182 కోట్లతో నాలుగు రోడ్లుగా మార్పు చేసేందుకు కేంద్రమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సంతోషదాయకమన్నారు. ఇవికాకుండా హైదరాబాద్-విజయవాడ గ్రీన్ ఫీల్డ్ హైవే కూడా మంజూరు చేశారని, ఇది ఎంతో ఆనందదాయకమన్నారు. వీటికితోడు ఏడాదిలో మరో రూ. 1లక్ష కోట్లతో హైవే ప్రాజెక్టులను మంజూరు చేయనున్నట్లు సభావేదికపై నుంచి కేంద్రమంత్రి గడ్కరీ ప్రకటించటం కేంద్ర ప్రభుత్వం ఏపీకి ఇస్తున్న ప్రాధాన్యత తేటతెల్లమవుతోందన్నారు. పరిపాలనాదక్షుడైన చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్ర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గవర్నర్ అశోక్‌గజపతిరాజును సత్కరించిన ఎంపీలు

●శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ కేశినేని శివనాథ్



ఢిల్లీ /విజయవాడ (చైతన్యరథం): ఢిల్లీ పర్యటనలో వున్న గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు సోమవారం పార్లమెంట్‌లోని టీడీపీ పార్లమెంటరీ పార్టీ కార్యాలయంకు చేరుకున్నారు. ఈసందర్భంగా టీడీపీ ఎంపీలు గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుకు పుష్పగుచ్చం అందించి శాలువాతో సత్కరించారు. గోవా గవర్నర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన గవర్నర్ అశోక్‌గజపతిరాజుకు ఎంపీ కేశినేని శివనాథ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విమానాయన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు, ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయులు, హరీష్ మాధూర్, ఎం.శ్రీ భరత్, కలిశెట్టి అప్పలనాయుడు, దగ్గుమళ్ల ప్రసాదరావు, రాజ్యసభ ఎంపీ బీద మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులు దేవుడితో సమానం : యార్లగడ్డ

●రాజధాని అభివృద్ధిలో వైద్యులు భాగస్వాములు కావాలి



గన్నవరం (చైతన్యరథం): దైవం మనిషికి ప్రాణం పోస్తే ఆ వ్యక్తి ప్రాణం పోకుండా కాపాడి పునర్ జీవితాన్ని ఇచ్చే శక్తి వైద్యులకు మాత్రమే ఉందని, అందుకే మన సమాజంలో వైద్యులను దైవం భావిస్తారని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అభిప్రాయపడ్డారు. మండల పరిధిలోని చిన్నఆవుటపల్లి గ్రామంలోని పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల ఆవరణలో వారం రోజులపాటు జరిగే ఆరోగ్య అవగాహన ప్రదర్శనను సోమవారం ఉదయం ఎమ్మెల్యే యార్లగడ్డ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో యార్లగడ్డ మాట్లాడుతూ... వైద్యులు కేవలం డబ్బు సంపాదన కోసమే కాకుండా మానసిక తృప్తి కోసం పేద రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించాలని సూచించారు. ఎంతోమంది వైద్యులు పేద రోగులకు ఉచితంగా వైద్య సాయం చేస్తూ సమాజంలో ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. వైద్యులకు అనునిత్యం ఎన్నో సవాళ్ళు ఎదురవుతాయని వాటిని ధీటుగా ఎదుర్కొని రోగుల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధిలో వైద్యులు తమ వంతు సహకారం అందించాలన్నారు. రాష్ట్రంలో ఆధునాతన వసతులతో కూడిన వైద్యశాలలు అందుబాటులో లేకపోవడంతో రోగులు హైదరాబాద్, చెన్నై వంటి ప్రాంతాలకు తరలి వెళ్లి వైద్య చికిత్సలు పొందుతున్నారని పేర్కొన్నారు. ఇక్కడ చదువుకుంటున్న వైద్య విద్యార్థులు ప్రపంచంలో మేటి రాజధానిగా నిలవబోతున్న అమరావతి ప్రాంతంలో వైద్యశాలలు ఏర్పాటు చేసి అమరావతిని మెడికల్ హబ్ గా చేసే ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా పదిమందికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆ దిశగా ప్రతి ఒక్కరు ప్రయత్నాలు చేయాలని కోరారు. ఏ వృత్తిలో అయినా గెలుపుకు దగ్గర దారులంటూ లేవన్న యార్లగడ్డ హార్డ్ వర్క్ ద్వారానే గెలుపు సాధ్యమని స్పష్టం చేశారు. 50 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన సిద్ధార్థ అకాడమీ లాభాపేక్ష లేకుండా నేడు 20 విద్యాసంస్థలతో, ప్రతి ఏటా 26 వేల మంది విద్యార్థులకు విద్యను అందించటం అభినందనీయమన్నారు.

# రైతులకు అండగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే వసంత



మైలవరం (చైతన్యరథం): నియోజకవర్గంలోని మైలవరం మండలంలోని మర్సుమల్లి పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ సోమవారం పాల్గొన్నారు. చైర్మన్గా కిలారు సత్యనారాయణ, సభ్యులుగా నీలపాల వెంకటేశ్వరరావు, సగ్గుర్తి శ్యాంబాబు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన త్రిసభ్య కమిటీని ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాదు మాట్లాడుతూ... త్రిసభ్య కమిటీ సభ్యులు రైతులకు విశేషంగా సేవలను అందించాలని సూచించారు. రైతులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉండాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు రైతుల అభ్యున్నతి ప్రధాన ధ్యేయంగా కృషి చేయాలన్నారు. సొసైటీని ఆర్థికంగా మరింత బలోపేతం చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలకు తోడు సొసైటీ ద్వారా రైతుల శ్రేయస్సు కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కమిటీ సభ్యులకు సూచించారు. 'పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ' కింద రైతులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే పెట్టుబడి సాయాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు వెల్లడించారు. వ్యవసాయ సీజన్ ఆరంభం నేపథ్యంలో రైతులకు ఎరువులు, విత్తనాలు సకాలంలో పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్లు అందజేసిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య



జగ్గయ్యపేట (చైతన్యరథం): నియోజకవర్గంలోని దివ్యాంగులకు అన్నివిధాలుగా ఆదుకుంటామని, ఎల్లప్పుడూ అండగా ఉంటామని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పేర్కొన్నారు. సోమవారం జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నియోజకవర్గ దివ్యాంగుల అధ్యక్షులు వడ్డెపూడి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో మచిలీపట్నం భారత్ హెవీ ఎలక్ట్రానిక్ కంపెనీ వారి సీఎస్ఆర్ నిధులతో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య 25 ఎలక్ట్రికల్ బ్యాటరీ సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ... సమాజంలో దివ్యాంగులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వారికి చేయూత ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. దివ్యాంగులకు ఇల్లు, ఇళ్ల స్థలాలు విషయంలో మొదటి ప్రాధాన్యత ఇస్తామని, స్థానిక అధికారులతో మాట్లాడి దివ్యాంగుల కోసం ప్రత్యేక స్థలం కేటాయించి సొంత భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

నియోజకవర్గం దివ్యాంగుల అధ్యక్షులు వడ్డెపూడి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... నియోజకవర్గంలోని దివ్యాంగులను ఆదుకునేందుకు కృషి చేస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని, భారత్ హెవీ ఎలక్ట్రానిక్స్ సంస్థ నుంచి ఈ బ్యాటరీ సైకిళ్లు ఇక్కడకు వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు అభినందలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు గోపాలరావు, కట్టా వెంకట నరసింహారావు, మైనేని రాధాకృష్ణ, కన్నెబోయిన రామలక్ష్మి, కంచేటి గీతారాణి, నకిరకంటి వెంకటల్, సామినేని మనోహర్, కటికల అనిల్ పాల్గొన్నారు.

# బొండా ఉమా సమక్షంలో పార్టీలోకి చేరికలు



విజయవాడ (చైతన్యరథం): టీడీపీ అంటేనే నిబద్ధతతో పనిచేసే పార్టీ అని, పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి ఖచ్చితమైన గుర్తింపు ఉంటుందని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యానించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 27వ డివిజన్ వైసీపీ ట్రేడ్ యూనియన్ నాయకుడు చిట్టూరి సతీష్‌తో పాటు మరికొంత మంది బొండా ఉమా సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఉమా... ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీ పట్ల ఆకర్షితులై టీడీపీలో చేరుతున్నారని, పార్టీ నియమ నిబంధనల ప్రకారం క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. వైసీపీ నాయకుడు చిట్టూరి సతీష్‌తో పాటు మరికొంత మంది నేడు టీడీపీలో చేరడం శుభపరిణామమని పార్టీ పటిష్టతకు ప్రతిఒక్కరూ పనిచేయాలని బొండా ఉమా ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చెవిలో పువ్వులు పెట్టొద్దు భాస్కరరెడ్డీ

**చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని**



చంద్రగిరి, (చైతన్యరథం): తిరుపతి రూరల్ మండలంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మీడియా సమావేశంలో మాట్లాడారు. మద్యం కుంభకోణంలో తనకు సంబంధం లేదంటూ చెవిరెడ్డి రోజుకు ఒక అబద్ధం చెబుతున్నారు. చెవిరెడ్డి ఇంక ఎవరి చెవుల్లో పూలు పెట్టలేడని ఆయన అక్రమాలు, అన్యాయాలతో పాటుగా నిజ స్వరూపం ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని అన్నారు. కోర్టు బయట అధికారులకు బెదిరింపులు, కోర్టు లోపల గౌరవ జడ్జిల వద్ద ఏడ్పులు ఎందుకోసం, ఎవరికోసమో తెలిసిపోయిందన్నారు. నేను ఎన్నికలకు ముందే చెప్పాను చెవిరెడ్డి తుమ్మలగుంట అపరిచితుడు అని ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు.

మద్యం కుంభకోణంలో అరెస్టయిన చెవిరెడ్డి పూటకు ఒక మాట, రోజుకు ఒక బాట వేస్తూ ఉన్నాడన్నారు. మద్యం కుంభకోణంలో చెవిరెడ్డి పాత్ర ఎంతుందో జగన్ పాత్ర కూడా అంతే ఉందన్నారు. చంద్రగిరి నియోజకవర్గ పరువేకాదు... ఆంధ్ర రాష్ట్రం పరువును కూడా చెవిరెడ్డి తీసేసాడని ఆవేదన వ్యక్తం చేశారు. తుడాలో చెవిరెడ్డి కుటుంబం చేసిన అవినీతిని త్వరలో విజిలెన్స్ అధికారులు బయటపెడతారన్నారు. ఎన్నికలకు ముందు చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లపై ఎన్నికల కమిషన్ కి 297 ఫిర్యాదులు చేశామన్నారు. రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లను చేర్పించారన్నారు. చెవిరెడ్డికి సహకరించిన అధికారులు అందరూ ఊచలు లెక్క పెట్టాల్సిందేనన్నారు. గత ఐదు సంవత్సరాల వైసిపి పాలనలో మద్యం కుంభకోణంలో వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టారన్నారు. రాష్ట్ర అభివృద్ధిని అధోగతి పట్టించి ప్రజల ఆరోగ్యంతో ఆడుకున్నారన్నారు. ఇవి తాము ము చేస్తున్న ఆరోపణలు కాదన్నారు. సిట్ అధికారుల దర్యాప్తులో బయటకు వస్తున్న నిజాలు. లిక్కర్ స్కామ్ లో సూత్రధారులందరూ చెవిరెడ్డి శిష్యులే. దీనికి సాక్షాధారాలు అన్నింటిని సిట్ ఆధారాలతో సహా బయటకు తీస్తుంది. మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితులు రాజ్ కసిరెడ్డి, వెంకటేష్ నాయుడు, మరి కొంతమందితో కలిసి విదేశీ పర్యటనలు ఎందుకు చేయాల్సి వచ్చింది. దుబాయ్, సింగపూర్, శ్రీలంక ఇతర దేశాలలో నువ్వు చేస్తున్నది ఏమిటి. దుబాయ్ శ్రీలంకలో మద్యం కుంభకోణం లో సంపాదించిన హవాల డబ్బులు మార్చినట్లు ఆధారాలు ఉన్నాయన్నారు. సిట్ అధికారులకు సహకరించడానికి నేను కూడా సిద్ధంగా ఉన్నా..ఎన్నికల ముందు నా ఫోను, నా కుటుంబ సభ్యులు ఫోన్ లనూ ట్యాప్ చేసి తీవ్ర ఇబ్బందులు పెట్టారు.జగన్ కేసీఆర్ అవినీతి సొమ్ములు దుబాయ్ తరలించడంలో చెవిరెడ్డి ముఠా కీలక పాత్ర పోషించింది. సిబిఐ కి మద్యం కుంభకోణం కేసు అందిస్తే మరిన్ని నిజా నిజాలు బయటకు వస్తాయి. టీటీడీలో ఇప్పటికి కొంతమంది వైసిపికి సంబంధించిన అధికారులు ఉన్నారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో చెవిరెడ్డి పాత్ర కూడా ఉందని నా అనుమానం తుమ్మలగుంట దేవస్థానాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ముఖ్యమంత్రికి, దేవాదాయ శాఖ మంత్రికి త్వరలోనే లేఖ రాస్తానన్నారు. తుమ్మలగుంట దేవాలయంలో జరిగిన అవినీతీని బయటకు తీస్తాను.చంద్రగిరి నియోజకవర్గ ప్రజల ముందు చెవిరెడ్డి నటించిన నటనలు ప్రజలు తెలుసుకున్నారని ఎమ్మెల్యే పులివర్తి నానీ అన్నారు.

# వైసీపీ పాలనలో దిగజారిన టీటీడీ ప్రతిష్ట

**గొల్ల నరసింహయాదవ్ ధ్వజం**



తిరుపతి, (చైతన్యరథం): వైసీపీ పాలనలో టీటీడీ అన్యాయాలు అక్రమాల పుట్టగా మార్చేశారని, సాక్షగాత్తు వైకుంఠ వాసుడే స్పందించి గత ఎన్నికల్లో అధికారం నుండి పీకేశాడని ఆంధ్ర రాష్ట్ర యాదవ సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్ల నరసింహయాదవ్ పేర్కొన్నారు. తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిఘా వర్గాలు సూచనల మేరకు భద్రతలకు సంబంధించి ఇచ్చిన సూచనలను వక్రీకరిస్తూ పీఠాధిపతులు, మఠాలపైన దాడులు చేస్తున్నారని భూమన కరుణాకర్ రెడ్డి రెచ్చ కొట్టే విధంగా రాజకీయ స్వార్థం కోసం విష ప్రచారం చేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో శ్రీవారి ప్రతిష్టను తిరుమల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇచ్చిన చరిత్ర శ్రీవారి భక్తులు అందరికీ తెలుసన్నారు. దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి, జగన్ రెడ్డి హయాంలో ఏ విధంగా తిరుమల ప్రతిష్టను దిగజార్చారో భక్తులందరికీ తెలుసన్నారు. వైవీ సుబ్బారెడ్డి మీరు ఏ విధంగా తిరుమల ప్రతిష్టను దిగజార్చారో ప్రజలు అందరికీ గుర్తేనన్నారు. ముఖ్యంగా ఏడుకొండలు మూడు కొండలని చెప్పడం, లడ్డూలో నెయ్యిని కల్తీ చేయడం, శ్రీవాణి ట్రస్ట్ పేరుతో నిధులు దుర్వినియోగం, దర్శనాలను భారీగా అమ్ముకోవడం, అవసరం లేకున్నా కమిషన్ల కోసం సివిల్ కాంట్రాక్ట్ పనులుల్లో చేతివాటం అందరికీ తెలుసన్నారు. అన్య మత ప్రచారం తిరుమలలో మీ పరిపాలనలో ఏ విధంగా సాగిందో తెలుసన్నారు. మీ నాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రశాంతమైన నెల్లూరు చిత్తూరు జిల్లాలో పర్యటనలు సాగించి ఏ విధంగా ప్రజల్ని అసత్య ప్రచారాలతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ పర్యటనలు చేస్తున్నది ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇలాంటి రాజకీయాలు మీరు చేస్తూ పోతే "మీ పార్టీని ఆంధ్రప్రదేశ్ నుండి ప్రజలు శ్రీవారి భక్తులు రాష్ట్రం విడిచి వెళ్లే విధంగా తరిమి కొడతారు" అని నరసింహ యాదవ్ తెలియజేశారు



దగదర్తి, చైతన్యరథం): మండలం, దుండిగం గ్రామ పంచాయతీలోని పందల పెంచలమ్మ కుమార్తె జీవనోపాధికి కుట్టు మిషన్ ను అందించమని అభ్యర్థించిన మేరకు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మాలేపాటి భానుచందర్ వారి నివాసానికి వెళ్లి నూతన కుట్టు మిషన్ ను అందించడం జరిగింది. ఈ సందర్భంగా అక్కడి మహిళలు మాలేపాటి భానుకు కృతజ్ఞతలు తెలుపుతూ.. శాలువా వేసి పూలమాలలతో సత్కరించారు

# ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

**పాల్గొన్న ఐసీడీఎస్ అధికారులు, టీడీపీ నేతలు**

నెల్లూరు, (చైతన్యరథం): ఐసీడీసీ ఆధ్వర్యంలో అంగన్వాడీ సిబ్బంది, గర్భవతులతో కలిసి కలిసి తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిడిఓ అరుణ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. తల్లీ బిడ్డకు పాలివ్వడం వల్ల గర్భాశయ, రొమ్ము క్యాన్సర్లు వచ్చే అవకాశాలు తగ్గుతాయన్నారు. తల్లి బరువు తగ్గడానికి కూడా సహాయపడుతుందన్నారు. తల్లిపాలు తాగేటప్పుడు బిడ్డ పొజిషన్అవగాహన, తల్లిపాలు శ్రేష్టమని సీడీపీవో తెలిపారు. డాక్టర్ గణేష్ కుమార్ మాట్లాడుతూ తల్లిపాల వల్ల పుట్టిన శిశువుకు సరైన పోషణ అంది రోగ నిరోధక శక్తి పెరిగి, అలర్జీ, ఇన్ఫెక్షన్ల ప్రమాదం తగ్గుతాయని, తల్లి మానసిక ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయని వివరించారు. కూటమి ప్రభుత్వం మహిళా సంక్షేమ కోసమే పాటు పడుతుందని, ముఖ్యమంత్రి, నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ మంత్రి డాక్టర్ నారాయణ మహిళా సంక్షేమం అనేక స్వయం ఉపాధి కార్యక్రమాలు కూడా చేపడుతున్నారని మహిళలు ఆర్థికంగా బలపడాలనేది ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు సిటీ సిపిడిఓ అరుణ, 47 డివిజన్ ఇంచార్జ్ డాక్టర్ గణేష్, డివిజన్ అధ్యక్షులు కలవకుంట భాస్కర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ కవిత డాక్టర్ జిమెయిల్ సిద్దిక్, తిరుపతయ్య, ఉపాధ్యక్షులు మధురం బేటి మునిశేఖర్, సిద్ధ కళాచారి, కంచి కృష్ణ, నీలకంఠం మునికృష్ణ, షేక్ మా భాష, రాధా, అన్నపూర్ణ, విజయమ్మ అంగన్వాడీ టీచర్లు, గర్భవతులు, పిల్లల తల్లిదండ్రులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమపాలనలో దేశానికే దిక్సూచి సీఎం చంద్రబాబు

**- ఎమ్మెల్యే షాజహాన్, వెంకటేష్ వెల్లడి**

మదనపల్లె, (చైత్యరథం): సీఎం చంద్రబాబు నాయుడి సంక్షేమ పాలన దేశానికే దిక్సూచిగా నిలిచిందని ఎమ్మెల్యే షాజహాన్ బాషా,టీడీపీ రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేష్ పేర్కొన్నారు.సోమవారం నిమ్మనపల్లి ఎంపీడీవో కార్యాలయం నందు నూతనంగా మంజూరైన వితంతు పెన్షన్లను అధికారులు, స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన హామీలను సకాలంలో అమలు చేసి ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందన్నారు.అనంతరం ఆర్.జె.వెంకటేష్ మాట్లాడుతూ ఓవైపు రాష్ట్ర అభివృద్ధి,మరోవైపు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి పాలన సాగుతోందన్నారు.కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు సూపర్ సక్సెస్ కావడంతో ప్రజల జీవితాల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు.ఏడాది పాలనలో ప్రజలకు సుపరిపాలన అందించామన్నారు. ముఖ్యంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నా క్యాంటీన్లు వంటి పథకాలు దేశ చరిత్రలో సరికొత్త అధ్యాయమన్నారు.వైకాపా పాలనలో ప్రజా రాజధాని అమరావతి,ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తిగా మందగించిపోయాయన్నారు. మళ్లీ వాటి పనులు పునఃప్రారంభమై శరవేగంగా జరుగుతున్నాయన్నారు.దీంతో ప్రపంచ మేటి పారిశ్రామిక దిగ్గజాల దృష్టి ఏపీపై పడిందన్నారు.లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు వారి సుముఖంగా ఉన్నారని తెలిపారు.ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బాబు చొరవతో అనేక నూతన పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చాయన్నారు. ఇక ఎమ్మెల్యే షాజహాన్ బాషా నేతృత్వంలో మదనపల్లి నియోజకవర్గం ప్రగతి పథంలో పయనిస్తోందన్నారు.ముఖ్యంగా నిమ్మనపల్లి మండల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతున్నారని,మండలంలో మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేస్తున్నారని కొనియాడారు.ఆయన సారధ్యంలో మున్ముందు నియోజకవర్గం గణనీయమైన అభివృద్ధి సాధిస్తుందని ఆర్.జె ధీమా వ్యక్తం చేశారు. నూతనంగా వితంతువులు పెన్షన్లు మంజూరు వారికి కొండంత భరోసా లభించిందన్నారు.శరవేగంగా రాష్ట్ర అభివృద్ధి,ప్రజలకు మంచి జరుగుతుంటే వైకాపా నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు.ఇప్పటికైనా వారి విధానాలను మార్చుకోవాలని హితోపదేశం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి రెడ్డెప్ప రెడ్డి, సుజాత, మునిరత్న సుధాకర్ రావు, శ్రీపతి, ఓబుల్ రెడ్డి, మాజీ సర్పంచులు రమణ, రఫీ, రాజానాయుడు మధు తదితరులు పాల్గొన్నారు.



# సీఎం చంద్రబాబుకు నవధాన్యాలతో అభిషేకం

## సరైన సమయంలో రైతును ఆదుకున్నారన్న ఎమ్మెల్యే సునీత

రాప్తాడు, (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు సార్ ఖరీఫ్ సీజన్ లో సరైన సమయంలో మాకు ఆర్థిక సాయం చేశారంటూ రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం నసనకోట పంచాయతీకి చెందిన టిడిపి నాయకులు, రైతులు



కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో వెంకటాపురంలోని వ్యవసాయక్షేత్రంలో సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వినూత్న కార్యక్రమం చేపట్టారు. వ్యవసాయ పొలంలో రైతులు, మహిళా రైతులతో కలిసి సీఎం చంద్రబాబు చిత్రపటానికి నవధాన్యాలతో అభిషేకం చేశారు. సీఎం సార్ మీకి కృతజ్ఞతలు అంటూ రైతులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ లో రైతులకు సరైన సమయంలో ఆర్థిక చేయూతనందించే విధంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేశారన్నారు. దీనిపై అన్ని ప్రాంతాల్లోనూ రైతుల నుంచి హర్షం వ్యక్తమవుతోందన్నారు. మొదటి విడతగా 7000 రూపాయలు అందించారని.. మరో రెండు విడతల్లో 13 వేల రూపాయల సాయం అందుతుందన్నారు. దేవుడి దయవల్ల ఒక మంచి వర్షం కురిసినా జిల్లా వ్యాప్తంగా పంటల సాగవుతుందని ఆమె అన్నారు. ఇప్పటికే రైతులకు డ్రిప్పు, స్ప్రింక్లర్లు, డ్రోన్లు, గోకులం షెడ్లు వంటివి ఇచ్చి ప్రోత్సహిస్తున్నారని అన్నారు. ఈ ప్రభుత్వం ఎప్పటికీ రైతు పక్షపాతిగా నిలుస్తుందని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు.

# రోడ్డు పనుల పరిశీలన



**సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండల కేంద్రంలో సింగిరెడ్డిపల్లి క్రాస్ నుండి బస్టాండ్ వరకు 80 లక్షల రూపాయల నిధులతో నిర్మాణం జరుగుతున్న సీసీ రోడ్డు పనులని స్థానిక నాయకులు కార్యకర్తలతో కలసి పరిశీలించిన రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత**

# పులివెందులలో టీడీపీ జడ్పీటీసీ ఎన్నికల ప్రచారం

## పాల్గొన్న టీడీపీ జిల్లా అగ్రనేతలు శ్రీనివాసరెడ్డి, ఆదినారాయణరెడ్డి తదితరులు

పులివెందుల, (చైతన్యరథం): కడప జిల్లా టీడీపీ నాయకత్వం ఆధ్వర్యంలో పులివెందుల నియోజకవర్గంలోని పులివెందుల మండలానికి చెందిన తుమ్మలపల్లి గ్రామంలో ఎన్డీఏ కూటమి తరపున జడ్పీటీసీ అభ్యర్థిగా మారెడ్డి లతా రెడ్డి గెలుపు కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, కడప జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ విప్ జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, దేవిరెడ్డి సంజీవ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు. ప్రచారంలో భాగంగా ప్రజలతో నేరుగా కలుస్తూ అభ్యర్థిని పరిచయం చేస్తూ, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను నేతలు వివరించారు. మారెడ్డి లతా విజయం సాధిస్తే, స్థానిక సమస్యల పరిష్కారానికి మరింత ఉపయోగపడతారని, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం పెరుగుతుందని వారు తెలిపారు.



## దుండిగంలో మాలేపాటి పర్యటన

దగదర్తి, (చైతన్యరథం): దగదర్తి మండలం, దుండిగం గ్రామ పంచాయతీలో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మాలేపాటి భానుచందర్ పర్యటించారు. గ్రామంలో పిచ్చి చెట్లు మొలిచి స్థానికులకు తీవ్ర ఇబ్బందిని కలిగిస్తున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకురాగా తక్షణమే క్రొక్లెన్ ను పిలిపించి రెండు గంటలసేపు అక్కడే వేచి ఉండి క్లియర్ చేయించడం జరిగింది. అదేవిధంగా డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, విద్యుత్ లైట్లు వెలగకపోవడం మరికొన్ని విషయాలను స్వయంగా తెలుసుకుని త్వరితగతిన వాటి పరిష్కారానికి కృషి చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు తెలుగుదేశం పార్టీ నాయకులు పేపర్ల సూరిబాబు, వర్దినేని కృష్ణ, బత్తల ఏడుకొండలు, తాటిచెట్ల వెంకటేశ్వర్లు, మొలతాటి పవన్, దుండిగం పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు కొనంకి శివయ్య, రాంబాబు, పెంచలమ్మ, చెన్నూరు పంచాయతీ నుండి రమణమ్మ, అంకబాబు, మన్నూరు రమణయ్య, శ్రీనివాసులు, కొత్త వెంకట్రావు, తురిమెర్ల పంచాయతీ నుండి హరి, బ్రహ్మ, మారెళ్ళ పాడు గ్రామ టీడీపీ నాయకులు కృష్ణ, రంగసముద్రం నాయకులు మణి, ప్రభాకర్, కేశవులు, లింగాలపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# ప్రజాభీష్టమే కూటమి పాలనకు దిక్సూచి

## ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కొండాపురం, (చైతన్యరథం): ప్రజాభీష్టం మేరకే ప్రభుత్వం పని చేస్తుందని, అందుకు అనుగుణంగానే కూటమి ఎమ్మెల్యేలు పని చేస్తారని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. సోమవారం కొండాపురం మండలంలోని పొట్టి పల్లి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి గడపకు తిరిగి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారం మార్గాలను చూపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వరికుంటపాడు మండలం లోని వరికుంటపాడు పంచాయతీ లో ఉన్న జంగం రెడ్డిపల్లి గ్రామానికి సమీపంలో గత వైసిపి ప్రభుత్వం లోనే అనుమతులు ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఆ రోజు నుండి నేటి వరకు ప్రాతినిధ్యం వహిస్తున్న వరికుంటపాడు వైసిపి సర్పంచ్, నాడు అనుమతులు ఇస్తుంటే చూస్తూ ఉన్నారని, నేడు దానిని రాజకీయం చేస్తున్నారన్నారు. ప్రజలకు ఇబ్బందిగా ఉన్నప్పుడు,



ప్రజలకు అనుగుణంగా నడుచుకోవాల్సిన సర్పంచ్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించి, నేడు అమాయకులను, అడ్డం పెట్టుకొని, కొంతమంది రాజకీయ నాయకులతో చేయి కలిపి, రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ఆ రోజే అనుమతులు అడ్డుకొని ఉంటే ఈరోజు ఇంతవరకు వచ్చేది కాదన్నారు. లీగల్ గా అనుమతులు తెచ్చుకున్న తర్వాత, చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు ఉంటుందన్నారు. అధికార యంత్రాంగం గ్రామంలో ప్రజా వేదిక నిర్వహించిందని ఆ రోజు నుండి అలజడి సృష్టిస్తున్నారన్నారు. ఆ గ్రామం పక్కన మైనింగ్ పనులు ఎక్కడా జరగడం లేదని తెలిపారు. గత వారం రోజుల క్రితం గ్రామ పర్యటనలో ఉన్నప్పుడు నా దృష్టికి ఈ సమస్య తీసుకురాగా, చట్టవ్యతిరేకంగా ఎక్కడైనా మైనింగ్ జరుగుతుంటే చర్యలు చేపట్టవలసినదిగా అధికారులకు సూచించామన్నారు. హైవేపై రాస్తారోకో చేయకూడదు అన్న నిబంధన ఉన్నప్పటికీ, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డారన్నారు. అందులో భాగంగా పోలీసులు విచారిస్తున్న సమయంలో టిడిపి కార్యకర్త ఎస్.కె పిరయ్య కుప్పకూలారు అన్నారు. వారిని మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారని ఆ విషయాన్ని ఫోన్ ద్వారా వారి కుమారుడిని అడిగి తెలుసుకున్నానని తెలిపారు. వారికి మా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఎస్.కె పిరయ్య త్వరగా కోలుకొని ఆకాంక్షించారు. లీగల్ గా చేసుకునే పనులకు నేను అడ్డు కాదని ఇల్లీగల్ పనులు చేస్తే ఎంతటి వారినైనా సహించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడను అన్నారు. కనుక సమస్యలను కొని తెచ్చుకోకుండా, సామరస్యంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. ప్రజాభీష్టం మేరకే నడుచుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో కొండాపురం మండలం గ్రామ నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జిలు, తదితరులు ఉన్నారు.

# ఎర్రిపల్లెలో ఎన్నికల ప్రచారం

పులివెందుల, (చైతన్యరథ,): నియోజకవర్గం పులివెందుల మండలం ఎన్డీఏ కూటమి జడ్పీటీసీ అభ్యర్థిగా మారెడ్డి లతా రెడ్డిని అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని మంత్రి సవిత ప్రజలను కోరారు. పులివెందుల మండలం ఎర్రిపల్లె గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గ ఇన్చార్జి బీటెక్ రవి, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి, జెడ్పిటిసి అభ్యర్థి లతా రెడ్డి గారితో కలిసి ఎన్నికల ప్రచారంలో మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థిగా లతా రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..



# జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్రహోదా

**రాష్ట్రపతితో ప్రధాని, హోం మంత్రి వరుస భేటీలు - ఊపందుకున్న ఊహాగానాలు**



గంటల వ్యవధిలో ఆదివారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో వేర్వేరుగా రాష్ట్రపతి భవన్‌లో సమావేశమైన నేపథ్యంలో ఈ వరుస భేటీలపై ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడకపోయినప్పటికీ పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదా పునరుద్ధరణ కోసమేనంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం ఊపందుకుంది. ఆర్టికల్ 370ని రద్దుచేసి ఆరేళ్లు పూర్తవుతున్న తరుణంలో జరిగిన భేటీలతో ఈ తరహా చర్చ మొదలయింది. బ్రిటన్, మాల్దీవుల పర్యటన తర్వాత రాష్ట్రపతిని ప్రధాని మోదీ కలవడం ఇదే తొలిసారి. కొన్ని గంటల తర్వాత అమిత్‌షా కూడా ముర్ముతో సమావేశమయ్యారు. రాష్ట్రపతిని కలిసిన హోంమంత్రి తర్వాత జమ్మూకశ్మీర్ నేతలను కలిశారు. జమ్మూకశ్మీర్‌కు పత్యేక హోదాను కల్పించే 370 ఆర్టికల్‌ను కేంద్రం 2019 ఆగస్టు 5న రద్దు చేసింది. ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. సరిగ్గా ఆ తేదీకి రెండు రోజుల ముందే ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. కచ్చితమైన గడువు నిర్దేశించనప్పటికీ.. రాష్ట్రహోదా పునరుద్ధరణకు పలుమార్లు ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా ఇద్దరూ హామీ ఇచ్చారు. ఇక, బిహార్ ఓటర్ల జాబితాపై జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రత్యేక చర్చ కోసం పార్లమెంటులో విపక్షాలు పట్టుబడుతున్న నేపథ్యంలో అటు ప్రధాని.. ఇటు హోంమంత్రి రాష్ట్రపతిని కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదిలా ఉంటే.. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా రద్దు రాజ్యాంగబద్ధమేనని 2023లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. "అప్పట్లో పరిస్థితుల దృష్ట్యా ఆర్టికల్ 370ని ప్రవేశపెట్టారు. అది తాత్కాలిక ఏర్పాటు మాత్రమే గానీ.. శాశ్వతం కాదు. దాన్ని రద్దు చేసే అధికారం రాష్ట్రపతికి ఉంది" అని స్పష్టం చేసింది. కాగా జమ్మూకశ్మీర్‌కు గతేడాది జరిగిన ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) కాంగ్రెస్ కూటమి విజయం సాధించగా.. కేంద్రపాలిత ప్రాంతంగా మారిన జమ్మూకశ్మీర్‌కు తొలి సీఎంగా ఒమర్ అబ్దుల్లా బాధ్యతలు స్వీకరించారు. అప్పటినుంచి రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోసం ఆయన డిమాండ్ చేస్తూనే ఉన్నారు. "2014లో మీరు ఇక్కడికి వచ్చినప్పుడు నేను రాష్ట్రానికి సీఎంగా ఉన్నాను. నేను ఇప్పుడు ఒక కేంద్రపాలిత ప్రాంత సీఎంగా డిమోట్ అయ్యాను. అప్పుడు రైల్వేశాఖ సహాయమంత్రిగా ఉన్న వ్యక్తికి లెఫ్టినెంట్ గవర్నర్‌గా ప్రమోషన్ వచ్చింది. త్వరలో నాకు ప్రమోషన్ వస్తుందని. ఆశిస్తున్నా. దీన్ని సరిదిద్దడానికి ఎక్కువ సమయం పట్టదనుకుంటున్నాను" అని మోదీని ఒమర్ నేరుగా ప్రశ్నించిన సంగతి తెలిసిందే.

# గొలుసు కొట్టేశారని కేంద్ర హోంమంత్రికి ఫిర్యాదు

**- మహిళా ఎంపీ మెడలో గొలుసు చోరీ**



మహిళలు రోడ్డు మీద నడుస్తూ వెళుతుంటే వెనకనుంచి బండి మీద హఠాత్తుగా వచ్చి వారి మెడలోని గొలుసులు లాక్కెళ్తున్న ఘటనలు తరచూ వెలుగుచూస్తుంటాయి. అయితే ఏకంగా ఓ మహిళా ఎంపీకి కూడా అలాంటి పరిస్థితే ఎదురైంది. కాంగ్రెస్ నేత, పార్లమెంట్ సభ్యురాలు సుధా రామకృష్ణన్ ఢిల్లీలో మార్నింగ్ వాక్ చేస్తున్న సమయంలో తన మెడలోని చైన్ కొట్టేశారని ఆమె సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమిళనాడులోని మయిలాదుతురై పార్లమెంట్ నియోజకవర్గానికి సుధ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. డీఎంకే నాయకురాలు రజతితో కలిసి చాణక్యపురిలోని పోలండ్ ఎంబసీ సమీపంలో మార్నింగ్ వాక్ చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుందని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ దొంగతనంపై ఆమె కేంద్ర హోంమంత్రి అమిత్ కు కూడా లేఖ రాశారు. "ఉదయం 6.15-6.20 గంటల సమయంలో హెల్మెట్ పెట్టుకొని స్కూటీ మీద మాకు ఎదురుగా వచ్చిన ఒక వ్యక్తి మెడలోని బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడని పేర్కొన్నారు. మాకు ఎదురుగా బండిపై నిదానంగా వస్తుండటంతో అతడిని మేం చైన్ స్నాచర్గా అనుమానించలేదు. అతడు బలంగా గొలుసు లాగడంతో నా మెడమీద గాయాలయ్యాయి. నా డ్రెస్ కూడా కొద్దిమేర చినిగింది. కిందపడిపోకుండా ఎలాగోలా ఆగాను. తర్వాత మేమిద్దరం సహాయం కోసం ఎదురుచూశాం. కొద్ది సేపటికి పెట్రోలింగ్ వాహనం కనిపించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఇలాంటి అత్యంత భద్రత కలిగిన ప్రాంతంలో ఎంపీగా ఉన్న ఒక మహిళపై జరిగిన ఈ దాడి దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ప్రదేశంలోనే ఒక మహిళ సురక్షితంగా నడిచే పరిస్థితి లేకపోతే.. ఇక ఇతర ప్రాంతాల్లో రోజూవారీ పనులను మేం ఎలా ధైర్యంగా పూర్తి చేసుకోగలం..? ఈ ఘటన వల్ల నాకు మెడపై గాయాలయ్యాయి. నాలుగు సవర్ల గొలుసును పోగొట్టుకున్నాను. ఇదంతా నన్నెంతో బాధిస్తోంది" అని ఆమె లేఖలో పేర్కొన్నారు. ఆ నిందితుడిని గుర్తించి, త్వరగా న్యాయం జరిగేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని హోంమంత్రిని కోరారు. ప్రస్తుతం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగుతుండటంతో ఆమె ఢిల్లీలో ఉన్నారు. ఇక ఈ చాణక్యపురిలో పలు దేశాల దౌత్య కార్యాలయాలు, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన అధికారిక భవనాలు ఉంటాయి.

## బిహార్ మాజీ డిప్యూటీ సీఎం

# తేజస్వీ యాదవ్‌పై కేసు నమోదు

**- వేడెక్కుతున్న ఎన్నికల రాజకీయాలు**



ఆర్జేడీ నేత, బిహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్‌పై పట్నాలోని దిఘా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు నమోదైంది. ఆయనకు రెండు ఓటర్ ఐడీ కార్డులు ఉన్నాయంటూ న్యాయవాది రాజీవ్ రంజన్ చేసిన ఫిర్యాదుపై పోలీసులు ఇంకా ఎస్ఐఆర్ నమోదు చేయాల్సి ఉంది. శనివారం తేజస్వీ ఓ ఎన్నికల సభలో మాట్లాడుతూ తన పేరు సరికొత్త ఓటర్ల జాబితా నుంచి మాయమైందని ఆరోపించారు. దీంతో ఒక్కసారిగా అప్రమత్తమైన ఎన్నికల అధికారులు జాబితాలను తెప్పించుకొని వెతికారు. బిహార్ యానిమల్ సైన్సెస్ విశ్వవిద్యాలయం లైబ్రరీ బిల్డింగ్లోని పోలింగ్ బూత్ 204లో దానిని గుర్తించారు. జాబితాలో 416 నెంబర్‌లో తేజస్వీ వివరాలున్నాయని పేర్కొన్నారు. ఆయన ఎపిక్ నెంబరును ఆర్ఏబీ 456228గా పేర్కొన్నారు. కానీ, తన ఎపిక్ నెంబర్ ఆర్ఏబీ 916120గా వెల్లడించారు. అధికారులు మాత్రం ఆ సంఖ్యతో తాము ఆయనకు ఎపిక్ నెంబర్ జారీ చేయలేదని పేర్కొన్నారు. దానిని తమకు అప్పగిస్తే.. దర్యాప్తు చేస్తామని చెప్పారు..

వాస్తవానికి అంతకు ముందు తేజస్వీ ఎన్నికల కమిషన్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ అసలు తన పేరే ఓటర్ జాబితాలో లేదని సంచలన ప్రకటన చేశారు. బీహార్లో ఓటర్ల ముసాయిదా జాబితాను ఈసీ విడుదల చేసిన రోజే ఎన్నికల కమిషన్ భాజపా కోసం ఓట్లను చోరీ చేసిందంటూ ప్రతిపక్ష నేత రాహుల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అదే సమయంలో తేజస్వీ ప్రకటన రావడం గమనార్హం. దీనిపై భాజపా నాయకులు మండిపడ్డారు. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ స్పందిస్తూ రాహుల్, తేజస్వీ అబద్ధాలను వ్యాప్తి చేస్తున్నారని మండిపడ్డారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు.

# గిరిజన పోరాట వీరుడు స్వర్గీయ శిబూసోరెన్

**రాష్ట్రపతి, ప్రధాని సహా ప్రముఖుల సంతాపం**




ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబూ సోరెన్ (81) కన్నుమూసిన విషయం తెలిసిందే. మూత్రపిండాల సమస్యతో బాధపడుతూ.. ఢిల్లీలోని సర్ గంగారాం ఆస్పత్రిలో ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం ప్రకటించారు. రాష్ట్రపతి, ప్రధాని వేర్వేరుగా ఆస్పత్రిని సందర్శించి, శిబూ సోరెన్ భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన తనయుడు, ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌ను పరామర్శించారు. గిరిజన, పేద, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించేందుకు శిబూ సోరెన్ ఎనలేని కృషి చేశారని ఈ సందర్భంగా ప్రధాని మోదీ పేర్కొన్నారు. అట్టడుగు స్థాయి నుంచి ప్రజాజీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తదితరులు శిబూ సోరెన్‌కు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. శిబూ సోరెన్ భౌతికకాయాన్ని సాయంత్రం 4 గంటల సమయంలో రాంచీకి తరలించి, అనంతరం మొరాబాద్ ప్రాంతంలోని ఆయన నివాసానికి తీసుకెళ్తామని ఝార్ఖండ్ ఆరోగ్య మంత్రి ఇర్ఫాన్ అన్సారీ వెల్లడించారు. జేఎంఎం వ్యవస్థాపకుల్లో ఒకరైన, ఝార్ఖండ్ మాజీ సీఎం శిబూ సోరెన్‌కు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉంది. ఆయన ఎనిమిది సార్లు లోక్‌సభ రెండు సార్లు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. మూడు సార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటికీ,, ఒక్కసారి కూడా పూర్తికాలం పదవిని నిర్వహించలేకపోయారు. తండ్రి మరణంపై హేమంత్ సోరెన్ మీడియాతో మాట్లాడారు. "దేశ గిరిజన వీరుడు ఇక మన మధ్య లేరు. ఆయన చివరి క్షణం వరకు పోరాడారు. గొప్ప వ్యక్తిని కోల్పోయినందుకు మాటలు రావడం లేదు" అని పేర్కొన్నారు.

# ఆ పాఠశాలల్లో బోధన తీరే వేరు

**- ఏ ఫర్ అఖిలేశ్, డీ ఫర్ డింపుల్**
**- యూపీలో చదువుల రాజకీయం**

సాధారణంగా ఏ పాఠశాలల్లో అయినా విద్యార్థులకు 'ఏ ఫర్ ఆపిల్, బీ ఫర్ బాల్ అని బోధిస్తుంటారు. కానీ ఉత్తరప్రదేశ్‌లోని 'పీడీఏ పాఠశాలల్లో' మాత్రం ఏ ఫర్ అఖిలేశ్, బీ ఫర్ బాబా సాహెబ్ అంబేడ్కర్, డీ ఫర్ డింపుల్, ఎం ఫర్ ములాయం సింగ్ యాదవ్ అంటూ బోధించడం గమనార్హం. అసలేమయ్యిందంటే ఉత్తరప్రదేశ్, సహారన్ పూర్‌లోని కొన్ని ప్రాంతాల్లో భాజపా ప్రభుత్వం పలు ప్రభుత్వ పాఠశాలలను మూసివేసింది. ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ.. ఆ ప్రాంతాల్లో ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీ నేతలు 'పేడీఏ పాఠశాలలు' ఏర్పాటుచేశారు. స్థానిక సమాజ్‌వాదీ పార్టీ నేత ఫర్హాద్ ఆలం గడా ఆ పాఠశాలల్లో విద్యార్థులకు 'ఏ ఫర్ అఖిలేశ్, బీ ఫర్ బాబా సాహెబ్ అంబేడ్కర్, డీ ఫర్ డింపుల్, ఎం ఫర్ ములాయం సింగ్ యాదవ్ అని బోధిస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో అక్షరాలను రాజకీయాల కోసం వినియోగిస్తున్నారంటూ వారు పోలీసులకు ఫిర్యాదు. చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆయా పాఠశాలల యాజమాన్యంపై కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. వారు పిల్లలకు బోధిస్తున్న పాఠాలకు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్గా మారింది.

దీనిపై అఖిలేశ్ యాదవ్ స్పందిస్తూ.. విద్యార్థులకు చదువు చెప్పడంపై బ్రిటిషు వారు పాలించిన సమయంలో కూడా ఎస్ఐఆర్ నమోదు కాలేదని అన్నారు. తమపై తప్పుడు ఆరోపణలు చేస్తూ.. తాము నడిపిన పాఠశాలలను మూసివేయించడానికి ఇది భాజపా ప్రభుత్వం పన్నిన కుట్ర అని అన్నారు. ఈ చర్యలతో విద్యకు భాజపా ఎంత వ్యతిరేకమో ప్రజలకు అర్థమవుతోందని దుయ్యబట్టారు. తమ పాఠశాలల్లో విద్యతో పాటు సమాజ్‌వాదీ పార్టీకి చెందిన గొప్ప వ్యక్తుల గురించి అవగాహన కల్పిస్తున్నట్లు పార్టీ నేత ఫర్హాద్ అలం గడా పేర్కొన్నారు. భాజపా తమపై తప్పుడు కేసులు పెట్టడంతో భయపడి ఆగిపోమని, జిల్లావ్యాప్తంగా ఇటువంటి పాఠశాలలు మరిన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని అన్నారు.

# అటు బెదిరింపులు.. ఇటు ఆంక్షలు

### అమెరికా ఒత్తిడి వ్యూహం

అధికారంలోకి రాగానే రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేస్తానని చెప్పుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తన మాట చెల్లకపోవటంతో దుందుడుకు చర్యలకు దాగుతున్నారు. ఉక్రెయిన్ యుద్ధం ముగింపు వాగ్దానం విషయంలో పుతిన్ వద్ద ట్రంప్ పప్పులు ఉడక్కపోవడంతో.. అమెరికా అక్కసు బయటపెడుతోంది. నయానో భయానో రష్యాపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు తీవ్రంగా యత్నిస్తోంది. దీనిలో భాగంగా ఇప్పటికే రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ డిప్యూటీ ఛైర్మన్ దిమిత్రి మెద్వెదేవ్‌తో సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా వాగ్వాదం సాగిస్తోంది. దీంతో రష్యా మాజీ అధ్యక్షుడైన మెద్వెదేవ్.. తమ వద్ద 'డెడ్‌హ్యాండ్' ఆయుధ వ్యవస్థ ఉన్న విషయం గుర్తుంచుకోవాలని ట్రంప్‌ను నేరుగా హెచ్చరించారు. ఈ పరిణామంతో ఉలిక్కిపడిన అమెరికా.. రెండు అణు జలాంతర్గాములను రష్యాకు అత్యంత సమీపంలో మోహరించినట్లు ప్రకటించింది.

ఏ దేశమైనా రష్యాపై అణుదాడి చేస్తే.. వారిపై తక్షణమే ప్రతిదాడి చేసేలా 'డెడ్‌హ్యాండ్' అనే అత్యంత ప్రమాదకర వ్యవస్థను సోవియట్ హయాంలోనే సిద్ధం చేసింది. ప్రస్తుతం ఇది రష్యా ఆధీనంలో ఉంది. ప్రత్యర్థులు రష్యాపై అణుదాడి ఆలోచన చేయడానికి కూడా భయపడేలా ఈ వ్యవస్థను రూపొందించారు. రష్యా వద్ద అణ్వాయుధాలు ప్రయోగించే 700 వాహకాలు ఉన్నాయి. వీటిల్లో స్ట్రాటజిక్ బాంబర్లు, న్యూక్లియర్ సబ్‌మెరైన్లు, భూగర్భ బొరియల్లో దాచిన ఖండాంతర క్షిపణులు ఉన్నాయి. ఇందుల్లో కొన్ని ఆటోమేటిగ్గా శత్రువులపై దాడిచేయగలవు. ఒకవేళ ఇతర దేశాల అణుదాడిలో తమ న్యూక్లియర్ కమాండ్ తుడిచి పెట్టుకుపోయినా.. ప్రత్యర్థులపై అణ్వాస్త్రాలను సంధించేందుకు 'పెరిమీటర్' పేరిట ఒక వ్యవస్థను సోవియట్ సిద్ధం చేసింది. దీనిని అమెరికా, పశ్చిమ దేశాల్లో 'డెడ్ హ్యాండ్' గా వ్యవహరిస్తారు.



తాజాగా ఈ అంశంపై ట్రంప్ మాట్లాడుతూ తమ అణు జలాంతర్గాములు తగినచోటే మోహరించి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ అంశంపై మాట్లాడేందుకు పెంటగాన్, అమెరికా నౌకాదళం నిరాకరించాయి.

**రష్యా అణుజలాంతర్గామి స్థావరం దెబ్బతిందా..?**

జులై 30న రష్యాలో తూర్పు ప్రాంతంలో 8.8 తీవ్రతతో వచ్చిన భారీ భూకంపం కారణంగా రైబాచై నౌకాదళ స్థావరం తీవ్రంగా దెబ్బతిన్నట్లు పశ్చిమదేశాల పత్రికలు వెల్లడించాయి. దీనిలో మాస్కో పసిఫిక్ దళానికి చెందిన అణు సబ్‌మెరైన్లు ఉంటాయి. వీటిల్లో కొన్ని చెల్లాచెదురైనట్లు అంత్రా ఉపగ్రహ చిత్రాలు చెబుతున్నాయి. ఇక్కడ బోరై శ్రేణి, సోవియట్ కాలం నాటి డెల్టా జలాంతర్గాములను నిలిపినట్లు ది టెలిగ్రాఫ్ పత్రిక కథనంలో పేర్కొంది. ఇవి అమెరికా వైపు మోహరించడానికి అనువుగా ఉంటాయని వెల్లడించింది. మాస్కో జలాంతర్గాముల పరిస్థితిపై నీలినీడలు కమ్ముకున్న ఈ సమయంలో అమెరికా సబ్‌మెరైన్లను మోహరించడం గమనార్హం.

**భారత్‌పైనా ఒత్తిడి**

ట్రంప్ కార్యవర్గంలో శక్తిమంతమైన సహాయకుల్లో ఒకరైన డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ స్టీఫెన్ మిల్లర్.. భారత్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఉక్రెయిన్‌పై రష్యా చేస్తున్న యుద్ధానికి భారత్ పరోక్షంగా నిధులు సమకూరుస్తోందన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు ఆపాలని భారత్‌పై ట్రంప్ తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నవేళ ఈ ఆరోపణలు రావడం గమనార్హం. అయితే భారత్ చమురు కొనుగోళ్లను ఆపేస్తుందని ట్రంప్ బలంగా విశ్వసిస్తున్నారని మిల్లర్ చెప్పారు.

రష్యాను ఆర్థికంగా ఇబ్బంది పెట్టేందుకు ఆ దేశం నుంచి భారత్ చమురు కొనుగోళ్లను నిలిపివేయించేందుకు ట్రంప్ అన్ని అస్త్రాలూ ప్రయోగిస్తున్నారు. భారత్‌ను లక్ష్యంగా చేసుకుని ఎడాపెడా సుంకాలు, జరిమానాలు బాదేస్తున్నారు. అయితే అమెరికా ఒత్తిడి ఉన్నప్పటికీ, భారత్ మాత్రం రష్యా నుంచి చమురు కొనడం ఆపే సూచనలు కనిపించడం లేదు. రష్యా నుంచి చమురు దిగుమతులు కొనసాగిస్తామని భారత ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. 2021లో ఉక్రెయిన్ యుద్ధానికి ముందు భారత్ చమురు దిగుమతుల్లో కేవలం 3 శాతం మాత్రమే రష్యా నుంచి వచ్చేది. కానీ ఇప్పుడది 40 శాతానికి పెరిగింది.

## ట్రంప్ గోల్ఫ్ రిసార్ట్ వద్ద భద్రతా వైఫల్యం

**- దూసుకొచ్చిన ప్రయాణికుల విమానం**



అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు ఉండే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గోల్ఫ్ రిసార్ట్ వద్ద భద్రతా వైఫల్యం చోటు చేసుకుంది. న్యూజెర్సీలో బెడ్‌మినిస్టర్ లోని రిసార్ట్ సమీపంలోకి ఆదివారం ఒక ప్రయాణికుల విమానం దూసుకొచ్చింది. ఈ అనూహ్య పరిస్థితిని ఎదుర్కొనేందుకు యుద్ధ విమానాలు రంగంలోకి దిగాల్సి వచ్చింది. గోల్ఫ్ రిసార్ట్ వద్ద ఉన్న ఆంక్షలను ఉల్లంఘిస్తూ ప్రయాణికుల విమానం దూసుకొచ్చింది. ఆ విమానం రాకను గమనించిన యుద్ధ విమానాలు దానిని అడ్డుకున్నాయి. ఒక రకమైన జ్వాలను వెలిగించి ఆ వెలుగులతో ప్రయాణికుల విమానానికి హెచ్చరిక జారీ చేస్తూ.. ఆ ప్రాంతం నుంచి దానిని బయటకు పంపివేశాయి. ఇక, ఆ సమయంలో అధ్యక్షుడు ట్రంప్ రిసార్ట్‌లోనే ఉన్నారని నార్త్ అమెరికన్ ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్ వెల్లడించింది. వారాంతంలో ఈ తరహాలో ఏడు భద్రతా ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయని తెలిపింది. అధ్యక్షులు, ఇతర ఉన్నతస్థాయి నేతలు పర్యటించే ప్రదేశాల ఆధారంగా ఫెడరల్ ఏవియేషన్ ఎప్పటికప్పుడు గగనతల ఆంక్షలను సవరిస్తుంటుంది. ఇతర విమాన పైలట్లు వాటిని ఎప్పటికప్పుడు గమనించుకోవాలి. అలాకాని సందర్భంలోనే ఇలాంటి ఉల్లంఘనలు చోటుచేసుకుంటుంటాయి. ఇక ట్రంప్ వారాంతంలో గోల్ఫ్ క్లబ్‌కు వెళ్లి తిరిగి ఆదివారం సాయంత్రం అధ్యక్ష భవనానికి చేరుకుంటారు. ప్రస్తుతం ఈ ఘటనపై అధికారులు దృష్టిసారించి దర్యాప్తు చేస్తున్నారు.

## సముద్రంలో పడవ బోల్తా

***68 మృతి, 74 మంది గల్లంతు - యెమెన్‌లో ఘోర విషాదం***



యెమెన్‌లో ఘోర విషాదం చోటుచేసుకుంది. సముద్రంలో పడవ బోల్తా పడిన ఘటనలో ఏకంగా 68 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 74 మంది గల్లంతు అయ్యారు. ఆదివారం 154 మంది వలసదారులతో వెళుతున్న బోటు యెమెన్ అబ్యాన్ ప్రావిన్స్ దగ్గర ప్రమాదానికి గురై ఒక్కసారిగా సముద్రంలో బోల్తాపడింది. దీంతో 154 మంది నీటిలో పడిపోగా కేవలం 12 మంది మాత్రమే క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. మిగిలిన అందరూ నీటిలో మునిగిపోయారు.

54 మృతదేహాలు ఖాన్ఫర్ జిల్లాలోని సముద్ర తీరానికి కొట్టుకువచ్చాయి. 14 శవాలు వేరే ప్రాంతంలో కనిపించాయి. ఆ శవాలను మార్చురీకి తరలించారు. మిగిలిన 74 మంది కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కాగా, ఈస్ట్ ఆఫ్రికాకు చెందిన వలసదారులు పెద్ద సంఖ్యలో గల్ఫ్ దేశాలకు పనుల కోసం వెళుతుంటారు. స్మగ్లర్లు వారిని పడవల ద్వారా రెడ్ సీ, గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌ల మీదుగా అరబ్ దేశాలకు తరలిస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో పడవల్లో లెక్కకు మించి ఎక్కించుకుంటూ ఉంటారు. ఓవర్ లోడ్ కారణంగా ఆ పడవలు తరచుగా ప్రమాదాలకు గురవుతూ ఉంటాయి. గత కొన్ని నెలల్లోనే వందల మంది వలసదారులు పడవ బోల్తాపడిన ఘటనల్లో చనిపోయారు. మార్చి నెలలో ఏకంగా నాలుగు బోట్లు బోల్తా పడ్డాయి. ఈ ఘటనల్లో ఇద్దరు చనిపోగా.. 186 మంది గల్లంతయ్యారు. ఈ విషయాలను ఇంటర్ నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ వెల్లడించింది.

## ఈబీ-5 వీసాలపై భారతీయుల ఆసక్తి




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరితో గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నప్పటికీ ఆ దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు భారతీయుల్లో ఆసక్తి మాత్రం తగ్గటం లేదు. ఉద్యోగాలకు అవసరమైన హెచ్1బీ వీసాలు రావడం కష్టంగా మారినా.. వ్యాపారానికి అవసరమైన ఈబీ-5 వీసాలకు మాత్రం డిమాండ్ తగ్గలేదని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. త్వరలో ఈ వీసాలను ట్రంప్ ప్రకటించిన గోల్డ్‌కార్డులతో భర్తీ చేయనున్న విషయం తెలిసిందే.

తాజాగా ఈబీ-5 దరఖాస్తులకు సంబంధించిన డేటాను పరిశీలిస్తే.. గతంలో ఎన్నడూ లేనంతగా భారతీయులు దీనికోసం ఏడాది వ్యవధిలో దరఖాస్తు చేసుకొన్నట్లు అర్థమవుతుంది. గతేడాది ఏప్రిల్ 2024 నుంచి భారతీయుల్లో దీనికి ఆదరణ పెరిగింది. యునైటెడ్ స్టేట్స్ ఇమిగ్రేషన్ ఫండ్ (యూఎస్ఐఎఫ్) డేటా -2025 ఆర్థిక సంవత్సరం లో భారతీయుల నుంచి 1,200కు పైగా దరఖాస్తులు వచ్చాయని యూఎస్ఐఎఫ్ సీఎంవో నికోలస్ మాస్ట్రోన్నీ పేర్కొన్నారు.

ఇతర రకం వీసాల జారీలో పెద్దసంఖ్యలో బ్యాక్‌లాగ్ ఉండటంతో ఈబీ-5కు డిమాండ్ పెరిగిందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా హెచ్1బీ వీసాలు, గ్రీన్‌కార్డ్‌ల జారీ కష్టంగా మారడం కూడా దీనికి కారణమైంది. ఇప్పటివరకు ఇమిగ్రేషన్ సంస్థ వద్ద దాదాపు 1.1 కోట్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో వేగంగా లభించే ఈబీ-5 ను అమెరికా శాశ్వత నివాసానికి మార్గంగా ఎంచుకొంటున్నారు. వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే 'ఇన్వెస్ట్ ఇన్ ది యూఎస్ఏ' సంస్థ డేటా ప్రకారం 2024 ఆర్థిక సంవత్సరంలో భారతీయులకు 1,428 ఈబీ-5 వీసాలను జారీ చేశారు. అంతకుముందు ఏడాది ఈ సంఖ్య కేవలం 815 మాత్రమే.

***గ్రీన్‌కార్డ్ నిబంధనలు మరింత కఠినం***

అమెరికాలో గ్రీన్‌కార్డ్ కోసం అక్కడి ప్రభుత్వం నిబంధనలు మరింత కఠినతరం చేసింది. తాజాగా యూఎస్ సిటిజన్ షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) ఈ నిబంధనలను ప్రకటించింది. కుటుంబసభ్యులకు జారీ చేసే ఇమిగ్రెంట్ వీసాలకు కూడా స్క్రీనింగ్, వెట్టింగ్ ప్రక్రియను కఠినతరం చేసింది. అనర్హమైన అప్లికేషన్లు తొలగించేందుకు దీనిని చేపట్టినట్లు ప్రకటించింది. మరింత పకడ్బందీగా అర్హమైన వివాహాలను, సరైన కుటుంబసంబంధాలను గుర్తించేందుకు ఇది ఉపయోగపడుతుందని వెల్లడించింది. ఇక జాతీయ భద్రతకు ఇబ్బందిలేకుండా ప్రమాదకర వ్యక్తులను గుర్తించేందుకు కూడా ఇది ఉపయోగపడనుంది. కొత్త నిబంధనలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చాయి. వీటిని పెండింగ్‌లో ఉన్న, కొత్తగా దరఖాస్తు చేసుకొన్న వాటికి వర్తింపజేయనున్నారు.

నకిలీ వివాహాలు చేసుకొని అమెరికాలోకి ప్రవేశించే వారిని అరికట్టడం కూడా కొత్త నిబంధనల లక్ష్యం. ఇకనుంచి వివాహాలకు సంబంధించి అధికారులకు మరింత సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. వీటిల్లో జాయింట్ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్, ఫొటోగ్రాఫ్, మిత్రులు, బంధువుల నుంచి అభినందన పత్రాలు వంటివి ఉన్నాయి. దీంతోపాటు వీసా దరఖాస్తుదారులు వ్యక్తిగతంగా ఇంటర్వ్యూకు హాజరుకావాలి. స్పాన్సర్ గతంలో ఎవరికైనా స్పౌజ్ వీసాలు జారీ చేసినా.. ఇమిగ్రేషన్ రికార్డుల్లో తేడాలు ఉన్నా వాటిపై యూఎస్‌సీఐఎస్ మరింత లోతుగా దర్యాప్తు చేపడుతుంది.

## షరతులతో బందీలకు మానవతా సాయం: హమాస్ అంగీకారం

ఇజ్రాయెల్ భీకర దాడులతో గాజాలో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి, అక్కడి ప్రజల పరిస్థితి అత్యంతదారుణంగా మారిపోయింది. మరోవైపు హమాస్ చెరలో ఉన్న ఇజ్రాయెల్ బందీలు సైతం ఆకలితో అలమటిస్తున్నారు. ఇటీవల అక్కడి బందీలకు సంబంధించిన పలు దృశ్యాలు, వీడియోలు బయటకు వచ్చాయి. వాటిలో ఇజ్రాయెలీలు ఎముకల గూళ్లుగా మారిన శరీరాలతో దారుణస్థితిలో కనిపించడం పై ఆ దేశ ప్రధాని నెతన్యాహు తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. హమాస్ చెరలోని తమ బందీలకు మానవతా సాయం అందేలా చూడాలని రెడ్ క్రాస్ సంస్థను కోరారు. ఇన్నాళ్లు ఇజ్రాయెల్ బందీలను తీవ్ర హింసలకు గురిచేసిన హమాస్ సైతం ఈ విషయంలో కొంతమేరకు మనసు మార్చుకున్నట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ తమ షరతులకు అనుగుణంగా వ్యవహరిస్తే.. తమ వద్ద ఉన్న ఇజ్రాయెల్ బందీలకు సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటన విడుదల చేసింది. అయితే ఈ సహాయాన్ని అందించడానికి కేవలం అంతర్జాతీయ రెడ్ క్రాస్ కమిటీని మాత్రమే అనుమతిస్తామని వెల్లడించింది.

అయితే దీనిని కొనసాగించాలా, వద్దా అనే విషయం.. ఇజ్రాయెల్ మానవతా కారిడార్లను తెరవడం, గాజా ప్రజలకు మానవతా సాయం అందిస్తున్న సమయంలో వైమానిక దాడులను ఆపడం వంటి వాటిపై ఆధారపడుతుందని తెలిపింది. ఇజ్రాయెల్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం 50మంది పౌరులు హమాస్ వద్ద బందీలుగా ఉన్నారు. వీరిలో 20మంది మాత్రమే ప్రాణాలతో ఉన్నట్లు భావిస్తున్నారు. ఇజ్రా యెల్ పౌరులను బందీలుగా చేసుకున్న నాటి నుంచి నేటివరకు మానవతా సంస్థలు వారిని సంప్రదించకుండా హమాస్ నిషేధిం చింది. దీంతో వారి పరిస్థితి గురించి అధికారులకు గానీ, కుటుంబసభ్యులకు గానీ ఎటువంటి సమాచారం లేదు.

ఈ నేపథ్యంలో నిర్బంధంలో ఉన్న బందీల పరిస్థితిని వివరిస్తూ హమాస్ ఇటీవల కొన్ని వీడియోలు విడుదల చేసింది. ఓ భూగర్భ సొరంగంలో బందీగా ఉన్న యువకుడు ఎవ్యతార్ డేవిడ్ (24) బక్కచిక్కిన శరీరం, మాట్లాడేందుకు ఇబ్బందిపడుతున్నట్లు ఓ వీడియోలో కనిపించింది. తాను ఎదుర్కొంటున్న దీనస్థితిని వివరిస్తూ.. "రోజురోజుకు నా శరీరం క్షీణిస్తోంది. కుటుంబంతో గడిపే పరిస్థితి కనిపించడం లేదు. విడుదలకు సమయం మించిపోతోంది. నా సమాధిని నేనే తవ్వుకుంటున్నా" అని పేర్కొన్నాడు. ఈ వీడియోపై ఫ్రాన్స్, జర్మనీ, యూకే, అమెరికా వంటి దేశాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశాయి. గాజాలో బందీల పరిస్థితిపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి మంగళవారం ఉదయం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనుందని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

చైతన్యరథం

# లార్డ్స్‌లో అద్భుతం

## టీమిండియా సంచలన విజయం



- ఐదో టెస్ట్‌లో ఆరు పరుగులతో గెలుపు
- 5 మ్యాచ్‌ల సిరీస్ 2-2తో సమం
- ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సిరాజ్
- రెండో ఇన్నింగ్స్‌లో 5, తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు
- రాణించిన ప్రసిద్ధ కృష్ణ

లండన్: లార్డ్స్‌లో టీమిండియా అద్భుతం సృష్టించింది. ఇంగ్లాండ్‌తో ఉత్కంఠభరితంగా సాగిన ఐదో టెస్టులో సంచలన విజయం సాధించింది. హ్యారీ బ్రూక్ (111), జో రూట్ (105) శతకాలు బాదడంతో నాలుగోరోజు ఇంగ్లాండ్ 301/3తో గెలుపు వాకిట నిలిచినా భారత బౌలర్లు అద్భుతంగా పోరాడి జట్టును విజయతీరాలకు చేర్చారు. ఒక్కో వికెట్టూ పడగొడుతూ ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టారు. ఆఖరి రోజు సోమవారం మరింత విజృంభించి ఇంగ్లాండ్ చేతిలోంచి మ్యాచ్‌ను లాగేసుకున్నారు. ఈ మ్యాచ్‌లో భారత్ 6 పరుగుల తేడాతో గెలిచింది. ఇంగ్లాండ్ గడ్డపై భారత జట్టు మరుపురాని విజయం అందుకుని ఐదు మ్యాచ్‌ల అండర్సన్– టెండూల్కర్ ట్రోఫీని 2–2తో సమం చేసింది. ఈ మ్యాచ్‌లో భారత బౌలర్ల పోరాటం టెస్టు క్రికెట్ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతుంది. ఈ సిరీస్‌లో తొలి టెస్ట్‌ను ఇంగ్లాండ్ గెలుచుకోగా రెండో టెస్ట్‌లో భారత్ గెలిచింది. మూడో టెస్ట్‌లో ఇంగ్లాండ్ విజయం సాధించగా.. ఓటమి ఖాయమనుకున్న నాలుగో టెస్ట్‌లో టీమిండియా బ్యాటర్లు కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్, రవీంద్ర జడేజా, వాషింగ్‌టన్ సుందర్ అద్భుతమైన ప్రదర్శనతో మ్యాచ్‌ను భారత్ డ్రా చేసుకుంది. ఐదో టెస్ట్‌లో ఆరు పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను సమం చేసింది.

374 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్ నైట్ స్కోరు 339/6తో ఐదో టెస్ట్ ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లాండ్ 367 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లాండ్ విజయానికి 35 పరుగులు అవసరం కాగా.. ఆట ప్రారంభమయ్యాక తొలి ఓవర్లోనే జేమీ ఓవర్టన్ (9) రెండు ఫోర్లు బాదాడు. అయితే, మహ్మద్ సిరాజ్ వరుస ఓవర్లలో జేమీ స్మిత్ (2), ఓవర్టన్‌ను పెవిలియన్‌కు పంపి ఇంగ్లాండ్‌ను దెబ్బతీశాడు. కాసేపటికే. జోష్ టంగ్ (0)ని ప్రసిద్ధ క్లీన్ బౌల్డ్ చేశాడు. అప్పటికి ఇంగ్లాండ్ స్కోరు 357/9. ఫీల్డింగ్ చేస్తూ గాయపడిన క్రిస్ వోక్స్ భుజానికి పట్టీతోనే బ్యాటింగ్ చేయడానికి మైదానంలోకి వచ్చాడు.

అయితే, వోక్స్ ఒక్క బంతిని కూడా ఎదుర్కొలేదు. సిరాజ్ బౌలింగ్‌లో అట్కిన్సన్ సిక్స్ కొట్టడంతో మ్యాచ్ మరింత ఉత్కంఠగా మారింది. మళ్లీ బంతి అందుకున్న సిరాజ్.. అట్కిన్‌సన్‌ను క్లీన్‌బౌల్డ్ చేసి ఐదు వికెట్లు ఘనత పూర్తి చేసుకోవడంతోపాటు ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌ను ముగించాడు. మహ్మద్ సిరాజ్ 5, ప్రసిద్ధ కృష్ణ 4, ఆకాశ్ దీప్ ఒక వికెట్ పడగొట్టారు.

తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 224, ఇంగ్లాండ్ 247 పరుగులకు ఆలౌటయ్యాయి. రెండో ఇన్నింగ్స్‌లో టీమ్ ఇండియా 396 పరుగులు చేసింది.

రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 9 వికెట్లు పడగొట్టిన సిరాజ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. శుభ్‌మన్ గిల్, హ్యారీ బ్రూక్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ గా నిలిచారు. మ్యాచ్ అనంతరం టీమ్ ఇండియా ఆటగాళ్లు.. తమ అనుభవాలను పంచుకున్నారు.

### అత్యద్భుతం: శుభ్‌మన్ గిల్



సిరీస్ చివరి టెస్టులో రెండు జట్లూ అద్భుతంగా ఆడాయని టీమ్ ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. చివరి రోజుకు వచ్చేంత వరకు ఫలితం తేలకపోవడమే ఇందుకు నిదర్శనమన్నాడు. రెండు జట్లూ 'ఏ' గ్రేడ్ ఆట ఆడాయన్నాడు. మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ కృష్ణ లాంటి బౌలర్లుంటే కెప్టెన్ పని సులభమవుతుంది. మా ప్రదర్శన అత్యద్భుతం. ఇంగ్లాండ్‌పై తీవ్ర ఒత్తిడి ఉందన్న సంగతి మాకు తెలుసు. అది చివరి వరకు కొనసాగేలా చూసుకోవాలనుకున్నాం. అదే వ్యూహంతో ముందుకెళ్లాం. సిరాజ్ అద్భుత ప్రదర్శన చేశాడు. 2–2తో సిరీస్ సమమైందంటేనే ఇరు జట్లూ ఎంతలా ఆడాయో అర్థం చేసుకోవచ్చు. ఈ సిరీస్‌లో అత్యుత్తమ బ్యాటర్‌గా నిలవాలన్న లక్ష్యంతోనే ఆడా.. ఆ స్థితికి చేరుకోవడం చాలా సంతృప్తిగా ఉంది. గత ఆరు వారాల్లో నేర్చుకున్నది ఎప్పటికీ గుర్తుంచుకుంటామని గిల్ అన్నాడు.

### అదే లక్ష్యంతో బౌలింగ్ చేశా: సిరాజ్

మ్యాచ్ అనంతరం మహ్మద్ సిరాజ్ మాట్లాడుతూ.. కీలక ప్రదేశాల్లో బంతులు వేసి బ్యాటర్‌ను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా చేసుకున్నట్లు చెప్పాడు. వికెట్లు పడతాయా..లేదా? పరుగులు కొడతారా.. కొట్టరా? లాంటి విషయాలు అస్సలు పట్టించుకోలేదన్నాడు. బౌండరీ వద్ద హ్యారీ బ్రూక్ క్యాచ్‌ను అందుకున్న తర్వాత లైన్‌ను తాకుతాననుకోలేదన్నాడు. మ్యాచ్ పరిస్థితులను మార్చేసిన క్షణమది. ఆ తర్వాత బ్రూక్ అమాంతం జోరు పెంచేశాడు. టీ20లు ఆడినట్లు ఆడేశాడు. దీంతో మేం కొంచెం వెనకబడ్డాం. కానీ, ఏ దశలోనైనా గెలుస్తామన్న నమ్మకం నాకుండేది. అదే జరిగింది. ఆ భగవంతుడికి కృతజ్ఞతలని సిరాజ్ తెలిపాడు.

### భలే మజా: కేఎల్ రాహుల్



ఇంత మజా ఏ గెలుపూ ఇవ్వలేదని భారత ఓపెనర్ కేఎల్ రాహుల్ అన్నాడు. నేను చాలా ఏళ్లుగా క్రికెట్ ఆడుతున్నా. ఛాంపియన్స్ ట్రోఫీ సొంతం చేసుకున్నాం. ప్రపంచకప్‌ను కూడా గెలిచాం. కానీ, ఈ మ్యాచ్ అంత మజా ఏదీ ఇవ్వలేదు. టెస్టు క్రికెట్ మనుగడ సాగిస్తుందా? లేదా? అని చాలా మంది సందేహపడుతుంటారు. టీమ్ ఇండియా ఆట తీరుతో అది పటాపంచలైంది. ప్రతి మ్యాచ్‌లోనూ పోరాడాం. సిరీస్‌ను 2–2తో సమం చేశాం. సిరీస్ డ్రా అవ్వొచ్చుగానీ.. భారత్ మాత్రం టెస్టు క్రికెట్‌ను అగ్రస్థానంలో నిలిపింది. మార్పు ఇక్కడి నుంచే మొదలవుతుంది. భారత టెస్టు జట్టు ఎన్నో విజయాలు సాధిస్తుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి. అశ్విన్ లాంటి ఆటగాళ్లు లేకుండా సిరీస్‌లో అడుగుపెట్టాం. చాలా మంది వచ్చి ఇంగ్లీష్ జట్టు పరిస్థితులను గురించి అడిగేవాళ్లు. దీంతో నా అనుభవాలను పంచుకుంటూ వైవిధ్యమైన పాత్ర పోషించాల్సి వచ్చింది. జట్టును శుభ్‌మన్ గిల్ ముందుండి అద్భుతంగా నడిపించాడు. భవిష్యత్తో మంచి టెస్టు కెప్టెన్ అవుతాడన్న నమ్మకం ఉందని అని కేఎల్ రాహుల్ అన్నాడు.

### పంత్‌లా వోక్స్ కూడా..



ఐదో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో ఫీల్డింగ్ చేస్తూ తీవ్రంగా గాయపడిన ఇంగ్లాండ్ ఆటగాడు క్రిస్‌వోక్స్ మొదటి ఇన్నింగ్స్ లో బ్యాటింగ్‌కు రాలేదు. కానీ రెండో ఇన్నింగ్స్‌లో భుజానికి కట్టుతోనే బ్యాటింగ్‌కు వచ్చాడు. అయితే అతడికి ఒక్క బంతిని కూడా ఎదుర్కొనే అవకాశం రాలేదు. ఇదే సిరీస్ నాలుగో టెస్ట్‌లో టీమిండియా వికెట్ కీపర్, బ్యాటర్ రిషభ్ పంత్ పాదానికి గాయమైనా సరే బ్యాటింగ్‌కు దిగిన సంగతి తెలిసిందే.




# గిల్ సూపర్

## - గవాస్కర్

లండన్: టీమిండియా కెప్టెన్ అయిన తొలి సిరీస్‌లోనే శుభ్‌మన్ గిల్ అదరగొట్టాడు. బ్యాట్‌తో అద్భుతమైన ఆటతీరు చూపించాడు. తాజా ఇంగ్లండ్ సిరీస్‌లో పది ఇన్నింగ్స్‌ల్లో 754 పరుగులు చేశాడు. మరో 21 పరుగులు చేసి ఉంటే సునీల్ గవాస్కర్ ( వెస్టిండీస్‌తో సిరీస్‌లో 774) రికార్డును బద్దలుగొట్టేవాడు. ఆ రికార్డును గిల్ త్రుటిలో మిస్ అయ్యాడు. అయితే గిల్ ఆ రికార్డును బద్దలుకొట్టలేకపోయినప్పటికీ అప్పటి తన పెర్ఫార్మెన్స్‌తో పోల్చుకుంటే తాజా గిల్ ప్రదర్శనే అత్యుత్తమని గవాస్కర్ కొనియాడాడు.

ఒక సిరీస్‌లో 754 పరుగులు చేయడం అంటే సాధారణ విషయం కాదు. నా రికార్డును బద్దలుకొట్టలేకపోయి ఉండొచ్చు. కానీ, కెప్టెన్‌గా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటూ గిల్ చేసిన ఈ ప్రదర్శన నా రికార్డు కంటే అత్యుత్తమం. కెప్టెన్‌గా తొలి సిరీస్‌లో నేను ఈ స్థాయిలో ఆడలేదు. ఆ రికార్డు నెలకొల్పినపుడు నేను చిన్న పిల్లాడిని. నా మీద ఎలాంటి ఒత్తిడీ లేదు. నేను ఫెయిల్ అయినా నన్నెవరూ ప్రశ్నించలేరు. కానీ, ఇప్పుడు గిల్ పరిస్థితి వేరు. ఎలా చూసుకున్నా నా రికార్డు కంటే గిల్ తాజా ప్రదర్శన చాలా గొప్పది' అని గవాస్కర్ పేర్కొన్నాడు. తన రికార్డును బద్దలుకొట్టలేకపోయినప్పటికీ గిల్‌ను ప్రశంసిస్తూ అతడికి గవాస్కర్ ఓ బహుమతిని అందజేశాడు. తన సంతకంతో కూడిన టోపీని, టీషర్ట్‌ను అందించాడు. తాను చాలా తక్కువ మందికి మాత్రమే తన సంతకంతో కూడా టోపీని అందిస్తానని ఈ సందర్భంగా గిల్‌తో గవాస్కర్ చెబుతూ మైదానంలోనే అతడిని అభినందించాడు.



# సిరాజ్ రియల్ వారియర్

## - ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జో రూట్

లండన్: భారత పేసర్ మహ్మద్ సిరాజ్‌పై ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ ప్రశంసలు కురిపించాడు. అతడు రియల్ వారియర్. అద్భుతమైన క్యారెక్టర్ కలిగిన క్రికెటర్. అతడిలాంటి ఆటగాడు జట్టులో ఉండాలని కోరుకుంటారు. జట్టు కోసం పరితపిస్తాడు. కొన్నిసార్లు కోపం వచ్చినట్లు ప్రవర్తించినా.. అదేమంత ఎక్కువ సమయం ఉండదు. చాలా మంచోడు. నిరంతరం కష్టపడేతత్వం కలిగిన ప్లేయర్. అద్భుతమైన నైపుణ్యం ఉంది. అందుకే ఈ సిరీస్‌లో అతడు టాప్ వికెట్ టేకర్ కొనసాగుతున్నాడు. పనిపట్ల నిబద్ధత ఎక్కువ. అతడికి ప్రత్యర్థిగా ఆటను ఆస్వాదిస్తా. ఎప్పుడూ. నవ్వుతూ ఉండే సిరాజ్ వికెట్ల కోసం చాలా శ్రమిస్తాడు. యువ క్రికెటర్లకు స్ఫూర్తిగా నిలుస్తాడని రూట్ వ్యాఖ్యానించాడు.

# వేతనాల పెంపునకు టీఎఫ్‌సీసీ తిరస్కారం

సినీ కార్మికుల వేతన పెంపును నిర్మాతలంతా వ్యతిరేకించారని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) తెలిపింది. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. కార్మికుల వేతనాల పెంపుపై ఫిల్మ్ ఫెడరేషన్- ఫిల్మ్ ఛాంబర్ మధ్య కొన్ని రోజులుగా చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. తాము కోరినట్టుగా 30 శాతం వేతనం పెంచి ఇచ్చిన నిర్మాతల సినిమాల షూటింగ్స్ మాత్రమే వెళ్లేలా ఫెడరేషన్ తీసుకున్న నిర్ణయంపై చర్చల అనంతరం టీఎఫ్‌సీసీ ప్రకటన విడుదల చేసింది.




**టీఎఫ్‌సీసీ ప్రకటనలోని అంశాలివీ..**

తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఇప్పటికే చాలా ఇబ్బందికర పరిస్థితుల్లో ఉంది. ఇటువంటి సమయంలో వేతనాలు పెంచాలనడం, కార్మికశాఖ కమిషనర్ మార్గదర్శకత్వంలో, సామరస్యపూర్వక పరిష్కారం కోసం చర్చలు జరుగుతున్న సందర్భంలో ఫిల్మ్ ఫెడరేషన్ షూటింగ్‌ల నిలిపివేత నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదు. లేబర్ కమిషనర్ మాటను ధిక్కరిస్తూ 30 శాతం వేతనం పెంపు ఇస్తామన్న ప్రొడ్యూసర్ల నుంచి ఒప్పంద పత్రం తీసుకుని, సంబంధిత పత్రాన్ని ఫెడరేషన్ ద్వారా యూనియన్లకు తెలియజేశాకే విధులకు వెళ్లాలని నిర్ణయించడం బాధాకరం. ఇది నిజాయతీతో కూడిన చర్చల స్ఫూర్తిని దెబ్బ తీస్తుంది. వేతనాల పెంపును యూనియన్లు డిమాండ్ చేయడం చిన్న నిర్మాతలకు ఆమోదయోగ్యం కాదు. ఆ పెంపు వారు భరించే స్థాయిలో లేదు. అందుకే ప్రస్తుత పరిస్థితుల్లో నిర్మాతలందరూ ఏకగ్రీవంగా వ్యతిరేకించారు. కనీస వేతన చట్టం ప్రకారం.. ఏ కార్మికుడినైనా నియమించుకునే హక్కు నిర్మాతలకు ఉందని కార్మిక శాఖ కమిషనర్ స్పష్టం చేశారు. అదనంగా, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కూడా నిర్మాతల స్వయంప్రతిపత్తిని సమర్థిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఫెడరేషన్ల ఒత్తిడి, పోటీని నిరోధించే పద్ధతులను ఖండిస్తూ, అలాంటి నిబంధనలను అమలు చేయకుండా నిలువరించింది. జీవన వ్యయం విషయంలో మిగతా మెట్రోపాలిటన్ సిటీలతో పోలిస్తే మన హైదరాబాద్లో తక్కువ. అయినప్పటికీ మనం అన్ని యూనియన్ల వారికి ఎక్కువ వేతనాలు చెల్లిస్తున్నాం. ఇతర చలన చిత్ర పరిశ్రమల్లో ఇచ్చే వేతనాల కంటే తెలుగు రాష్ట్రాల్లో పని చేసే కార్మికులకు అధిక వేతనాలు ఇస్తున్నాం.

ఈ నేపథ్యంలో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఏకగ్రీవంగా ఓ తీర్మానం చేసింది. నిర్మాతలు ఇవ్వగలిగే వేతనానికి పని చేయాలనుకున్న వర్కర్స్ యూనియన్‌లో లేకపోయినా వారితో షూటింగ్ చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఎంతోమంది ఔత్సాహిక నిపుణులు/ కార్మికులు పని చేసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ యూనియన్లలో సభ్యత్వం కోసం రూ.లక్షలు డిమాండ్ చేస్తున్నారు. ఇండస్ట్రీలోకి వారు వచ్చేందుకు అవరోధం కలిగిస్తున్నారు. ఇది ఎంతోమంది కార్మికుల పొట్ట కొట్టడమే. ప్రాజెక్టు అవసరాలు, వ్యక్తుల సామర్థ్యం ఆధారంగా కార్మికులతో కలిసి పనిచేసే స్వేచ్ఛ నిర్మాతలకూ ఉంటుంది.

ఎవరైనా ఔత్సాహిక నిపుణులు/ కార్మికులు సినీ రంగంలో పనిచేయాలంటే వారితో పని చేయించుకోవడానికి నిర్మాతలందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. సభ్యత్వం కోసం రూ.లక్షలు ఇవ్వాల్సిన అవసరం లేదు. నైపుణ్యం ఉన్న కార్మికులకు పని కల్పించడమే మా ధ్యేయం.

ఇండస్ట్రీలో కళాకారులు, సాంకేతిక నిపుణులు,ఇతర స్టేక్ హోల్డర్స్ ఉంటారు.వీరందరితో పనిచేస్తూ ఒక సానుకూల నిర్ణయం వైపు తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి పని చేస్తుంది.

నిర్మాత లేనిదే సినిమా పరిశ్రమ లేదు. మన ఇండస్ట్రీ మనుగడ కోసం నిర్మాత శ్రేయస్సు అతి ముఖ్యమైన విషయం అని కార్మిక సంఘాలు మరోసారి గుర్తించాలి.

# కామెడీని మరోస్థాయికి తీసుకెళతారు




తనదైన శైలిలో మాట్లాడుతూ తెర వెనుకా నటుడు బ్రహ్మానందం నవ్వులు పంచుతుంటారు. సినిమాల వేడుకలైతే మరీ సరదాగా ఉంటారు. సోమవారం నిర్వహించిన 'గుర్రం పాపిరెడ్డి' టీజర్ లాంచ్ ఈవెంట్లో మరోసారి తన మార్క్ కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్నారు. 'నాతో సమానమైన వ్యక్తి..' అంటూ ఆ సినిమా నిర్మాతల్లో ఒకరైన జయకాంత్ (బాబీ) గురించి మాట్లాడారు. ఆ ప్రొడ్యూసర్ ప్రయాణాన్ని వివరిస్తారేమో అని అనుకునేలోగా 'ఎత్తులో నాతో సమానమైన వ్యక్తి' అని బ్రహ్మానందం అనడంతో అతిథులు కడుపుబ్బా నవ్వుకున్నారు.

ఆ సినిమాలో మరో కీలక పాత్ర పోషించిన యోగిబాబు గురించి బ్రహ్మానందం ప్రత్యేకంగా మాట్లాడారు. కోలీవుడ్లో యోగిబాబుకి ఎంతో క్రేజ్ ఉంది. ఆయన హీరోగా చేసిన ఓ కన్నడ సినిమాలో నేనూ నటించా. చాలా సైలెంట్‌గా ఉంటారాయన. కామెడీ చేసే వ్యక్తిలా కనిపించరు. కానీ, కామెడీని మరోస్థాయికి తీసుకెళ్లగలరని కొనియాడారు.యువ ప్రతిభతో అద్భుతాలు జరుగుతాయని, కొత్తవారు పరిశ్రమకు రావాలని కోరుకునే వ్యక్తినంటూ బ్రహ్మానందం పేర్కొన్నారు. అందుకే 'గుర్రం పాపిరెడ్డి'లో నటించానని తెలిపారు. నరేశ్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా హీరో-హీరోయిన్లుగా దర్శకుడు మురళీ మనోహర్ తెరకెక్కించిన చిత్రమిది. రాజ్‌కుమార్ కసిరెడ్డి, జీవన్ కుమార్, వంశీధర్‌లాంటి కమెడియన్లు కీలక పాత్రలు పోషించారు.

# ఉపాసనకు చిరంజీవి శుభాకాంక్షలు



తన కోడలు ఉపాసనకు అగ్ర కథానాయకుడు చిరంజీవి శుభాకాంక్షలు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ హబ్‌కు కో-చైర్ పర్సన్‌గా ఆ రాష్ట్ర ప్రభుత్వం ఉపాసనను నియమించటంతో చిరంజీవి సంతోషం వ్యక్తం చేస్తూ పోస్ట్ పెట్టారు. మా కోడలు ఉపాసన ఇప్పుడు తెలంగాణ స్పోర్ట్స్ హబ్‌కు కో-చైర్ పర్సన్. ఆమెను గౌరవప్రదమైన ఈ పదవిలో నియమించడం సంతోషంగా ఉంది. ఇది గౌరవం అనడం కన్నా కూడా బాధ్యతను మరింత పెంచిందని చెప్పాలి.

డియర్ ఉపాసన.. మీకున్న నిబద్ధత, ప్యాషన్‌తో క్రీడల్లో దాగి ఉన్న అపార ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తారని, ప్రతిభావంతులను అగ్ర స్థానంలో నిలబెట్టడానికి తగిన విధి విధానాలను రూపొందించడంలో నీ వంతు కృషి చేస్తావని ఆశిస్తున్నాను. సదా నీకు దేవుడు దీవెనలు తోడుగా ఉంటాయని చిరంజీవి పేర్కొన్నారు.

ఇలాఉంటే తెలంగాణ స్పోర్ట్స్ హబ్‌కు కో-చైర్ పర్సన్ బాధ్యతను అప్పగించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ఉపాసన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకం తనకెంతో గౌరవాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. సంజీవ్ గోయెంకాతో కలిసి పనిచేసే అవకాశం రావడం మరింత గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు.

# వచ్చే ఏడాది మే 1న జీ-2

తాను హీరోగా నటిస్తున్న 'జీ 2' మూవీపై అడివి శేష్ తాజా సమాచారం పంచుకున్నారు. సినిమా విడుదల తేదీని ప్రకటిస్తూ పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. 6 దేశాలు, 23 సెట్స్, దాదాపు 150 రోజులకు పైగా షూటింగ్.. అని ఈ సినిమా చిత్రీకరణ వివరాలు తెలిపారు. ఈ మూవీ 2026 మే 1న తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీలో విడుదల కానుందని తెలిపారు.

2018లో విడుదలై ప్రేక్షకులను థ్రిల్ చేసిన స్పై యాక్షన్ ఫిల్మ్ 'గూఢచారి'కి సీక్వెల్‌గా రూపొందుతోంది 'జీ 2'. ఈ మూవీకి వినయ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో శేష్ సరసన వామికా గబ్బీ నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ప్రతినాయకుడిగా కనిపించనున్నారు.



# మనుషులు ఇంత క్రూరంగా ఉంటారా..

సినిమా సెట్‌కు వెళ్లాక బోర్‌కొట్టకుండా ఉండాలంటే, ఎప్పటికప్పుడు ప్రయోగాత్మక పాత్రలు చేయాలని నటుడు నాగార్జున అన్నారు. ఆయన కీలక పాత్రలో నటించిన తాజా చిత్రం 'కూలీ'. రజనీకాంత్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ ఈ చిత్రాన్ని రూపొందించారు. ఆగస్టు 14న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో సోమవారం 'కూలీ' ప్రీ-రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగార్జునతోపాటు దర్శకుడు లోకేశ్ కనగరాజ్, సత్యరాజ్, శ్రుతి హాసన్, తదితరులు పాల్గొన్నారు.

'కూలీ' గురించి నాగార్జున ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఒకరోజు లోకేశ్ నన్ను కలిసి మీరు విలన్‌గా చేస్తానంటే మీకో కథ చెబుతా. లేదంటే కాసిన్ని సినిమా కబుర్లు చెప్పి టీ తాగి వెళ్లిపోతా అన్నాడు. ఆయన 'ఖైదీ' చూసిన తర్వాత ఎప్పటికైనా ఈ దర్శకుడితో పనిచేయాలని బలంగా అనుకున్నా. ఆ కోరికే అతడిని నాకు దగ్గర చేసింది. 'కూలీ' కథ చెప్పిన తర్వాత నాకు చాలా ఆసక్తిగా అనిపించింది. 'రజనీ సర్ ఈ కథ ఒప్పుకొన్నారా' అని అడిగా. ఎందుకంటే ఈ కథలో 'సైమన్' పాత్ర నిజంగా హీరోలాంటిది. ఇన్నేళ్ల నా కెరీర్‌లో మొదటిసారి లోకేశ్ కథ చెబుతుంటే రికార్డు చేసుకున్నా. ఇంటికి వెళ్లాక మళ్లీ మళ్లీ విన్నా. నాకు అనిపించిన కొన్ని మార్పులు చెప్పా. మరొకరైతే, తెల్లగా తీసుకుంటారు. లేదంటే ఆమూవీ నుంచి నన్ను తప్పించేవారు. కానీ, నేను చెప్పిన సూచనలను పరిగణనలోకి తీసుకుని 'సైమన్' పాత్రను లోకేశ్ డెవలప్ చేసిన విధానం నాకు నచ్చింది. రజనీ సర్ చెప్పినట్లు ఎప్పుడూ మంచి వాళ్లగానే సినిమాలో నటిస్తే బాగుండదు కదా.వైజాగ్‌లో మాఫస్ట్ షాట్ జరిగింది. రెండో రోజు షూటింగ్ సందర్భంగా రికార్డు చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. అది చూసి మనుషులు ఇంత క్రూరంగా ఉంటారా అనిపించిందని నాగార్జున అన్నాడు.' గతంలో నిన్నే పెళ్లాడతా చేసిన తర్వాత 'అన్నమయ్య' చేస్తుంటే.. ఇప్పుడెందుకు ఇలాంటి సబ్జెక్ట్ అని అందరూ వెనక్కిలాగే ప్రయత్నం. చేశారు. సెట్‌కు వెళ్లాక బోర్ కొట్టకూడదంటే, అప్పుడప్పుడు వైవిధ్యమైన పాత్రలు చేయాలి. నా కెరీర్‌లో చాలా ప్రయోగాలు చేశా. చాలా దెబ్బలు తిన్నా. మంచి విజయాలూ అందుకున్నానని నాగార్జున చెప్పారు.

